

ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక: 79 | ఎడిటర్: మేనం శ్యామ్ | గురువారం 08-10-2026 | పేజీలు: 10

సిరా చుక్క

తుపాకీ తుటాలు అక్కర్లేదు,
అణుబాంబుల మోతలు అసలే వద్దు,
ఖరీదైన ఆయుధాల దండయాత్రలు
ఈ దేశాన్ని కూల్చడానికి అవసరమే లేదు!
తెల్లటి ఖద్దరు చొక్కాల చాటున
నల్లటి నైజం దాచుకున్న
నాయకులు చాలు,
ఓట్ల వేటలో నీతులు వల్లించి
సీటు దక్కగానే నాశనం చేయడానికి!
స్వార్థపు రాజకీయాల విషపు గాలి పీల్చి,
అభివృద్ధిని అవినీతి కోరలకు బలిచేస్తూ...
సరిహద్దు శత్రువుల కంటే వేగంగాదేశపు
పునాదులనే తొలిచేస్తున్నారు!
బాంబులు తీసేది ప్రాణాలు మాత్రమే,
ఈ 'తెల్ల బాబులు' తీసేది ఏకంగా
దేశపు భవిష్యత్తే
తెలువకున్నరు..

రాగిపని బ్రహ్మచారి , నల్గొండ..



‘మనం సాధిస్తాం’..

2047 నాటికి వికసిత్ భారత్

- 25 ఏళ్ల ప్రజాసేవ పూర్తయిన సందర్భంగా ప్రధాని ప్రసంగం
- ప్రపంచంలోని తొలి మూడు ఆర్థిక వ్యవస్థల్లో భారత్ లక్ష్యం
- ఆత్మనిర్భర్ భారత్, ప్రపంచ తయారీ కేంద్రంగా ఎదగడమే ధ్యేయం
- ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వాలని సంకల్పం
- అంతరిక్షంలో మానవుడిని అడుగుపెట్టించడమే మరో లక్ష్యం
- 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్



ప్రధాని నరేంద్ర మోదీ



న్యూఢిల్లీ, ప్రజా వాయిస్: భారత్‌ను 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో దేశం మరింత వేగంగా ముందుకు సాగాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. తన 25 ఏళ్ల ప్రజాసేవ పూర్తయిన సందర్భంగా బుధవారం న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ‘మనం సాధిస్తాం’ అనే సంకల్పాన్ని ప్రజలతో కలిసి పునరుద్ఘాటించారు.

ఐదు కీలక లక్ష్యాలు

దేశం చిన్న లక్ష్యాలతో సంతృప్తి చెందకుండా భారీ ఆశయాలతో ముందుకు సాగాల్సిన సమయం ఇదేనని మోదీ అన్నారు. ప్రపంచంలోని తొలి మూడు ఆర్థిక వ్యవస్థల్లో భారత్‌ను నిలపడం, ఆత్మనిర్భర్ భారత్‌ను నిర్మించడం, ప్రపంచ తయారీ కేంద్రంగా ఎదగడం, ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వడం, అంతరిక్షంలో మానవుడిని అడుగుపెట్టించడం వంటి లక్ష్యాలను ఆయన ప్రస్తావించారు.

‘మనం సాధిస్తాం’

ప్రధాని ఒక్కో లక్ష్యాన్ని ప్రస్తావించినప్పుడు సభలో పాల్గొన్న వారు ‘మనం సాధిస్తాం’ అంటూ ఉత్సాహంగా స్పందించారు. ఈ నినాదం దేశ ఆత్మవిశ్వాసం, సమష్టి కృషికి ప్రతీకగా నిలుస్తుందని మోదీ పేర్కొన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ సాధించే వరకు దేశం విశ్రమించబోదని ఆయన స్పష్టం చేశారు.

సవాళ్ల మధ్య ఆర్థిక స్థిరత్వం

కరోనా మహమ్మారి, రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, మధ్యప్రాచ్య పరిణామాలు వంటి అంతర్జాతీయ సవాళ్ల మధ్య భారత్ ఆర్థికంగా స్థిరంగా ముందుకు సాగిందని ప్రధాని అన్నారు. గతంలో ప్రపంచ సంక్షోభాల సమయంలో భారత ఆర్థిక వ్యవస్థపై ఆందోళన వ్యక్తమయ్యేదని, ఇప్పుడు భారత్ ఆర్థిక స్థైర్యంపై ప్రపంచం చర్చిస్తోందని పేర్కొన్నారు.

తయారీ రంగానికి మరింత బలం

దేశీయ తయారీ రంగాన్ని మరింత బలోపేతం చేసి దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించాలని మోదీ పిలుపునిచ్చారు. ఆత్మనిర్భరత, ఉత్పాదకత, సాంకేతిక పురోగతితో భారత్ ప్రపంచ స్థాయిలో మరింత బలమైన ఆర్థిక శక్తిగా ఎదగాలని ఆకాంక్షించారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ సాధించడమే అంతిమ లక్ష్యమని స్పష్టం చేశారు.

19,892 మెగావాట్ల డిమాండ్..

కోతలు లేకుండా విద్యుత్ సరఫరా

- ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ డిమాండ్ పెరిగింది
- రికార్డు స్థాయిలో 19,892 మెగావాట్ల పీక్ డిమాండ్
- జెన్‌కో, ట్రాన్స్‌కో ప్రైవేటీకరణపై భట్టి స్పష్టత
- యాదాద్రి ప్లాంట్‌తో రూ.40 వేల కోట్ల భారం
- బొగ్గు లింకేజీ లేకుండానే ప్లాంట్ నిర్మించారని ఆరోపణ
- హరీశ్‌రావుకు భట్టి సూటి ప్రశ్నలు



హైదరాబాద్, ప్రజా వాయిస్: ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగిందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. పీక్ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరినా ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఇంతటి డిమాండ్‌ను ఎదుర్కొంటూ నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్న విద్యుత్ సంస్థల సిబ్బందిని అభినందించాల్సింది పోయి కొందరు విమర్శలు, అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు.

ప్రైవేటీకరణపై స్పష్టత

జెన్‌కో, ట్రాన్స్‌కో, విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రైవేటుపరం చేస్తారంటూ జరుగుతున్న ప్రచారాన్ని భట్టి ఖండించారు. అలాంటి ప్రతిపాదన ఏదీ లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలిగించేలా తప్పుడు ప్రచారం చేయవద్దని సూచించారు.


యాదాద్రి భారం ఎవరిది

యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై భట్టి విమర్శలు చేశారు. ప్లాంట్‌కు అవసరమైన జీ–9 రకం బొగ్గు సింగరేణి వద్ద అందుబాటులో లేదని తెలిసినా తగిన

మిగతా 2లో

ఉద్యోగులకు దసరా కానుక

- రెండు డీఏలు విడుదల
- 2024 జనవరి, జూలై డీఏలకు ప్రభుత్వం ఆమోదం
- రెండు విడతలు కలిపి 6.37 శాతం పెంపు
- నవంబర్ 1న అక్టోబర్ జీతంతో పెరిగిన డీఏ
- జనవరి 2024 బకాయిలు 33 వాయిదాల్లో చెల్లింపు
- జూలై 2024 బకాయిలు 27 వాయిదాల్లో జమ
- బకాయిలు ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాల్లోకి



2

జంతర్ మంతర్ దిశగా ప్రతిపక్షాల మార్చ్

- రాహుల్, ప్రియాంక అదుపులో
- ఎస్ఐఆర్‌పై ఢిల్లీలో మరోసారి ఉద్రిక్తత
- జంతర్ మంతర్‌కు వెళ్లకుండా ఎంపీలను అడ్డుకున్న పోలీసులు
- రోడ్డుపై బైఠాయించిన ప్రియాంక గాంధీ
- రాహుల్, ప్రియాంక సహా పలువురు నేతలు అదుపులోకి
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్
- ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని ప్రతిపక్షాల డిమాండ్



న్యూఢిల్లీ, ప్రజా వాయిస్: ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణపై ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ఇండియా కూటమి చేపట్టిన నిరసన బుధవారం మరోసారి ఉద్రిక్తతకు దారితీసింది. జంతర్ మంతర్ వైపు వెళ్తున్న ప్రతిపక్ష ఎంపీల బస్సులను ఢిల్లీ పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అనంతరం ఎంపీలు బస్సుల నుంచి దిగి రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు నేతలను పోలీసులు అదుపులోకి

మిగతా 2లో

నాగోల్‌లో మహిళ దారుణ హత్య

- నిర్జన ప్రదేశంలో మృతదేహం
- తట్టి అన్నారం సమీపంలో మహిళ మృతదేహం కలకలం
- మృతదేహంపై దుస్తులు లేకపోవడంతో అనుమానాలు
- కాళ్లు, చేతులు కనిపించకపోవడంపై పోలీసుల ఆరా
- మృతురాలు మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన మంగమ్మగా గుర్తింపు
- గత నెల 28న ఓయూ పోలీసులకు మిస్సింగ్ ఫిర్యాదు
- హత్యకు గల కారణాలపై దర్యాప్తు ముమ్మరం

2 లో

ఎస్ఐఆర్‌లో పేర్లు గల్లంతయ్యాయా? ప్రత్యేక ఓటరు నమోదు డ్రైవ్

- 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమం
- జాబితాలో లేని అర్హులైన ఓటర్లకు మళ్లీ అవకాశం
- కొత్తగా 18 ఏళ్లు నిండిన వారికి నమోదు
- పాత, ప్రస్తుత జాబితాలను పోల్చనున్న బీఎల్ఓలు
- ఇంటింటి పరిశీలనతో అర్హుల గుర్తింపు
- ఒక్కో బీఎల్ఓకు వారానికి 20–25 మంది లక్ష్యం



న్యూఢిల్లీ, ప్రజా వాయిస్: ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణపై రాజకీయ వివాదం కొనసాగుతున్న వేళ కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తయిన 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అర్హులైన ఓటర్ల నమోదుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల అధికారులను ఆదేశించింది. ప్రత్యేక సమగ్ర సవరణకు ముందు జాబితాలో పేరు ఉండి, సవరణ అనంతరం కనిపించని అర్హులైన ఓటర్లతో పాటు కొత్తగా ఓటు హక్కు పొందిన యువతను ఈ కార్యక్రమం ద్వారా నమోదు చేయనున్నారు.

పాత జాబితాలతో పోలిక

బూత్ స్థాయి అధికారులు ప్రత్యేక సమగ్ర సవరణకు ముందు ఉన్న ఓటర్ల జాబితాను, ప్రస్తుత జాబితాను పోల్చి పరిశీలిస్తారు. గతంలో పేరు ఉండి ప్రస్తుతం కనిపించని అర్హులైన ఓటర్ల వివరాలను గుర్తించి, అవసరమైతే ఇంటింటికీ వెళ్లి వారి ప్రస్తుత పరిస్థితిని ధ్రువీకరిస్తారు. అర్హత ఉన్నట్లు నిర్ధారణ అయితే ప్రామాణిక ఫారం–6 ద్వారా మళ్లీ నమోదు చేసుకునేందుకు సహకరిస్తారు.

యువ ఓటర్లపైనా దృష్టి

18 ఏళ్ల నిండిన కొత్త ఓటర్లు, ఇంకా నమోదు కాని యువ ఓటర్లను కూడా ఈ ప్రత్యేక కార్యక్రమంలో గుర్తించి నమోదు చేయనున్నారు. ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ అని, ప్రత్యేక సమగ్ర సవరణలో పేరు లేకపోయిందనే కారణంతో అర్హులైన పౌరులకు నమోదు అవకాశాన్ని నిరాకరించరాదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

వారానికి 20–25 మంది

ప్రతి బూత్ స్థాయి అధికారి వారానికి కనీసం 20 నుంచి 25 మంది అర్హులైన ఓటర్లను పరిశీలించేలా లక్ష్యం నిర్దేశించారు. ఈ పరిశీలన కార్యక్రమాన్ని సుమారు నెల రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. గుర్తించిన ఓటర్ల వివరాలు, ఫారం–6 దరఖాస్తుల స్థితిని నమోదు చేయడంతో పాటు సంబంధిత ఎన్నికల నమోదు అధికారులకు నివేదికలు అందించనున్నారు.

ప్రత్యేక శిబిరాలు

ఓటరు నమోదును సులభతరం చేసేందుకు బూత్ స్థాయి శిబిరాలు నిర్వహించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. రాత్రి ఆశ్రయ కేంద్రాల్లో ఉంటున్నవారు, కార్మిక కాలనీలు, నిరాశ్రయులు, ఇతర అంచున ఉన్న వర్గాలకు ప్రత్యేకంగా నమోదు సదుపాయాలు కల్పించాలని సూచించింది. రాజకీయ పార్టీల ప్రతినిధులతోనూ గుర్తించిన వివరాలను పంచుకునేలా ఆదేశాలు జారీ చేసింది.


వివాదాల వేళ కీలక నిర్ణయం

ప్రత్యేక సమగ్ర సవరణపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఈ ప్రత్యేక కార్యక్రమానికి ప్రాధాన్యం ఏర్పడింది. అయితే ఎన్నికల సంఘం మాత్రం అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితాలో చోటు కోల్పోకుండా చూడడమే లక్ష్యమని పేర్కొంది.

నిరంజన్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకో

- జూపల్లి హెచ్చరిక
- అసత్య ప్రచారం చేస్తే పరువునష్టం, క్రిమినల్ కేసులు
- రాజకీయ భిక్ష పెట్టానని చెప్పడం హాస్యాస్పదం
- కబ్జాలు, మోసాలతో రాజకీయాల్లోకి రాలేదు
- ప్రజలకు వాస్తవాలు తెలుసన్న మంత్రి
- రైతుల పంటలను కాపాడేందుకు చర్యలు
- ఎంజీకేఎల్ఐ పంపులు నడిపేందుకు ప్రయత్నాలు

2 లో



19,892 మెగావాట్ల డిమాండ్..
కోతలు లేకుండా విద్యుత్ సరఫరా

మొదటి పేజీ తరువాయి

బొగ్గు అనుసంధానం లేకుండా ప్లాంట్ నిర్మించారని ఆరోపించారు. యాదాద్రి కారణంగా రాష్ట్రంపై దాదాపు రూ.40 వేల కోట్ల అదనపు భారం పడుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా యాదాద్రికి బొగ్గు సరఫరా సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యామ్నాయ వనరులపై చర్యలు చేపడుతోందని అధికారిక ప్రకటనలో పేర్కొంది.

హరీశ్‌రావుకు సవాల్

యాదాద్రి ప్లాంట్‌కు సరైన బొగ్గు లింకేజీ ఎందుకు ఏర్పాటు చేయలేదని మాజీ మంత్రి హరీశ్‌రావును భట్టి ప్రశ్నించారు. 2016లో 14 మిలియన్ టన్నుల అవసరానికి ఏడు మిలియన్ టన్నులు సింగరేణి నుంచి, మరో ఏడు మిలియన్ టన్నులు దిగుమతి చేసుకునేలా ఒప్పందం జరిగిందని, 2022లో మొత్తం 14 మిలియన్ టన్నులు సింగరేణి నుంచే సరఫరా చేసేలా మరో ఒప్పందం జరిగిందని చెప్పారు. అయితే సింగరేణిలో అవసరమైన జీ-9 బొగ్గు అందుబాటులో లేదని పేర్కొన్నారు.

మణుగూరులో ప్రత్యామ్నాయ ప్రణాళిక

తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా విద్యుత్ ఉత్పత్తిని పెంచుతోందని భట్టి తెలిపారు. మణుగూరు వద్ద మరో విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. థర్మల్ విద్యుత్ ఉత్పత్తి తగ్గుతోందన్న విమర్శలను ఆయన ఖండిస్తూ 89.6 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు వెల్లడించారు. యాదాద్రి విద్యుత్ ఉత్పత్తి వ్యయం యూనిట్‌కు రూ.6.66గా ఉందని, ఇది ఇతర రాష్ట్ర థర్మల్ కేంద్రాలతో పోలిస్తే అధికమని తెలిపారు.

వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి

పదేళ్లు మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు విద్యుత్ రంగంపై మాట్లాడే ముందు వాస్తవాలను తెలుసుకోవాలని భట్టి సూచించారు. రాజకీయ లబ్ధి కంటే రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే తమకు ముఖ్యమని స్పష్టం చేశారు. యాదాద్రి ప్లాంట్‌కు సంబంధించిన పత్రాలను ప్రజల ముందుంచుతామని తెలిపారు.

ఎస్ఐఆర్ వెనక్కి వెళ్లాల్సిందే..



- జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి: రేవంత్
- ఓటు హక్కును హరించే కుట్ర జరుగుతోందని ఆరోపణ
- మోదీ ఆదేశాలతోనే ఎస్ఐఆర్ కొనసాగుతోందన్న సీఎం
- రాహుల్, ప్రియాంక, ఖర్గే అరెస్టుపై తీవ్ర ఆగ్రహం
- 'ఎస్ఐఆర్ గో బ్యాక్.. జీకే గో బ్యాక్' ఉద్యమం
- సీఈసీ రాజీనామా చేసే వరకు పోరాటం కొనసాగుతుందని ప్రకటన
- వీధుల నుంచి పార్లమెంట్ వరకు ఉద్యమిస్తామని స్పష్టీకరణ

హైదరాబాద్, ప్రజా వాయిస్: దేశ ప్రజల ఓటు హక్కును హరించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దేశంలో ఓటు హక్కు ఉన్నవారు, లేనివారు అంటూ రెండు వర్గాలను సృష్టించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకే ఎన్నికల సంఘం ద్వారా ప్రత్యేక సమగ్ర సవరణ కొనసాగుతోందని ఆయన ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు ప్రతిపక్షాల ఆరోపణల్లో భాగమని, ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వం మాత్రం ఎస్ఐఆర్‌ను ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియగా సమర్థిస్తున్నాయి.

రాహుల్ అరెస్టుపై మండిపాటు

ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేస్తే.. ఆయనపై చర్యలు తీసుకోవడం సరికాదని రేవంత్‌రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, మల్లికార్జున్ ఖర్గే సహా ప్రతిపక్ష నేతలను పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా నిరసన తెలిపే నేతలను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యంపై దాడి చేసినట్లేనని వ్యాఖ్యానించారు.

ఎస్ఐఆర్ గో బ్యాక్.. జీకే గో బ్యాక్

స్వాతంత్ర్య ఉద్యమంలో 'సైమన్ గో బ్యాక్' నినాదం కీలకంగా నిలిచిందని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ఇప్పుడు దేశంలో 'ఎస్ఐఆర్ గో బ్యాక్', 'జీకే గో బ్యాక్' ఉద్యమం కొనసాగుతోందని పేర్కొన్నారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

ఓటు హక్కును కాపాడతాం

భారత రాజ్యాంగం ప్రజలకు కల్పించిన ఓటు హక్కును ఎవరూ లాక్కోలేరని సీఎం అన్నారు. గతంలో రాజకీయ ప్రత్యర్థులపై ఈడీ, సీబీఐ, ఆదాయపు పన్ను శాఖలను ఉపయోగించుకున్నారని ఆరోపించిన ఆయన.. ఇప్పుడు ఎన్నికల సంఘాన్ని కూడా రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారని విమర్శించారు. ఓటర్ల పేర్ల తొలగింపుపై కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.

ప్రజలే తుది తీర్పు ఇస్తారు

ప్రజలు జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారని రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజల హక్కులను కాలరాసిన వారు చరిత్రలో తప్పించుకోలేదని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా ప్రతిపక్షాల డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

వీధుల నుంచి పార్లమెంట్ వరకు

రాజ్యాంగ పరిరక్షణ కోసం వీధుల నుంచి పార్లమెంట్ వరకు పోరాటం కొనసాగుతుందని సీఎం స్పష్టం చేశారు. ఇది కాంగ్రెస్ పార్టీకి మాత్రమే పరిమితమైన ఉద్యమం కాదని, ఇండియా కూటమి, ప్రజల ఉద్యమమని అన్నారు. ప్రజలు ఒక్కటై గొంతెత్తితే ప్రభుత్వం స్పందించాల్సిందేనని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగుతూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తారని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

నాగోల్‌లో మహిళ దారుణ హత్య

హైదరాబాద్, ప్రజా వాయిస్: నగరంలోని నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మహిళ దారుణ హత్యకు గురైన ఘటన కలకలం రేపింది. తట్టి అన్నారం గ్రామ సమీపంలోని ఇందు అరణ్య విల్లాస్ ఎదురుగా కొత్త రోడ్డులోని నిర్జన ప్రదేశంలో మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న నాగోల్ పోలీసులు, క్లూస్ బృందం ఘటనాస్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు.

మృతదేహంపై దుస్తులు లేకపోవడంతో

మహిళ మృతదేహంపై దుస్తులు లేకపోవడంతో ఆమెపై అత్యాచారం జరిగి ఉండొచ్చన్న అనుమానాలు స్థానికుల్లో వ్యక్తమయ్యాయి. అయితే ఈ విషయాన్ని పోలీసులు ఇంకా నిర్ధారించలేదు. మృతదేహం సమీపంలో మద్యం సీసాలు కూడా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. కాళ్లు, చేతులు కనిపించకపోవడంతో తొలుత పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి.

మంగమ్మగా గుర్తింపు

పోలీసుల వివరాల ప్రకారం.. మృతురాలు ఓయూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన మంగమ్మగా గుర్తించారు. ఆమె కనిపించడం లేదంటూ గత నెల 28న ఓయూ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ ఫిర్యాదు నమోదైంది. ఘటనాస్థలంలో లభించిన ఆధార్ కార్డు ఆధారంగా మృతదేహాన్ని మంగమ్మదిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

క్యాటరింగ్ పనికి వెళ్లి..

ఈ నెల 29న క్యాటరింగ్ పనికి మంగమ్మ బయటకు వెళ్లినట్లు నాగోల్ ఇన్‌స్పెక్టర్ మక్బూల్ జానీ తెలిపారు. అదే రోజు ఆమె హత్యకు గురై ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నామని చెప్పారు. డయల్ 100కు సమాచారం అందడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నట్లు వివరించారు.

కుక్కలు పీక్కుతిన్నాయా

మృతదేహానికి కాళ్లు, చేతులు లేకపోవడానికి కుక్కలు పీక్కుతినడం కారణమై ఉండవచ్చని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఘటనాస్థలంలో ఆధారాలను సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదికతో పాటు ఇతర ఆధారాల ఆధారంగా హత్యకు గల కారణాలను నిర్ధారించేందుకు పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

నిరంజన్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకో

కొల్లాపూర్, ప్రజా వాయిస్: మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిపై రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తనపై సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేస్తే పరువునష్టం దావాతో పాటు క్రిమినల్ కేసులు పెడతానని హెచ్చరించారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు.

నిజాయితీగా రాజకీయాల్లోకి వచ్చా

తాను నిజాయితీగా జీవించానని, ఎవరినీ మోసం చేయలేదని జూపల్లి స్పష్టం చేశారు. వ్యాపారం చేసి, ఎల్ఐసీ రుణం తీసుకుని రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. కబ్జాలు, మోసాలు చేసి రాజకీయాల్లోకి రాలేదన్నారు. తనకు రాజకీయ భిక్ష పెట్టానని నిరంజన్‌రెడ్డి చెప్పడం సరికాదని మండిపడ్డారు.

ప్రజలే సమాధానం చెబుతారు

2004లో అప్పటి టీఆర్ఎస్, కాంగ్రెస్ టికెట్ ఇచ్చినా నిరంజన్‌రెడ్డికి డిపాజిట్ కూడా రాలేదని జూపల్లి వ్యాఖ్యానించారు. ఒక్కసారికే పనపర్తి ప్రజలు ఆయనను ఓడించారని అన్నారు. తాను కబ్జాల నుంచి భూములను విడిపించి సామాన్య ప్రజలకు న్యాయం చేశానని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలే ఎవరి పనితీరు ఏంటో తేలుస్తారని వ్యాఖ్యానించారు.

ప్రజలే సమాధానం చెబుతారు

2004లో అప్పటి టీఆర్ఎస్, కాంగ్రెస్ టికెట్ ఇచ్చినా నిరంజన్‌రెడ్డికి డిపాజిట్ కూడా రాలేదని జూపల్లి వ్యాఖ్యానించారు. ఒక్కసారికే పనపర్తి ప్రజలు ఆయనను ఓడించారని అన్నారు. తాను కబ్జాల నుంచి భూములను విడిపించి సామాన్య ప్రజలకు న్యాయం చేశానని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలే ఎవరి పనితీరు ఏంటో తేలుస్తారని వ్యాఖ్యానించారు.

ప్రజలకు వాస్తవాలు తెలుసు

గత ప్రభుత్వ హయాంలో తాను మంత్రిగా ఉన్న సమయంలో గట్టు ప్రాంతంలో ప్రాజెక్టుల అంశాన్ని ప్రస్తావించానని జూపల్లి గుర్తుచేశారు. ప్రజలకు వాస్తవాలు తెలుసని, రాజకీయ విమర్శలతో వాటిని మార్చలేరని అన్నారు.

ఉద్యోగులకు దసరా కానుక

హైదరాబాద్, ప్రజా వాయిస్: దసరా పండుగ వేళ తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 2024 జనవరి, జూలై నుంచి పెండింగ్‌లో ఉన్న రెండు కరవు భత్యాల విడతలను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రెండు విడతల ద్వారా ప్రస్తుత కరవు భత్యం మొత్తం 6.37 శాతం మేర పెరగనుంది. పెంచిన కరవు భత్యాన్ని 2026 అక్టోబర్ నెల వేతనంతో కలిపి నవంబర్ 1న చెల్లించనున్నారు.

జనవరి నుంచి 3.64 శాతం పెంపు

2024 జనవరి 1 నుంచి రావాల్సిన కరవు భత్యాన్ని 3.64 శాతం పెంచారు. దీంతో 2020 వేతన శ్రేణి ఉద్యోగులకు కరవు భత్యం 33.67 శాతం నుంచి 37.31 శాతానికి చేరింది. 2024 జూలై 1 నుంచి మరో 2.73 శాతం పెంచడంతో మొత్తం కరవు భత్యం 40.04 శాతానికి చేరింది.

2015 వేతన శ్రేణికీ పెంపు

2015 వేతన శ్రేణి ఉద్యోగులకు 2024 జనవరి నుంచి కరవు భత్యాన్ని 73.344 శాతం నుంచి 78.06 శాతానికి, జూలై 2024 నుంచి 81.728 శాతానికి పెంచారు. ఈ పెంపు అన్ని అర్హత కలిగిన వర్గాలకు వర్తించేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

యూజీసీ, ఏఐసీటీఈ ఉద్యోగులకూ వర్తింపు

యూజీసీ, ఏఐసీటీఈ వేతన శ్రేణుల్లోని ఉద్యోగులకు కూడా ప్రభుత్వం కరవు భత్యాన్ని పెంచింది. 2016 వేతన శ్రేణి ఉద్యోగులకు 46 శాతం నుంచి 50 శాతానికి, 2024 జూలై నుంచి 53 శాతానికి పెంచారు. 2006 వేతన శ్రేణి ఉద్యోగులకు 230 శాతం నుంచి 239 శాతానికి, ఆ తర్వాత 246 శాతానికి పెంచారు.

రూ.6,174 కోట్ల బకాయిలు

2024 జనవరి నుంచి 2026 సెప్టెంబర్ వరకు పేరుకుపోయిన కరవు భత్యం బకాయిలను 33 వాయిదాల్లో చెల్లించనున్నారు. ఈ కాలానికి సంబంధించిన బకాయిలు సుమారు రూ.3,810 కోట్లుగా ఉన్నాయి. 2024 జూలై నుంచి 2026 సెప్టెంబర్ వరకు ఉన్న రెండో విడత బకాయిలు సుమారు రూ.2,364 కోట్లు కాగా, వాటిని 27 వాయిదాల్లో చెల్లించనున్నారు. రెండు విడతల బకాయిల మొత్తం సుమారు రూ.6,174 కోట్లు.

జీపీఎఫ్ ఖాతాల్లో జమ

బకాయిల మొత్తాన్ని ఉద్యోగుల సాధారణ భవిష్య నిధి ఖాతాల్లో జమ చేయనున్నారు. మరోవైపు రెండు డీఏల అమలుతో ప్రభుత్వంపై నెలవారీ, వార్షికంగా అదనపు ఆర్థిక భారం పడనుంది. ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి.



జంతర్ మంతర్ దిశగా ప్రతిపక్షాల మార్చ్

మొదటి పేజీ తరువాయి

తీసుకున్నారు.

బస్సులను అడ్డుకున్న పోలీసులు

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఏర్పాటు చేసిన సమావేశం అనంతరం రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా ఇండియా కూటమి ఎంపీలు జంతర్ మంతర్ వైపు బయలుదేరారు. మార్గమధ్యంలో పోలీసులు వారి బస్సులను నిలిపివేశారు. దీంతో ఎంపీలు రోడ్డుపైకి వచ్చి నిరసనకు దిగారు. కొందరు కాంగ్రెస్ నేతలు పోలీసుల బస్సులపైకి ఎక్కి నినాదాలు చేశారు.

రోడ్డుపై పడుకున్న ప్రియాంక

పోలీసులు నిరసనకారులను తరలించేందుకు ప్రయత్నించగా ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు మహిళా నేతలు రోడ్డుపై బైఠాయించారు. ప్రియాంక రోడ్డుపై పడుకుని నిరసన కొనసాగించారు. అనంతరం మహిళా పోలీసులు ఆమెను ఇతర మహిళా నేతలతో కలిసి అదుపులోకి తీసుకుని బస్సుల్లో తరలించారు. రాహుల్ గాంధీని కూడా పోలీసులు బలవంతంగా అక్కడి నుంచి తరలించి అదుపులోకి తీసుకున్నారు.

సీఈసీ రాజీనామాకు డిమాండ్

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై తమ అభ్యంతరాలను పరిష్కరించాలని ఇండియా కూటమి డిమాండ్ చేస్తోంది. ఎస్ఐఆర్‌లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని ప్రతిపక్ష నేతలు కోరుతున్నారు

రెండు రోజుల్లో మూడోసారి అదుపులోకి

ఎన్నికల సంఘం వ్యవహారంపై ప్రతిపక్షాల ఆందోళన వరుసగా రెండో రోజూ కొనసాగింది. మంగళవారం కూడా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా పలువురు ప్రతిపక్ష నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం జరిగిన నిరసనలోనూ రాహుల్ గాంధీ మరోసారి అదుపులోకి వెళ్లారు. తాజా పరిణామాలతో ఎస్ఐఆర్ అంశంపై కేంద్ర ఎన్నికల సంఘం, ప్రతిపక్షాల మధ్య రాజకీయ వివాదం మరింత ముదిరింది.

ఎర్రవల్లి భూముల్లో 45.5 ఎకరాలు ఎక్కడ

- అధికారులపై సీఎం ఆరా
- సర్వే నంబర్ 325లో తొమ్మిది రోజుల భూసర్వే
- 388.5 ఎకరాలకు బదులు 343 ఎకరాలే గుర్తింపు
- భూ యజమానులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశాలు
- కేసీఆర్ ఫాంహౌస్ పరిధిలోనూ సర్వేకు ఆదేశం
- రికార్డుల ఆధారంగా సమగ్ర పరిశీలన



సిద్దిపేట, ప్రజా వాయిస్: సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని సర్వే నంబర్ 325లో తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన భూసర్వే నివేదికపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరా తీసినట్లు సమాచారం. తాజా సర్వేలో 343 ఎకరాల భూమి మాత్రమే ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్లు తెలుస్తోంది.

రికార్డుల్లో 388.5 ఎకరాలు

పాత రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నంబర్ 325లో 388.5 ఎకరాల భూమి ఉన్నట్లు నమోదై ఉంది. అయితే తాజా సర్వేలో 343 ఎకరాలు మాత్రమే గుర్తించినట్లు అధికారులు సీఎంకు నివేదించినట్లు సమాచారం. దీంతో రికార్డుల్లో ఉన్న భూమికి, క్షేత్రస్థాయిలో గుర్తించిన భూమికి మధ్య 45.5 ఎకరాల వ్యత్యాసం ఎందుకు వచ్చిందనే దానిపై స్పష్టత ఇవ్వాలని సీఎం ఆదేశించినట్లు తెలుస్తోంది.

భూ యజమానులకు నోటీసులు

సర్వే నంబర్ 325 పరిధిలోని పట్టా భూములపై కూడా అవసరమైతే సంబంధిత భూ యజమానులకు నోటీసులు జారీ చేసి, వారి వద్ద ఉన్న భూ రికార్డులను పరిశీలించాలని సీఎం ఆదేశించినట్లు సమాచారం. పాత రికార్డులు, ప్రస్తుత వివరాలను సరిపోల్చి భూమి వ్యత్యాసానికి కారణాలను గుర్తించాలని అధికారులను సూచించినట్లు తెలుస్తోంది.

కేసీఆర్ ఫాంహౌస్ భూములపైనా సర్వే

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కూడా నోటీసులు జారీ చేసి, ఫాంహౌస్ పరిధిలో ఉన్న భూములను సర్వే చేయాలని సీఎం ఆదేశించినట్లు సమాచారం. సర్వే నంబర్ 325కు సంబంధించిన భూములపై అందుబాటులో ఉన్న రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించనున్నట్లు తెలుస్తోంది.

అధికారుల సమావేశం

తాజా పరిణామాల నేపథ్యంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి ఆధ్వర్యంలో గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, మర్కూక్ తహసీల్దార్ సరితతో పాటు రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు సమాచారం. పాత రికార్డుల్లో నమోదైన భూమి, తాజా సర్వేలో గుర్తించిన భూమి మధ్య ఉన్న వ్యత్యాసానికి గల కారణాలను ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది.

రికార్డుల ఆధారంగా పరిశీలన

మిగిలిన 45.5 ఎకరాల భూమికి సంబంధించిన వివరాలను పాత రికార్డులు, పట్టాదారు వివరాలు, క్షేత్రస్థాయి సర్వే ఆధారంగా అధికారులు పరిశీలించనున్నట్లు తెలుస్తోంది. భూమి విస్తీర్ణంలో వ్యత్యాసానికి అసలు కారణం ఏమిటన్నది అధికారుల సమగ్ర పరిశీలన అనంతరం స్పష్టమయ్యే అవకాశం ఉంది.

కిరాయికి వచ్చిన మహిళతో సన్నిహిత సంబంధాలు

- మూడు రోజుల్లో ఇద్దరు అన్నదమ్ముల మృతి
- ఇద్దరు చెల్లెళ్లకు హెచ్ఐవీ సోకినట్లు వైద్య పరీక్షల్లో నిర్ధారణ
- ఒకరి మృతి జరిగిన మూడు రోజులకే మరొకరు మృతి
- మహిళతో సంబంధం ఉన్న ఇతరుల్లోనూ ఆందోళన
- గ్రామానికి ఆరోగ్యశాఖ ప్రత్యేక బృందాలు
- మహిళ ద్వారానే సంక్రమించిందన్న దానిపై అధికారిక నిర్ధారణ లేదు

బిజ్నోర్, ప్రజా వాయిస్: ఉత్తరప్రదేశ్‌లోని బిజ్నోర్ నగర శివారులో ఉన్న ఓ గ్రామంలో మూడు రోజుల వ్యవధిలో ఇద్దరు చెల్లెళ్ల మృతి కలకలం రేపింది. ఇద్దరికీ హెచ్ఐవీ సంక్రమణ ఉన్నట్లు వైద్య పరీక్షల్లో నిర్ధారణ అయినట్లు స్థానిక వార్తా కథనాలు పేర్కొంటున్నాయి. ఈ ఘటన నేపథ్యంలో గ్రామంలో ఆందోళన నెలకొనడంతో ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేక వైద్య బృందాలను పంపి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

రెండేళ్ల క్రితం గ్రామానికి వచ్చిన మహిళ

బిజ్నోర్ నగరానికి సమీపంలోని ఓ గ్రామానికి సుమారు రెండేళ్ల క్రితం ఓ మహిళ అద్దెకు వచ్చి నివసించినట్లు సమాచారం. ఆ సమయంలో గ్రామానికి చెందిన 51 ఏళ్ల వ్యక్తితో పాటు అతని 43 ఏళ్ల చెల్లెలి కుమారుడితో ఆమెకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని వారి కుటుంబ సభ్యులు తెలిపారు. కొంతకాలం తర్వాత ఆ మహిళ అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు వెల్లడించారు.

అనారోగ్యంతో ఆసుపత్రుల చుట్టూ తిరుగుడు

మహిళ గ్రామం విడిచిన తర్వాత 51 ఏళ్ల వ్యక్తి తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. స్థానికంగా చికిత్స చేయించినా కోలుకోకపోవడంతో కుటుంబ సభ్యులు అతడిని రుషికేశ్‌లోని ఎయిమ్స్‌కు తరలించారు. అక్కడ నిర్వహించిన పరీక్షల్లో హెచ్ఐవీ సంక్రమణ ఉన్నట్లు నిర్ధారణ అయినట్లు సమాచారం. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు.

మూడు రోజులకే మరో వ్యక్తి మృతి

అతడి మృతి జరిగిన మూడు రోజులకే 43 ఏళ్ల చెల్లెలి కుమారుడు కూడా మృతి చెందాడు. అతడికి కూడా హెచ్ఐవీ ఉన్నట్లు పరీక్షల్లో తేలినట్లు



కుటుంబ సభ్యులు తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అతడు ఇంటివద్దే ఆక్సిజన్ సహాయంతో ఉన్నట్లు సమాచారం. అనంతరం పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు.

మహిళ ద్వారానే సంక్రమించిందా.. విచారణ

ఇద్దరు వ్యక్తులకు ఆ మహిళతో సన్నిహిత సంబంధాలు ఉండటంతో ఆమె ద్వారానే హెచ్ఐవీ సంక్రమించిందన్న అనుమానాలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. అయితే ★ఆ మహిళ కారణంగానే ఇద్దరికీ హెచ్ఐవీ సోకిందని అధికారికంగా నిర్ధారించే ఆధారాలు ఇప్పటివరకు లభించలేదని★ పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అధికారులు ఇద్దరి ఆరోగ్య చరిత్ర, ఇతర సంక్రమణ అవకాశాలను పరిశీలిస్తున్నారు.

గ్రామంలో ఆరోగ్యశాఖ అప్రమత్తం

ఇద్దరి మృతితో ఆ మహిళతో పరిచయం ఉన్నట్లు భావిస్తున్న పలువురు ముందుజాగ్రత్తగా హెచ్ఐవీ పరీక్షలు చేయించుకుంటున్నట్లు సమాచారం. ఆరోగ్యశాఖ బృందాలు గ్రామంలో పర్యటిస్తూ అవసరమైన పరీక్షలు, కౌన్సెలింగ్, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. హెచ్ఐవీ ఎలా సంక్రమిస్తుంది, దాన్ని ఎలా నివారించాలి అనే అంశాలపై ప్రజలకు సూచనలు ఇస్తున్నారు.



విద్యుత్ కోతలపై రైతుల ఆగ్రహం

- కోదాడ సబ్ స్టేషన్ ఎదుట ట్రాక్టర్లతో అఖిలపక్ష రైతు సంఘాల ధర్నా

ప్రజా వాయిస్,కోదాడ: విద్యుత్ కోతలతో చేతి కొచ్చిన వరి పంటలు ఎండిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తూ అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతులు బుధవారం కోదాడ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు బొల్లు ప్రసాద్ నాయకత్వంలో రైతులు ట్రాక్టర్లను సబ్‌స్టేషన్ ఎదుట అడ్డుగా ఉంచి నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా బొల్లు ప్రసాద్ మాట్లాడుతూ.. ఎడాపెడా విద్యుత్ కోతలు విధించడంతో పొలాలకు సాగునీరు అందక వరి పైర్లు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిరంతర విద్యుత్ సరఫరా లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని మండిపడ్డారు. విద్యుత్ కోతల కారణంగా ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.30 వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పంటలను కాపాడేందుకు వెంటనే 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను పునరుద్ధరించాలని కోరారు. అధికారులు స్పందించకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు కమతం వెంకటరావు, కుటుంబరావు, సైదయ్య, సామినేని సుబ్బారావు, సతీష్, నగేష్, కనగాల పూర్ణ, కొండయ్య, నాగుల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు.. ఎవరివైపు.?

- రంగారెడ్డి–మహబూబ్ నగర్–హైదరాబాద్ ఎమ్మెల్సీ స్థానంపై మూడు పార్టీల గురి
- బీజేపీ నుంచి ఎన్.రామచందర్ రావు
- కాంగ్రెస్ నుంచి సామ రామ్మోహన్ రెడ్డి పేరు
- బీఆర్ ఎస్ నుంచి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ బరిలోకి వచ్చే అవకాశం.?
- సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని బీఆర్ ఎస్
- పట్టు సాధించాలని కాంగ్రెస్, బీజేపీ వ్యూహాలు
- గత అనుభవంతో బరిలోకి రామచందర్ రావు.. ఆసక్తిగా మారిన పట్టభద్రుల పోరు







ప్రజా వాయిస్,హైదరాబాద్: రంగారెడ్డి–మహబూబ్‌నగర్–హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికపై రాజకీయ పార్టీల్లో కసరత్తు మొదలైంది. పట్టభద్రుల ఓటర్లను ఆకర్షించేందుకు ప్రధాన పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. దీంతో ఈసారి ఎన్నికపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఇప్పటికే బీజేపీ నుంచి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు పేరు ప్రధానంగా వినిపిస్తుండగా.. కాంగ్రెస్ నుంచి సామ రామ్మోహన్‌రెడ్డి పేరును పరిశీలిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను బరిలోకి దింపే అవకాశం ఉందన్న ప్రచారం సాగుతోంది.

మళ్లీ అదే నియోజకవర్గంపై ఎన్ .రామచందర్ రావు గురి..

ఎన్.రామచందర్‌రావుకు ఈ పట్టభద్రుల నియోజకవర్గంతో పాత అనుబంధం ఉంది. గతంలో ఇదే స్థానం నుంచి ఎమ్మెల్సీగా గెలిచిన ఆయన.. మరోసారి ఇక్కడి నుంచే పోటీకి దిగే అవకాశం ఉందన్న చర్చ బీజేపీ వర్గాల్లో సాగుతోంది. గత అనుభవాన్ని కలిసొచ్చే అంశంగా భావిస్తూ పార్టీ వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో బీజేపీ అభ్యర్థిత్వంపై ఉత్కంఠ నెలకొంది.

కాంగ్రెస్ నుంచి సామ పేరు..

అధికార కాంగ్రెస్ కూడా ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు తెలుస్తోంది. పట్టభద్రుల నియోజకవర్గంలో పార్టీ బలాన్ని పెంచుకునే దిశగా అభ్యర్థి ఎంపికపై కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో సామ రామ్మోహన్‌రెడ్డి పేరు తెరపైకి వచ్చింది. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఆయనను బరిలోకి దింపే అంశంపై పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

బీఆర్ ఎస్ వ్యూహం ఏంటి.?

ఇక బీఆర్ఎస్ తనకు ఉన్న పట్టును కొనసాగించేందుకు పావులు కదుపుతోంది. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేరును పరిశీలించే అవకాశం ఉందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. గత ఎన్నికల అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని బలమైన అభ్యర్థిని రంగంలోకి దింపాలని పార్టీ భావిస్తున్నట్లు సమాచారం.

మూడు పార్టీలకూ కీలకమే..

మూడు ప్రధాన పార్టీలకు ఈ ఎన్నిక రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. పట్టభద్రుల సమస్యలు, ఉద్యోగాలు, విద్య, నిరుద్యోగం, ప్రభుత్వ విధానాలు వంటి అంశాలు ఎన్నికల ప్రచారంలో కీలకంగా మారే అవకాశం ఉంది. మూడు జిల్లాల పరిధిలోని పట్టభద్రుల ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు పార్టీలు ఎలాంటి వ్యూహాలను అనుసరిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.

తెరపైకి ముగ్గురు.. తుది బరిలో ఎవరు.?

బీజేపీ నుంచి ఎన్.రామచందర్‌రావు, కాంగ్రెస్ నుంచి సామ రామ్మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి శ్రీనివాస్‌గౌడ్ పేర్లు చర్చలోకి రావడంతో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. అయితే తుది అభ్యర్థుల ఎంపిక, అధికారిక ప్రకటనల తర్వాతే ఎన్నికల పోరు పూర్తి స్పష్టతకు రానుంది. అప్పటివరకు పట్టభద్రుల ఓటు ఎటువైపు? అన్నదే ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది.



వీధి దీపాలు వెలగక కాలనీ వాసులు అవస్థలు

- దసరా పండుగ లోపు వీధి దీపాలు ఏర్పాటు చేయాలి
- మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం సమర్పణ..
- 36వ వార్డు బీజేపీ కౌన్సిలర్ అప్పం శ్రవణ్ కుమార్

ప్రజా వాయిస్ జహీరాబాద్: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 36వ వార్డులో వీధి దీపాలు వెలగక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తక్షణమే పరిష్కరించాలని బీజేపీ కౌన్సిలర్ అప్పం శ్రవణ్ కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్ రావు ను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా అప్పం శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ,36వ వార్డులోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు పని చేయకపోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, వ్యాపారులు రాత్రి సమయాల్లో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని వీధి దీపాల సమస్యను అత్యవసర ప్రాతిపదికన పరిష్కరించాల్సిన అవసరం ఉందని,వీధి దీపాల కొనుగోలు కోసం అత్యవసర సమావేశం నిర్వహించి, మున్సిపల్ కౌన్సిల్‌లో ఎజెండాను ఆమోదించినప్పటికీ ఇప్పటివరకు లైట్ల ఏర్పాటు పూర్తి కాలేదని తెలిపారు. ఇప్పటికే బతుకమ్మ, వినాయక చవితి పండుగలు పూర్తయ్యాయని, కనీసం రాబోయే దసరా పండుగలోపు వీధి దీపాల ఏర్పాటు పూర్తి చేయాలని కోరారు.జహీరాబాద్ పట్టణంలో దసరా పండుగను ప్రజలు విద్యుత్ వెలుగుల మధ్య ఆనందంగా జరుపుకునేలా మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ కౌన్సిల్‌లో ఆమోదించిన నిర్ణయాలను వెంటనే అమలు చేసి, అవసరమైన విద్యుత్ దీపాలను కొనుగోలు చేసి సంబంధిత ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని,అదేవిధంగా 36వ వార్డుతో పాటు పట్టణంలోని ఇతర వార్డుల్లోనూ పనిచేయని వీధి దీపాలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన ప్రాంతాల్లో కొత్త విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను కౌన్సిలర్ అప్పం శ్రవణ్ కుమార్ కోరారు..

కుర్చీనే ఆసరా - పెన్షన్ కోసం వృద్ధుల దీనగాథ..!

- కాళ్లు సహకరించక' కదలలేని స్థితిలోనూ అథెంటిఫికేషన్ కోసం రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి జోనల్ కార్యాలయానికివృద్ధుల పరిస్థితిపై ప్రజల ఆవేదన
- ఇంటి వద్దే లైవ్ అథెంటిఫికేషన్ చేసే అవకాశం కల్పించడం లేదా ప్రత్యేక సిబ్బందితో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలంటున్న ప్రజలు



ప్రజావాయిస్//రాజేంద్రనగర్:వృద్ధాప్యంలో నాలుగు అడుగులు వేయడమే కష్టంగా మారిన వేళ,ఆసరాగా నిలవాల్సిన పెన్షన్ కోసం వృద్ధులు పడుతున్న పాట్లు కంటతడి పెట్టిస్తున్నాయి.కాళ్లు సహకరించక,శరీరం కదలక, ఇతరుల సాయంతోనే జీవనం సాగిస్తున్న వృద్ధులను సైతం లైవ్ అథెంటిఫికేషన్ కోసం కార్యాలయానికి తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొంది.రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో అథెంటిఫికేషన్ కోసం వచ్చిన పలువురు వృద్ధులకు కుర్చీనే ఆసరాగా మారింది.కుటుంబ సభ్యులు వారిని వాహనంపై తీసుకువచ్చి,అక్కడి నుంచి కుర్చీలపై కూర్చోబెట్టి, చేతులతో పట్టుకుని వచ్చి అథెంటిఫికేషన్ చేయిస్తున్నారు.వృద్ధుల పరిస్థితిని చూసిన ఇతరులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నడిచే పరిస్థితి లేదు,ఇంటి నుంచి బయటకు రావడమే కష్టం, అయినా పెన్షన్ కోసం రావాల్సి వచ్చింది,అంటూ వృద్ధులు వాపో తున్న తీరు బాధ కలిగిస్తోంది. వయసు మీదపడిన సమయంలో కుటుంబ సభ్యులపై ఆధారపడుతూ బతుకుతున్న వారికి ఆసరా పెన్షన్ ఎంతో ముఖ్యమైనది. అలాంటి పెన్షన్ కోసం తమ శారీరక బాధలను లెక్కచేయకుండా అథెంటిఫికేషన్ కేంద్రాలకు రావా ల్సి రావడం వృద్ధులకు మరింత భారంగా మారు తోంది. వృద్ధుల బాధను చూసి ప్రజలు కూడా ప్రశ్నిస్తున్నారు. అర్హతను నిర్ధారించేందుకు అథెంటిఫికేషన్ అవసరమే అయినా,నడవలేని వృద్ధులను తప్పనిసరిగా కార్యాలయానికి రప్పించాల్సిందేనా.? అని నిలదీస్తున్నారు.మంచానికే పరిమితమైన వారు, కదలలేని వారు,కుర్చీ సాయంతో మాత్రమే కదిలే వారి కోసం ప్రత్యేక మానవీయ విధానం ఉండాలని కోరుతున్నారు.ఇంటి వద్దే లైవ్ అథెంటిఫికేషన్ చేసే అవకాశం కల్పించడం లేదా ప్రత్యేక సిబ్బందితో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం ద్వారా ఇలాంటి వృద్ధుల కష్టాలను తగ్గించవచ్చని ప్రజలు అంటున్నారు. ఆసరా ఇవ్వాల్సిన పెన్షన్ కోసం, వృద్ధులే ఆసరా వెతుక్కుంటూ కార్యాలయాలకు రావాల్సిన పరిస్థితి మారాలి.వృద్ధుల వయసు, వారి శారీరక పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని అధికారులు మానవీయంగా స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

చట్టం కాంగ్రెస్ పార్టీ నాయకులకు చుట్టమా...?

- డీజేల వాడకం పై పోలీసుల మౌనం
- ప్రతి పక్షాల గొంతు నొక్కుతున్న పోలీసులు
- బీజేపీ నాయకుల ధ్వజం

ప్రజా వాయిస్, గోదావరిఖని రామగుండం నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులకు చట్టం చుట్టంలా మారిందని బిజెపి నాయకులు కొండపర్తి సంజీవ్ విమర్శించారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రధాన చౌరస్తాలో డీజే లను వియోగించడం పై స్పందిస్తూ మాట్లాడారు.. జాతీయ భావం పెంపొందించడానికి చేపట్టే తిరంగా కార్యక్రమానికి, గణేష్ నిమజ్జనాలకు అనుమతులు లేవని చెప్పే పోలీసులు కాంగ్రెస్ పార్టీ నాయకులు చేపట్టే కార్యక్రమాలకు డీజే పర్మిషన్లు ఎలా ఇచ్చారని ,ఒకవేళ ఇవ్వకుంటే వారిపై చర్య లేవని ప్రశ్నించారు. చిన్నపిల్లలు వృద్ధులకు డీజే వల్ల ప్రమాదం జరుగుతుందని సూక్తులు చెప్పే పోలీసులు, చట్టం అందరికీ సమానమే అనే సూక్తులు చెప్పే పోలీసులకి కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసే ఉల్లంఘనలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ప్రతి పక్షాలు చేసే కార్యక్రమాలు భూతద్దంలో చూసే సిపి, ఏసిపిలకు కాంగ్రెస్ పార్టీ నాయకుల డీజే వినియోగాలు కనిపించడం లేదా అని ఎద్దేవా చేశారు. గోదావరిఖని పరిధిలో పోలీసులు ప్రతి పక్షాల గొంతు నొక్కే విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.ప్రతి పక్షాలు నిరసనలు,దిష్టిబొమ్మ దహనాలు వంటి కార్యక్రమాలు చేస్తే వెంటనే పోలీసులు కేసులు పెడుతున్నారని ,అదే అధికార పార్టీ నాయకులు చేస్తే కేసులు కాదు కదా కనీసం చర్యలు కూడా లేవని విమర్శించారు.వెంటనే పోలీసులు పక్షపాత ధోరణిని వదిలి నిబంధనలు ఉల్లంఘించిన కాంగ్రెస్ పార్టీ నాయకుల మీద కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సోమారపు లావణ్య మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యుత్ సమస్యపై రైతులు ప్రభుత్వం పై కన్నెర్ర

- కరెంట్ కోసం రోడ్డెక్కిన రైతులు
- 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరాకు డిమాండ్
- అహ్మదీపూర్ చౌరస్తాలో మూడు గ్రామాల రైతుల ధర్నా
- విద్యుత్ కోతలతో పంటలకు సాగునీటి ఇబ్బందులు
- అధికారుల హామీతో ధర్నా విరమణ
- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్



ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ అహ్మదీపూర్, దిలాల్‌పూర్, శేరిపల్లి గ్రామాలకు చెందిన రైతులు అహ్మదీపూర్ చౌరస్తాలో రోడ్డుపై ధర్నాకు దిగారు. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడటంతో వ్యవసాయ పనులు ముందుకు సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేసిన రైతులు ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతుల ఆందోళనకు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాదాసు శ్రీనివాస్ మాట్లాడుతూ.. రైతులకు నిరంతర విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం కరెంట్ విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. పంటలు చేతికొచ్చే సమయంలో విద్యుత్ కోతల కారణంగా సాగునీరు అందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. హామీలు ఇవ్వడం కాకుండా రైతులకు కనీసం 12 గంటల త్రీఫేజ్ నాణ్యమైన విద్యుత్ అందించి ఆచరణలో చూపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకవైపు ఎల్‌నినో ప్రభావం, మరోవైపు ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు పంటలను కాపాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పంట చేతికొచ్చే దశలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల శ్రేయస్సు కోసం గత ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల నుంచి సాగునీటిని అందించేందుకు మోటార్లను సక్రమంగా నడపకపోవడం వల్ల కూడా రైతులకు నష్టం జరుగుతోందని ఆరోపించారు. రైతుల ధర్నా విషయం తెలుసుకున్న అధికారులు ఏఈ సత్యం అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. విద్యుత్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు అధికారుల హామీపై ధర్నాను విరమించారు. ఇకనైనా ప్రభుత్వం వెంటనే విద్యుత్ సమస్యను పరిష్కరించి రైతులకు ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్యుత్ సర ఫరా చేయాలని మాదాసు శ్రీనివాస్ కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు మద్ది రాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు బ్యాగారి ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, అహ్మదీపూర్, దిలాల్‌పూర్, శేరిపల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు.

అసలు జగ్గారెడ్డికి రివ్యూ చేసే అధికారం ఉందా.?

- కలెక్టర్ సమక్షంలో హెచ్ ఎండీఏ అధికారులతో సమీక్ష
- అధికారిక హోదా లేకుండానే అధికారులపై ప్రశ్నల వర్షం
- నవంబర్ చివరికల్లా రైతులకు ప్లాట్లు కేటాయించాలని సూచన
- ఆరుట్ల, ఫసల్ వాది, కంది లేఅవుట్ల పురోగతిపై ఆరా
- జగ్గారెడ్డితో పాటు సమీక్షలో పాల్గొన్న నిర్మల జగ్గారెడ్డి
- హెచ్ ఎండీఏ, రెవెన్యూ అధికారులతో సమన్వయానికి కలెక్టర్ ఆదేశాలు



ప్రజా వాయిస్,సంగారెడ్డి: సంగారెడ్డి నియోజకవర్గ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన హెచ్ఎండీఏ ల్యాండ్ పూలింగ్ లేఅవుట్లపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సమక్షంలో సమీక్ష సమావేశం జరిగింది. హెచ్ఎండీఏ, రెవెన్యూ శాఖల అధికారులతో నిర్వహించిన ఈ సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నిర్మల జగ్గారెడ్డి పాల్గొన్నారు. అయితే కలెక్టర్ స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్షలో జగ్గారెడ్డి పాల్గొనడమే కాకుండా అధికారులను వివరాలు అడిగి తెలుసుకోవడంపై 'అసలు జగ్గారెడ్డికి అధికారికంగా సమీక్ష చేసే అధికారం ఉందా.?' అన్న చర్చ మొదలైంది.ఆరుట్ల, ఇంద్రకరణ్, ఫసల్‌వాది, కంది ప్రాంతాల్లో ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములు తీసుకుని రైతులకు సర్టిఫికెట్లు ఇచ్చినా, ఇప్పటివరకు ప్లాట్ల పొజిషన్ ఇవ్వలేదని పలువురు రైతులు ఎదురుచూస్తున్న విషయాన్ని జగ్గారెడ్డి, నిర్మల ప్రస్తావించారు. లేఅవుట్ల పరిస్థితి, పనుల జాప్యానికి కారణాలు, ప్రస్తుతం ఎంత మేరకు పనులు పూర్తయ్యాయన్న అంశాలపై హెచ్ఎండీఏ అధికారులను జగ్గారెడ్డి అడిగి తెలుసుకున్నారు.ఆరుట్ల లేఅవుట్ పరిధిలో 106 ఎకరాల 14 గుంటల్లో లేఅవుట్ ప్రక్రియ పూర్తయినా లబ్ధిదారుల జాబితా ఇంకా అందలేదని అధికారులు తెలిపారు. ఫసల్‌వాదిలో భూసేకరణ ప్రక్రియ 60 శాతం పూర్తయిందని, కొంత ప్రాంతంలో రైతుల అభ్యంతరాలు ఉన్నాయని వివరించారు. కంది గ్రామంలో 50 ఎకరాలకు లేఅవుట్ ప్రతిపాదించగా ప్రస్తుతం 46 ఎకరాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, లబ్ధిదారుల జాబితా పంపాల్సి ఉందని అధికారులు తెలిపారు.కంది లేఅవుట్ పనులను ఈ నెల 10వ తేదీలోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు వెల్లడించారు. కంది, ఫసల్‌వాది, ఆరుట్ల లేఅవుట్లలో నవంబర్ చివరి నాటికి ప్లాట్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.రైతులు ఏళ్లుగా ఎదురుచూస్తున్నందున మిగిలిన పనులను త్వరగా పూర్తి చేసి ప్లాట్లు కేటాయించాలని జగ్గారెడ్డి అధికారులను కోరారు. నవంబర్ చివరికల్లా భూములు కోల్పోయిన రైతులందరికీ ప్లాట్లు అందేలా పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. హెచ్ఎండీఏ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేసి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని సూచించారు.



జర్నలిజంపై జులుం నడవదు

- వర్ధన్నపేట ఎమ్మెల్యే ఖబర్దార్!
- వరంగల్ తూర్పు పరపతి సంఘం అధ్యక్షులు నరేందర్
- ప్రశ్నించే నాలుగు స్తంభంపై ఎమ్మెల్యే అనుచరులు దౌర్జన్యం దిగడం దారుణం
- పోచం మైదానం కూడలిలో నల్ల బ్యాడ్జీలతో రోడ్డుపై బైటాయించిన జర్నలిస్టులు
- పత్రిక స్వేచ్ఛను హరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తే ఊరుకునేది లేదు
- వార్తలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే చట్టబద్ధమైన మార్గాలు ఉన్నాయి
- మీడియా సంస్థ దిష్టిబొమ్మను దహనం చేయడం ప్రజాస్వామ్య సాంప్రదాయం కాదు
- జర్నలిస్టుల భద్రతకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలి
- జర్నలిస్ట్ నాయకుల ఆగ్రహం

ప్రజా వాయిస్ వరంగల్ టౌన్ మీడియా సంస్థ దిష్టిబొమ్మ దహనానికి నిరసనగా వరంగల్ పోచమ్మ మైదాన్ కూడలిలో రోడ్డుపై బైఠాయించి జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలతో భారీ ఆందోళన చేపట్టారు.ప్రశ్నించే నాలుగో స్తంభంపై ఎమ్మెల్యే అనుచరులు దౌర్జన్యానికి దిగడం దారుణమని, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఇలాంటి ఘటనలు ఇప్పటికి నాలుగు సార్లు జరిగాయని, పత్రికా స్వేచ్ఛను హరిస్తూ భయభ్రాంతులకు గురి చేయాలని చూస్తే ఊరుకునేది లేదని వరంగల్ తూర్పు పరపతి సంఘం అధ్యక్షులు నరేందర్ హెచ్చరించారు.వార్తలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే చట్టబద్ధమైన మార్గాలు ఉన్నాయి తప్ప, ఇలా దిష్టిబొమ్మలు తగలబెట్టడం ప్రజాస్వామ్య సంప్రదాయం కాదని జర్నలిస్టు సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.జర్నలిస్టుల భద్రతకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని, ఎమ్మెల్యే క్షమాపణ చెప్పే వరకు తమ నిరసనలు అపబోమని ఆందోళనకారులు స్పష్టం చేశారు.

25 ఏళ్ల ప్రస్థానం.. 'వికసిత్ భారత్' సంకల్పం.!

- ముఖ్యమంత్రిగా మొదలై.. ప్రధానిగా కొనసాగిన మోదీ ప్రజాజీవిత ప్రయాణం
- 2047 లక్ష్యంగా దేశాన్ని ముందుకు తీసుకెళ్లే కార్యక్రమాలపై బీజేపీ నేతల వివరణ
- ములుగులో ఘనంగా సేవా జ్యోతి యాత్ర
- పాల్గొన్న మాజీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్ రావు, మాజీ పార్లమెంట్ సభ్యుడు ప్రొఫెసర్ సీతారాం నాయక్



ప్రజా వాయిస్,ములుగు: ముఖ్యమంత్రి పదవి నుంచి ప్రధానమంత్రి స్థాయికి.. రెండు దశాబ్దాలకు పైగా ప్రజాజీవితంలో కొనసాగుతున్న నరేంద్ర మోదీ ప్రస్థానాన్ని పురస్కరించుకుని ములుగు జిల్లా కేంద్రంలో సేవా జ్యోతి యాత్ర నిర్వహించారు. దేశ వ్యాప్తంగా కొనసాగుతున్న సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాం నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

25 ఏళ్ల ప్రజాజీవితం.. ప్రత్యేక మైలురాయి

2001 అక్టోబర్ 7న తొలిసారి గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోదీ.. ప్రజాజీవితంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం ప్రత్యేక ఘట్టమని గరికపాటి మోహన్‌రావు అన్నారు. ప్రజలతో మమేకమై సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్న ఉద్దేశంతో సేవా జ్యోతి యాత్ర చేపట్టినట్లు తెలిపారు.

ప్రపంచ వేదికపై భారత్ ..

మోదీ నాయకత్వంలో దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతోందని గరికపాటి పేర్కొన్నారు. దేశీయ ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పిస్తూ.. వాటిని అంతర్జాతీయ మార్కెట్లకు తీసుకెళ్లే దిశగా కేంద్రం చర్యలు చేపడుతోందన్నారు. భారత్‌ను ప్రపంచ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు.

2047.. వికసిత్ భారత్ లక్ష్యం

2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని ప్రొఫెసర్ సీతారాం నాయక్ అన్నారు. 140 కోట్ల మంది భారతీయుల సామర్థ్యాన్ని ఉపయోగించుకుంటూ దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

భద్రతపై కీలక నిర్ణయాలు

దేశ సమగ్రత, భద్రతకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను బీజేపీ నేతలు ప్రస్తావించారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన ఆర్టికల్ 370 రద్దు, నక్సలిజం నిర్మూలనకు చేపట్టిన చర్యలను వారు కీలక నిర్ణయాలుగా పేర్కొన్నారు.

పథకాలు.. ప్రజల ముంగిటకు

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికీ చేరేలా పార్టీ శ్రేణులు పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయడంతోపాటు పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.

సేవా జ్యోతి యాత్రలో సందడి

బీజేపీ శ్రేణులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ములుగు జిల్లా కేంద్రంలో సేవా జ్యోతి యాత్ర సందడిగా సాగింది. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, సేవా సంకల్ప్ అభియాన్ కన్వీనర్ నగరపు రమేష్, అజ్మీర కృష్ణవేణి నాయక్, భూక్య జవహర్‌లాల్, చింతలపూడి భాస్కర్‌రెడ్డి, జాడి వెంకట్, శ్రీలమంతుల రవీంద్రచారి, ఇతర జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్నెట్ కట్.. ఆర్టీఏ సేవలకు బ్రేక్!

- సర్వర్ సాకుతో వాహనదారులకు చుక్కలు
- స్లాట్లు వరుసగా వాయిదా
- జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారికి తప్పని నిరాశ
- వికారాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో పరిస్థితి అధ్వానం!



ప్రజావాయిస్‌వికారాబాద్ బ్యూరో వికారాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారి ఆర్టీఏ కార్యాలయంలో ఇంటర్నెట్ సర్వర్ సమస్యలు పునరావృతం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు వాహన రిజిస్ట్రేషన్లు డ్రైవింగ్ లైసెన్సులు వెహికిల్ ఫిట్‌నెస్ తదితర పనుల కోసం జిల్లా నలుమూలల నుంచి కార్యాలయానికి వస్తున్న వారికి సేవలు అందక నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంటోందని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారుఇంటర్నెట్ అందుబాటులో ఉన్న సమయంలో నూ సర్వర్ పనిచేయడం లేదంటూ కొందరిని వెనక్కి పంపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి సాంకేతిక సమస్యల కారణంగా ముందుగా బుక్ చేసుకున్న స్లాట్లను ఉన్నఫళంగా తేదీకి మార్చినట్లు కార్యాలయ గేటు వద్ద బోర్డు ఏర్పాటు చేశారు అయితే ఉన్నఫళంగా తేదీన వచ్చిన వారికి మళ్లీ స్లాట్లను ఉన్నఫళంగా తేదీకి మార్చినట్లు మరో బోర్డు దర్శనమివ్వడం గమనార్హం

పునరావృతమవుతున్న సమస్యలు

ఆర్టీఏ కార్యాలయంలో ఇంటర్నెట్, సర్వర్ సమస్యలు తరచూ తలెత్తుతున్నప్పటికీ శాశ్వత పరిష్కారం చూపకపోవడంపై వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.

ఆధునిక సాంకేతిక యుగంలో అనేక రకాల ఇంటర్నెట్ సేవలు అందుబాటులో ఉన్నప్పటికీ జిల్లా స్థాయి కార్యాలయంలో ఇలాంటి సమస్యలు కొనసాగడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

స్లాట్లు వాయిదా.. ప్రజలకు ఇబ్బందులు

సాంకేతిక సమస్యల కారణంగా స్లాట్లు వాయిదా పడుతుండటంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన వాహనదారులు సమయం, డబ్బు వృథా చేసుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి రవాణా శాఖ సేవలు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



రూ.5,400 కోట్ల విద్యుత్ భారం ప్రజలపై మోపే కుట్ర

- ఈఆర్సీ ద్వారా ట్రూ అప్ పేరుతో వసూళ్లకు ప్రభుత్వం యత్నం
- మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆరోపణ

ప్రజా వాయిస్,కోదాడ: ట్రూ అప్ పేరుతో సుమారు రూ.5,400 కోట్ల విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆరోపించారు. కోదాడలోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేశారు.కరువు పరిస్థితుల్లో రైతులకు సాగునీరు, విద్యుత్, యూరియా సక్రమంగా అందడం లేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని, ప్రస్తుతం కరెంట్ కోతలతో రైతులు పంటలను కాపాడుకునేందుకు డీజిల్ కోసం వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు.గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అని చెప్పి.. 201 యూనిట్లు దాటితే మొత్తం బిల్లును వసూలు చేస్తున్నారని విమర్శించారు. గురుకుల విద్యార్థులకు పౌష్టికాహారం, నాణ్యమైన సౌకర్యాలు అందడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం ప్రజలపై అదనపు భారాన్ని మోపే నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించి ప్రభుత్వానికి ప్రజలు తగిన సమాధానం చెప్పాలని కోరారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన

- అడవి శ్రీరాంపూర్ లో అటవీశాఖ తనిఖీలు
- వేట ఉచ్చుల స్వాధీనం



ప్రజా వాయిస్ మంథని వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి సమిష్టి బాధ్యత అని మంథని ఫారెస్ట్ రేంజ్ అధికారి (ఎఫ్ఆర్ఓ) ఎం.వి. నాయక్ అన్నారు. వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా పెద్దపల్లి జిల్లా అటవీ అధికారి ఆదేశాల మేరకు ముత్తారం మండలం, మంథని రేంజ్ పరిధిలోని అడవి శ్రీరాంపూర్ గ్రామంలో బుధవారం అటవీశాఖ అధికారులు, సిబ్బంది స్థానిక పోలీసుల సహకారంతో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. మంథని, పెద్దపల్లి ఫారెస్ట్ రేంజ్‌ల సిబ్బంది సంయుక్తంగా చేపట్టిన తనిఖీల్లో 2 వేట వలలు, 20 ఉచ్చులు, ఒక ఇనుప బోను, 2 కిలోల బైండింగ్ వైర్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ ఎం.వి. నాయక్ మాట్లాడుతూ.. వన్యప్రాణులను వేటాడటం, చెట్లను అక్రమంగా నరికివేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. అక్రమ వేటకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటవీ వనరులు, వన్యప్రాణుల సంరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

విద్యార్థులకు అవగాహన

అనంతరం దర్యాపూర్‌లోని తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలను అటవీ అధికారులు సందర్శించి విద్యార్థులు, సిబ్బందికి వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం అడవి శ్రీరాంపూర్ బీట్ పరిధిలోని కంపార్ట్‌మెంట్ నంబర్ 444 రిజర్వ్ ఫారెస్ట్‌లో ట్రెక్కింగ్ నిర్వహించారు. మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో ఎఫ్ఆర్ఓలు ఎం.వి. నాయక్, టి. సతీష్‌కుమార్, డిప్యూటీ రేంజ్ అధికారులు పి. దేవదాస్, ఎన్. రమేష్, ఫారెస్ట్ సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు, ఫీల్డ్ బయాలజిస్ట్ ఎం. చంద్రకాంత్‌తో పాటు అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- శేరిలింగంపల్లిలో ఘనంగా 'సేవా సంకల్ప్ అభియాన్ '
- 25 ఏళ్లుగా ప్రజాసేవే మోదీ లక్ష్యం: డా. కె. లక్ష్మణ్
- సేవా జ్యోతి యాత్రలో భారీగా పాల్గొన్న బీజేపీ శ్రేణులు

ప్రజా వాయిస్,శేరిలింగంపల్లి:2047 నాటికి భారత్‌ను వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీ ఆధ్వర్యంలో 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా చందానగర్ క్రిస్టల్ గార్డెన్స్‌లో 'వికసిత్ భారత్ సంకల్ప సభ' నిర్వహించారు.సభకు ముఖ్య అతిథిగా హాజరైన రాజ్యసభ సభ్యుడు డా. కె. లక్ష్మణ్ మాట్లాడుతూ.. గుజరాత్ ముఖ్యమంత్రిగా 2001లో బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రధాని మోదీ సుమారు 25 ఏళ్లుగా ప్రజాసేవే ధ్యేయంగా పనిచేస్తున్నారని అన్నారు. ఆయన నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. మౌలిక వసతులు, తయారీ, డిజిటల్ రంగం, విద్య, వైద్యం తదితర రంగాల్లో మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు.రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ.. జన్‌ధన్, ఉజ్వల, జల్‌జీవన్ మిషన్, పీఎం ఆవాస్, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాల ద్వారా పేదలకు ప్రయోజనాలు అందుతున్నాయని అన్నారు. దేశాన్ని 2047 నాటికి వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రతి కార్యకర్త, పౌరుడు భాగస్వామి కావాలని కోరారు.అనంతరం క్రిస్టల్ గార్డెన్స్ నుంచి చందానగర్ స్వాగత్ హోటల్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు 'సేవా జ్యోతి యాత్ర' నిర్వహించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి ఆలె భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, వివిధ మోర్చాల నాయకులు, డివిజన్ అధ్యక్షులు, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం మత్తులో భర్త దాడి

- చికిత్స పొందుతూ భార్య మృతి



ప్రజా వాయిస్,మధంపల్లి, అక్టోబర్ 7భార్యపై అనుమానంతో మద్యం మత్తులో భర్త బ్యాట్‌తో తలపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన విషాద ఘటన మధంపల్లి మండలం పెదవీడు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన దేశబోయిన అచ్చయ్య మంగళవారం రాత్రి మద్యం మత్తులో తన భార్య చంద్రకళ (38)పై అనుమానంతో బ్యాట్‌తో తలపై గట్టిగా కొట్టగా ఆ దాడిలో చంద్రకళ తీవ్రంగా గాయపడటంతో కుటుంబ సభ్యులు వెంటనే ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. ఘటన అనంతరం నిందితుడు అచ్చయ్య పరారీలో ఉన్నట్లు సమాచారం. సమాచారం అందుకున్న మధంపల్లి పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఇంటి ఆవరణలో గంజాయి సాగు

- పోలీసుల దాడిలో మూడు మొక్కలు స్వాధీనం.
- నిందితుడిపై కేసు నమోదు.

ప్రజా వాయిస్ మంచిర్యాల రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ ఆదేశాల మేరకు, టాస్క్‌ఫోర్స్/నార్కోటిక్స్ ఏసీపీ శ్రీనివాస్ మరియు చెన్నూర్ రూరల్ సీఐ కృష్ణ.పర్యవేక్షణలో కోటపల్లి ఎస్ఐ శివనీతి రాజశేఖర్, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ జె. లక్ష్మణరావు లు పోలీసు సిబ్బంది తో కలిసి నమ్మదగిన సమాచారం మేరకు ఎదుళ్లబందం గ్రామానికి చెందిన దుర్గం మహేష్ (33), తండ్రి: చంద్రయ్య ఇంటి ఆవరణలో తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో ఇంటి ఆవరణలో సాగు చేస్తున్న గంజాయి మొక్కలకు, మహేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడ సాగు చేస్తున్న మూడు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న మొక్కలను వ్యవసాయ శాఖ ఏఈఓ పరిశీలించి అవి గంజాయి మొక్కలేనని నిర్ధారించారు. వీటిలో రెండు మొక్కలు 12 అంగుళాలు, మరో మొక్క 14 అంగుళాల ఎత్తు ఉన్నట్లు ఎస్ ఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న మూడు మొక్కల విలువ సుమారు రూ.4,600 ఉంటుందని అంచనా వేశారు.గంజాయి సాగు, విక్రయాలు, రవాణా, వినియోగానికి పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగంగా అనుమానాస్పద వ్యక్తులు వారి కార్యకలాపాలపై అనుమానం ఉంటే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోటపల్లి ఎస్ ఐ రాజశేఖర్ ప్రజలకు సూచించారు.



ఫిర్యాదు ఫైల్ లోనే.. చర్యలు గాలిలోనే!

- తొర్రూరు వైన్స్–బె షాపులపై ఏప్రిల్ లో ఫిర్యాదు
- నెలలు గడిచినా విచారణ ఏది?

బెల్ట్ షాప్ లపై తీసుకున్న చర్యలు వివరాలను జిల్లా ఎక్సైజ్ అధికారులు బహిర్గతం చేయాలి.

- బెల్ట్ షాప్ లపై ప్రభుత్వానికి బాధ్యత లేదా?
- జిల్లాస్థాయిలో కాకుండా రాష్ట్ర స్థాయి విచారణకు డిమాండ్
- లక్షల జీతాలు తీసుకుంటున్న ఎక్సైజ్ అధికారులు ఎక్కడ?
- ఫిర్యాదు తీసుకొని మద్యం షాప్ ల పైన చర్యలు ఎందుకు తీసుకోలేదు
- వైన్స్ యజమాన్యం నుండి మీకు రావలసిన మామూళ్లు మీకు అందుతున్నాయా?

ప్రజా వాయిస్/తొర్రూరు తొర్రూరు పట్టణంలోని వైన్స్ షాపుల నుంచి గ్రామాల్లోని బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు, అధిక ధరలకు విక్రయాలు, మద్యం నాణ్యతపై అనుమానాలపై ఏప్రిల్ 15, 2026న మహబూబాబాద్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు కనిపించకపోవడంపై ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఫిర్యాదు అందుకున్న అధికారులు వైన్స్ షాపుల స్టాక్, విక్రయ రికార్డులు, సరఫరా మార్గాలు, బెల్ట్ షాపులపై తనిఖీలు నిర్వహించారా? నిర్వహిస్తే ఏం తేలింది? అనే వివరాలు మాత్రం బయటకు రాలేదు.

ఫిర్యాదు చేసి నెలలు.. గడుస్తున్న విచారణ ఎక్కడ?

ఏప్రిల్ 15న జిల్లా ఎక్సైజ్ అధికారికి ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు చర్యలపై స్పష్టత లేకపోవడం అధికారుల పనితీరుపై అనుమానాలకు తావిస్తోంది. ఫిర్యాదుపై ప్రాథమిక విచారణ కూడా జరిగిందా? జరిగితే నివేదిక ఏమైంది? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది.

వైన్స్ నుంచి బెల్ట్ షాపులకు సరఫరా జరుగుతుందని ఫిర్యాదు చేస్తే దానిపై చర్యలేవు?

గ్రామాల్లో విచ్చలవిడిగా కొనసాగుతున్న బెల్ట్ షాపులకు మద్యం ఎక్కడి నుంచి వస్తోంది? వైన్స్ షాపుల నుంచే సరఫరా అవుతోందా? అయితే ఏ షాపు నుంచి, ఎంత పరిమాణంలో సరఫరా జరుగుతోంది? అన్న అంశాలపై ఎక్సైజ్ శాఖ తనిఖీలు నిర్వహించాల్సి ఉంది. స్టాక్ రిజిస్టర్లు, బిల్లులు, విక్రయ వివరాలు పరిశీలిస్తే అసలు విషయం బయటపడే అవకాశం ఉంది.

అధిక ధరలపై కల్తీ మద్యంపై చర్యలెందుకు లేవు?


వైన్స్ షాపుల్లో నిర్ణయించిన ధరల కంటే అధికంగా మద్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలు వచ్చినప్పుడు అధికారులు తనిఖీలు నిర్వహించి వాస్తవాలను తేల్చాల్సి ఉంటుంది. మరి ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు తనిఖీలు జరిగాయా? అక్రమ విక్రయాలు గుర్తిస్తే ఎవరిపై చర్యలు తీసుకున్నారు? లేక ఫిర్యాదు ఫైలు కార్యాలయాలకే పరిమితమైందా? అని ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

అధికారుల మౌనమే అనుమానాలకు కారణం?

ఫిర్యాదుపై చర్యలు తీసుకోకపోవడంతో వైన్స్ యాజమాన్యాలపై వచ్చిన ఆరోపణలను అధికారులు ఎందుకు సీరియస్‌గా తీసుకోవడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులకు–వైన్స్ యాజమాన్యాలకు మధ్య ఏదైనా కుమ్మక్కు ఉందా అన్నది అనుమానంగా ఉంది.అయితే దానిపై కూడా స్వతంత్ర విచారణ జరిపి నిజానిజాలు వెల్లడించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఫిర్యాదు దారుడు పేర్కొంటున్నారు.

జిల్లా స్థాయిలో కాకుండా.. రాష్ట్రస్థాయి విచారణకు డిమాండ్

జిల్లా స్థాయిలో ఫిర్యాదుపై చర్యలు కనిపించకపోతే కమిషనర్ ప్రొహిబిషన్ & ఎక్సైజ్, డైరెక్టర్ ఎన్‌ఫోర్స్‌మెంట్, జాయింట్ కమిషనర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్థాయిలో స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ ఎక్సైజ్ శాఖలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి ప్రత్యేక అధికారులు ఉన్నందున ఈ వ్యవహారాన్ని జిల్లా అధికారులతో మాత్రమే కాకుండా రాష్ట్రస్థాయి బృందంతో తనిఖీ చేయాలని కోరుతున్నారు.



DATE: 11/04/2026

TO,
THE COLLECTOR Madam,
MAHABUBABAD DIST..

మహబూబాబాద్ జిల్లా THORRUR మండలం లో ఉన్న 8 వైన్స్ లు సిండికేట్ గా ఏర్పాటు చేసుకొని మండలం లోని 29 ఊర్లకు ఒక్కో కోటర్ సీసా పై 25 రూపాయలు, ఫుల్ బాటిల్ పై 100 రూపాయల వరకు తీసుకొని, వీళ్ళు సరఫరా చేసే బాటిల్స్ పై స్టిక్కరు వేసి, 29 ఊర్ల బెల్ట్ షాపులకు నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రిలో మద్యం సరఫరా చేస్తున్నారు ..

తొర్రూర్ మండలం లోని 8 వైన్స్ లు సిండికేట్ గా ఏర్పడి మండలం లోని ఊర్ల బెల్ట్ షాపులకు ఇలా ఎక్కువ రేట్లకు మద్యం అమ్మడం ద్వారా అక్కడ ఊర్లలో బెల్ట్ షాప్ వాళ్ళు ప్రజలకు ఒక్కో బాటిల్ పై 150 రూపాయల వరకు ఎక్కువ వసూల్ చేస్తున్నారు .. దీని వలన పేద ప్రజల కుటుంబాలు మద్యానికి బానిస అయి కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయి .. ముఖ్యంగా Villages యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారు ..

ఇంత తతంగం జరుగుతున్నా మహబూబాబాద్ జిల్లా ఆబ్కారీ శాఖ మాత్రం చూసి చూడనట్లు ఉంటున్నారు అని తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి.. ముఖ్యంగా వైన్స్ షాపులు సిండికేట్ అయిన దగ్గర ఆబ్కారీ శాఖ వారికి ఎక్కువ మొత్తం లో సిండికేట్ యజమానులు ఆబ్కారీ శాఖ వారికీ డబ్బులు ముట్టజెప్పుతున్నారని తీవ్ర ఆరోపణలు ఉన్నాయి సార్ .. పూర్తి వివరాలకు నిజ నిర్ధారణ క్షేత్ర స్థాయి విచారణకు ఆదేశించాలని విజ్ఞప్తి చేస్తూ , అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ, ఊర్లలో ఏర్పాటు చేసిన బెల్ట్ షాపులకు మద్యం సరిపోవేసే , సిండికేట్ అయిన వైన్స్ ల లైసెన్సులు రద్దు చేయగలరని విజ్ఞప్తి సార్ ..


Copy to,..
- Mahabubabad Excise Officer (DC)
- Excise CI, Thorrur
- Excise SI , Thorrur

ఇట్లు
గాడిపల్లి యాకన్న
జర్నలిస్ట్, సామాజిక సేవా కార్యకర్త
Cell: 9989136215

తాటి ఊసరవెల్లి రంగులు వాడి వేడిగా కొనసాగుతున్న బీఆర్ఎస్ నాయకత్వం!

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా తాటికి అవమానం?
- నాలుగు శతాబ్దాలుగా రాజకీయ ప్రస్థానంలో రెండుసార్లు తిరస్కరణ?
- నియోజకవర్గ ఇన్చార్జిగా మెచ్చని ఎవరు నియమించారంటూ మండిపాటు!
- ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో అభ్యర్థి ప్రకటన సందర్భంగా ఘర్షణలు?
- అయోమయం స్థితిలో బీఆర్ఎస్ కార్యకర్తలు!?
- ప్రశ్నార్థకంగా మిగిలిన భవిష్యత్తు కార్య చరణ!
- కుమ్ములాటల మధ్య నిలబడలేనని తేల్చి చెప్పేసిన మాజీ టైగర్ తాటి?
- భవిష్యత్ కార్యక్రమం పై తుది నిర్ణయం అంటూ ప్రచారం!?

ప్రజా వాయిస్ అశ్వారావుపేట గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి అభివృద్ధి బాటలు వేసిన పాలనలో నేడు బీటలు బారుతుందని చెప్పుకోవచ్చు. ఓకే నియోజకవర్గంలో ఇద్దరు మాజీల మధ్య పోరు రచ్చకెక్కి అతిష్టనం వద్దకు పంచాయతీలు కూడా వెళ్లిన సందర్భాలు కనిపిస్తున్నారు. ఇరువురు మధ్య ఢీ అంటే ఢీ అనే విధంగా రాజకీయ వేడి పుట్టింటికి రావటంతో కార్యకర్తలు సంక్షేమంలో పడుతున్నారని తెలుస్తుంది. ఒకరు టిడిపి పార్టీ నుండి గెలిచి బీఆర్ఎస్ కండువా కట్టుకొని పదవులను అనుభవించి మరల కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు మరొకరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుండి గెలిచి బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకొని పార్టీ కార్యక్రమాలు కొనసాగించినారు కానీ నియోజకవర్గ ఇన్చార్జి పదవిపై ఇరువురు కొట్లాట తారాస్థాయికి చేరుకొని పెద్ద రగడే కొనసాగుతుందని చెప్పుకోవచ్చు కొత్తగూడెం ఎమ్మెల్సీ ఎన్నిక లలో భాగంగా అభ్యర్థులు ప్రకటించే విధానంలో ఓ సమావేశంలో ఓ మాజీకి అవమానం కలగడంతో అట్టి ప్రదేశం నుండి బయటకు వచ్చి ఈ పార్టీలో నేను విమడలేను రాజీనామా చేస్తున్నానని చెప్పటం కొత్త ఏం కాదు అసలు నియోజకవర్గ ఇన్చార్జిగా తనను ఎవరు నియమించారంటూ రాజ్యసభ సభ్యులు ముందే రచ్చ రేగటంపై ఒక్క నియోజకవర్గమే కాకుండా ఉమ్మడి ఖమ్మం జిల్లా తో పాటు రాష్ట్ర ప్రధాన నాయకులు సైతం ఉలిక్కిపడినంత పని అయిందని తెలుస్తుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గంలోని ఇరువురు మాజీ మంత్రులు మధ్య రగడ తారాస్థాయికు చేరుకుందని చెప్పుకోవచ్చు 2027 ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థులు ప్రకటనలో భాగంగా టిబీఆర్ఎస్ పార్టీ కొత్తగూడెం లో ఏర్పాటు చేస్తున్న సమావేశాన్ని ఏర్పాటు చేసి కార్యకర్తలకు మరియు మాజీ లకు ఆహ్వానం పలికింది. ఇటువంటి సందర్భంలో మంగళవారం సమావేశానికి హాజరైన రాజ్యసభ సభ్యుడు వద్దే రాజు రవి చంద్ర, తాకిడి పల్లి రవీందర్, కాకా మధు. అధ్వర్యంలో జరిగిన సమావేశంలో టైకర్ మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు శతాబ్దాలుగా రాజకీయ అనుభవం కలిగిన వ్యక్తిగా ఉన్నప్పటికీ పార్టీ కార్యక్రమాలు చురుగ్గా పాల్గొంటున్న నాకు పార్టీ పెద్దలు కనీస గౌరవం కూడా ఇవ్వని పరిస్థితి ఉందని ఇటువంటి విధానంలో నేను కొనసాగలేనని అశ్వారావుపేట నియోజకవర్గ ఇన్చార్జి పదవి



అవగాహన వ్యక్తులకు నియమించటం సభమ కాదని మర్యాదలు లేని పార్టీలో కొనసాగటం కష్టతరంగా మారిందని కార్యకర్తల భవిష్యత్తు ప్రణాళికలతో పార్టీకి రాజీనామా చేస్తున్నానని మాట్లాడటం పెద్ద దుమారమే లేపింది అంతేకాకుండా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరరావు రేగా ఖకాం తారావు వంటి ప్రధాన నాయకులు కూడా ఉండటం తాటి వెంకటేశ్వర్లకు జీర్ణించుకోలేని అంత పని అయిందని తెలుస్తుంది వలసదారులకు ప్రాధాన్యం ఇస్తున్న పార్టీ అనుభవజ్ఞులకు ఎందుకు ఇవ్వటం లేదు తెలియదని మనుగుడు కష్టతరంగా ఉందని మాట్లాడటం కొసమెరుపు.

బుజ్జగించిన ఫలితం శూన్యమే!?

గత కొన్నాళ్లగా బిఆర్ఎస్ పార్టీలోని ఇరువురు మాజీల మధ్య రగడ తారాస్థాయికి చేరుకుంటుందని చెప్పుకోవచ్చు నిజానికి చిన్న పదవి అయినా నియోజకవర్గ ఇన్చార్జి బాధితులు పార్టీ మాజీ ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరరావు కి అప్పగించి పార్టీ విధివిధానాలను జరిపిస్తున్నప్పటికీ మరో మాజీ ఎమ్మెల్యే అయిన తాటి వెంకటేశ్వర్లు కూడా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే ఉన్నారు. అయినప్పటికీ అతిష్టనం దూరం పెట్టిందా! పదవి దక్కలేదని పార్టీని వీడినాడా! ఇదిలా ఉంటే గత కొన్ని రోజులుగా పార్టీలోని గళాటాలను ప్రధాన నాయకులు చెంత చేరి బొజ్జగించుతున్న ఫలితం మాత్రం శూన్యం అని తెలుస్తుంది. ప్రస్తుత పరిస్థితులలో ప్రజలకు పార్టీ దగ్గరవుదామని అధికార పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అమలుపై కొట్లాడుతున్న సందర్భంలో బీఆర్ఎస్ పార్టీకి మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు రాజీనామా చేయటం కొంత బిగ్ షాక్ లాగా ఉందని ప్రచారం జోరుగా కొనసాగుతుంది.

మాజీ రాజీనామా తో భవిష్యత్తు కార్య చరణం ప్రశ్నార్థకమే!?

1999 సంవత్సరంలో బూర్గంపాడు నియోజకవర్గ నుంచి తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందిన తాటి వెంకటేశ్వర్లు రాజకీయ సమీకరణ నైపద్యంలోని టిడిపిని వీడి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 సంవత్సరం అశ్వారావుపేట నియోజకవర్గం నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లో గెలిసి అసెంబ్లీలో రెండవసారి అడుగు పెట్టారు తదుపరి గులాబీ కండువా కప్పుకొని 2018 అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి టిడిపి బలపరిచిన మెచ్చ నాగేశ్వరరావు చేతిలో వాటమిపాలై బీఆర్ఎస్ పార్టీలో తనకు సరైన గుర్తింపు దక్కకపోవడంతో మనస్థాపం చెంది 2022 జూన్ 24 వ తారీకు గాంధీభవనంలోని పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు కాగా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆయన కు అశ్వారావుపేట ఎమ్మెల్యే టిక్కెట్టు నిరాకరించటంతో తీవ్ర మనస్థాపనకు గురై నవంబర్ 2023 దమ్మపేటలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభ ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో మరలా బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు.

ఆ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు గెలుపు కోసం కృషి చేశారు. తాజా ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో మరో మారు మాజీ తాటి వెంకటేశ్వర్లకు అవమానం జరగడంతో రాజీనామా ప్రకటించినట్లు తెలుస్తుంది ఏది ఏమైనా అశ్వారావుపేట నియోజకవర్గం లోని బిఆర్ఎస్ పార్టీ మనుగుడు ప్రశ్నార్థకమే అని చెప్పుకోవచ్చు పార్టీని నమ్ముకొని కార్యకర్తల అడుగుజాడల్లో నడుస్తున్న కొందరు కార్యకర్తలకు భవిష్యత్తు కార్య చరణం ఎటువైపు మలుపు తిప్పుతుందో వేచి చూడాలి మరి!.

'పూర్వజన్మలో మనం భార్యాభర్తలం'

- హెచ్ఎం వికృత చేష్టలు.. ఆయా ఫిర్యాదుతో కేసు నమోదు

ప్రజా వాయిస్,హనుమకొండ: హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలోని ఓ ఎంపీపీఎస్ పాఠశాల హెచ్ఎంపై ఆయా పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనను వేధిస్తూ.. దేవుడి పేరు చెప్పి ''గత జన్మలో మనమిద్దరం భార్యాభర్తలం.. కలిసి జీవించాలి. లేదంటే నీ భర్త, పిల్లలు ఇబ్బందులు పడతారు'' అంటూ బెదిరించినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది.ఇటీవల తన ఫొటోలను ఏఐ సాంకేతికతో మార్ఫింగ్ చేసి దుష్ప్రచారం చేసినట్లు ఆరోపించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్ తెలిపారు.

ఊపిరాడనివ్వని కాలుష్యం.!

- బొంతపల్లిలో విషవాయువులతో ఉక్కిరిబిక్కిరి
- సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆందోళన
- రాత్రివేళల్లో పరిశ్రమల నుంచి విషవాయువుల విడుదల
- చిన్నారులు, వృద్ధులకు శ్వాసకోశ సమస్యలు
- పీసీబీకి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం
- కాలుష్య కొలత యంత్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్
- కట్టడి చేయకపోతే ప్రజలతో కలిసి ఆందోళన చేస్తాం

ప్రజా వాయిస్,జిన్నారం: పారిశ్రామిక ప్రాంతమైన బొంతపల్లి గ్రామంలో కాలుష్యం తీవ్రతరమవుతోందని ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమల నుంచి వెలువడుతున్న పొగలు, విషవాయువులతో కనీసం ఊపిరి పీల్చుకోలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్య కోరల్లో చిక్కుకుని గ్రామ ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని తెలిపారు.గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కమిషనర్ దశరథ్ అధ్యర్యంలో, చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొంతపల్లి ప్రజాప్రతినిధులు కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ పరిధిలోని పరిశ్రమల నుంచి రాత్రివేళల్లో నిబంధనలకు విరుద్ధంగా పొగలు, రసాయన విషవాయువులు విడుదలవుతున్నాయని ఆరోపించారు.విషవాయువుల కారణంగా ఇళ్లలో ఉండలేకపోతున్నామని, స్వచ్ఛమైన గాలి పీల్చుకునే పరిస్థితి కూడా లేకుండా పోయిందని వాపోయారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు శ్వాసకోశ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాలుష్యంపై గతంలో పలుమార్లు పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని అన్నారు.గ్రామంలో కాలుష్య తీవ్రతను నిరంతరం పర్యవేక్షించేందుకు కాలుష్య కొలత యంత్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు తక్షణమే గ్రామంలో పర్యటించి కాలుష్య తీవ్రతను పరిశీలించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న పరిశ్రమలపై చర్యలు తీసుకుని కాలుష్యాన్ని కట్టడి చేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే గ్రామ ప్రజలతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో వైస్‌చైర్మన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కరువు కోరల్లో బొమ్మలరామారం.!

- ఎండిపోతున్న పంటలు.. ఆందోళనలో రైతులు
- కరువు మండలంగా ప్రకటించి ఆదుకోవాలి
- ఎండిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలి
- వరి పంటకు బోనస్ ఇవ్వాలి: సీపీఎం



ప్రజా వాయిస్,బొమ్మలరామారం: వర్షాలు ముఖం చాటేయడంతో బొమ్మలరామారం మండలంలో పంటలు ఎండిపోతున్నాయని, రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని సీపీఎం మండల కార్యదర్శి ర్యకల శ్రీశైలం అన్నారు. మండ లాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో హాజీపూర్ గ్రామంలో ఎండిపోతున్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురవకపోవడంతో వర్షాధారంగా సాగు చేస్తున్న వరి, పత్తి పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. సాగునీటి వసతి లేకపోవడంతో వర్షాలపైనే ఆధారపడి వ్యవసాయం చేయాల్సి వస్తోందన్నారు. ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించడంతోపాటు వరి పంటకు బోనస్ ప్రకటించాలని కోరారు.


కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు'

కాపాస్ కిసాన్' స్లాట్ బుకింగ్ విధానం వల్ల ధాన్యం విక్రయించేందుకు రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద వేచి ఉండాల్సి వస్తోందని శ్రీశైలం తెలిపారు. దీంతో రవాణా ఖర్చులు పెరిగి రైతులపై అదనపు భారం పడుతోందన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను సరళీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేశెట్టి సత్యనారాయణ, మల్లేష్, మాధవరెడ్డి, దూషష్, తుమ్మల వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జనక్ ప్రసాద్‌పై దళితుల భూములపై కబ్జా ఆరోపణలు

- INTUC నాయకుడు జనక్ ప్రసాద్ పై రైతుల తీవ్ర ఆరోపణలు
- 109 సర్వే నంబర్ భూమిపై వివాదం
- సమగ్ర సర్వేకు డిమాండ్



ప్రజా వాయిస్ - మంచిర్యాల జిల్లా ప్రతినిధి మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గం జైపూర్ మండలం ఇందారం గ్రామంలోని రసూల్‌పల్లి ప్రాంతంలో దళితుల అసైన్డ్ భూములపై కబ్జాకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పలువురు రైతులు ఆరోపించారు. 109 సర్వే నంబర్‌లో మాదిగ సామాజిక వర్గానికి చెందిన వడ్లకొండ శంకర్, వడ్లకొండ పర్వతాలు, ప్రభాకర్‌కు సంబంధించిన భూముల్లోకి అక్రమంగా ప్రవేశించి కంచె ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరిగాయని వారు పేర్కొన్నారు.తమ భూముల్లో ఏర్పాటు చేసిన కంచెకు సంబంధించిన గుంతలను తొలగించడంతో, తమపైనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని రైతులు ఆరోపించారు. రాజకీయ పలుకుబడిని ఉపయోగించి తమ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

పాత దారిని మళ్లించి భూముల్లోకి తీసుకెళ్లారని ఆరోపణ

జనక్ ప్రసాద్‌కు చెందిన 105 సర్వే నంబర్‌లోని పట్టా భూమికి 1972కు ముందు నుంచే ఉన్న పాత నక్షా దారి ఉందని రైతులు తెలిపారు. ఆ దారిని 109 సర్వే నంబర్‌లోని అసైన్డ్ భూముల వైపు మళ్లించి, తన ఫార్మ్‌హౌస్‌తో పాటు ఇతరుల అవసరాలకు రహదారి ఏర్పాటు చేసుకున్నారని ఆరోపించారు. గతంలో తాము ఈ విషయంపై ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదని చెప్పారు.అలాగే 106 సర్వే నంబర్‌లోని దిబ్బాట భగవాన్‌చారి కుటుంబానికి చెందిన అసైన్డ్ భూమిని కూడా ఆక్రమించి కోళ్ల ఫారం షెడ్లు నిర్మించారనే ఆరోపణలు ఉన్నాయని రైతులు పేర్కొన్నారు. ప్రస్తుతం 109 సర్వే నంబర్‌లోని తమ కుటుంబ భూమిపై కూడా అదే తరహాలో కబ్జాకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

సమగ్ర సర్వే చేపట్టి హద్దులు తేల్చాలని డిమాండ్

109, 106తో పాటు పరిసర ప్రాంతంలోని భూములన్నింటినీ అధికారుల సమక్షంలో సమగ్రంగా సర్వే చేసి హద్దులను నిర్ధారించాలని రైతులు డిమాండ్ చేశారు. ఎవరైనా భూమిని ఆక్రమించలేదని నిరూపించుకునేందుకు సిద్ధంగా ఉంటే, అధికారిక సర్వేకు ముందుకు రావాలని కోరారు.అసైన్డ్ భూములపై తమకు హక్కులు ఉన్నాయని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకునే ప్రసక్తే లేదని రైతులు స్పష్టం చేశారు. కార్మిక సంఘం నాయకుడిగా చెప్పుకునే వ్యక్తి దళిత రైతుల భూముల విషయంలో న్యాయం చేయాలని వారు కోరారు. తమ భూములపై జరుగుతున్న వివాదాన్ని అధికారులు తక్షణమే పరిష్కరించి, రికార్డుల ఆధారంగా హద్దులను నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు.

పేదల ఇళ్లపై బుల్డోజర్.. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం.?

- చెరబండరాజు కాలనీ వాసులకు అండగా వెళ్తే మాజీ ఎమ్మెల్యే అరెస్టు
- 'మార్పు' పేరుతో మోసం.. పేదల పొట్టకొడుతున్నారని వినయ్ భాస్కర్ ధ్వజం
- కోర్టు, కమిషన్ల ఆదేశాలున్నా కూల్చివేతలేంటని ప్రశ్న
- ఇళ్లు కూల్చి.. బాధితులనే అరెస్టు చేయడం దారుణమని విమర్శ
- ఎన్ని కేసులైనా ఎదుర్కొంటా.. పేదల పక్షాన పోరాడతానని స్పష్టీకరణ



ప్రజా వాయిస్,హనుమకొండ: వరంగల్ భద్రకాళి ఆలయ సమీపంలోని చెరబండరాజు కాలనీలో పేదల గుడిసెల కూల్చివేతల వ్యవహారం ఉద్రిక్తతకు దారితీసింది. బాధితులకు సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నేత, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌ను సుబేదారి పోలీసులు అరెస్టు చేశారు. తొలుత హౌస్ అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించగా ఆయన ప్రతిఘటించారు. అనంతరం అదుపులోకి తీసుకుని వడ్డేపల్లిలోని ఆయన నివాసానికి తరలించి సాయంత్రం వరకు నిర్బంధించారు.ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యం అంటే పేదల ఇళ్లు కూల్చే రాజ్యమా? అని ప్రశ్నించారు. మార్పు తీసుకొస్తామని చెప్పి పేదలను మోసం చేస్తున్నారని, బాగు చేసే ప్రభుత్వం వస్తుందని చెప్పి బుల్డోజర్ రాజ్యం తెచ్చారని విమర్శించారు. పేదల తరఫున ప్రశ్నిస్తున్న ప్రతిపక్షంపై కేసులు, అరెస్టులతో అణచివేతకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

హామీలిచ్చి.. ఇళ్లు కూల్చారా.?

చెరబండరాజు కాలనీ వాసులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఉద్యోగాలు ఇస్తామని గతంలో హామీలు ఇచ్చారని వినయ్‌భాస్కర్ తెలిపారు. అవి అమలు కాకపోవడంతో బాధితులు కలెక్టర్‌ను కలిసి తమ గుడిసెలు తమకే కావాలని విన్నవించుకున్నారని చెప్పారు. మంగళవారం రాత్రి కలెక్టర్‌ను కలిసిన మరుసటి రోజే గుడిసెలను కూల్చివేయడం అన్యాయమన్నారు. కూల్చివేతలను అడ్డుకునే క్రమంలో కొందరు గాయపడ్డారని, మరికొందరు ఆత్మ హత్యాయత్నానికి పాల్పడే పరిస్థితి వచ్చిందని ఆరోపించారు.

ఆదేశాలున్నా.. కూల్చివేతలేంటి.?

కాలనీ వాసుల ఇళ్ల కూల్చివేతపై హైకోర్టులో స్టే ఉందని, మానవ హక్కుల కమిషన్ ఈ నెల 29న విచారణ చేపట్టనుందని వినయ్‌భాస్కర్ పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ కూడా పేదలు, దళితులు, గుడిసెవాసుల పక్షాన ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. అయినా కూల్చివేతలు చేపట్టడం ద్వారా ప్రభుత్వం చట్టాలను, న్యాయస్థానాలను గౌరవించడం లేదని ఆరోపించారు.

'ఎన్ని కేసులైనా.. వెనక్కి తగ్గను'

గత మూడేళ్లుగా చెరబండరాజు కాలనీ వాసుల సమస్యపై ప్రతిపక్షంగా పోరాడుతున్నామని వినయ్‌భాస్కర్ తెలిపారు. ప్రభుత్వ స్థలంలో ఇళ్లు, ఒక ప్రభుత్వ ఉద్యోగం కల్పించి వారి స్థలాలను తీసుకోవాలని తాము కోరుతున్నామన్నారు. తనను అరెస్టు చేసినా, ఎన్ని కేసులు పెట్టినా పేదల పక్షాన పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

ఆలయ అభివృద్ధికి సహకారం

భద్రకాళి ఆలయ అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని వినయ్‌భాస్కర్ తెలిపారు. ఆలయ నిర్మాణానికి రూ.30 కోట్ల నిధులు తాను తీసుకొచ్చానని, నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిందని గుర్తుచేశారు. ఆలయ మాడ వీధుల నిర్మాణానికి ముందు కాలనీ వాసులకు న్యాయం చేయాలని అప్పట్లోనే అధికారులకు సూచించినట్లు తెలిపారు. ''అభివృద్ధి చేయండి.. పేదలకు న్యాయం చేసి చేయండి'' అని ప్రభుత్వానికి సూచించారు.

గిరిజనుడిపై దాడి ఆరోపణలు

- అటవీశాఖ సిబ్బందిపై గిరిజనుల ఆగ్రహం
- చెన్నూరు ప్రభుత్వ ఆస్పత్రిలో లస్మయ్యకు చికిత్స.

ప్రజా వాయిస్. కోటపల్లి మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం కొత్తపల్లి రాజారాం గ్రామంలో అటవీ భూమిలో పట్టు పురుగుల సాగు చేస్తున్న గిరిజనులను అటవీశాఖ సిబ్బంది అడ్డుకునే క్రమంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ సందర్భంగా సిబ్బంది దాడి చేయడంతో చింతల లస్మయ్య అనే గిరిజనుడు తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయినట్లు కుటుంబ సభ్యులు, స్థానికులు ఆరోపించారు. అపస్మారక స్థితిలో ఉన్న లస్మయ్యను చెన్నూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స కొనసాగుతోంది. ఆయన పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. తర తరాలుగా సాగు చేసుకుంటున్న భూముల్లో అటవీ అధికారులు దౌర్జన్యానికి పాల్పడుతున్నారని గిరిజన సంఘాలు ఆరోపించాయి. ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



అంగన్వాడీ పైకప్పు పెచ్చులు ఊడి.. ముగ్గురు చిన్నారులకు గాయాలు.!

- శిథిలావస్థలో భవనం.. కళ్లెదుటే ప్రమాదం
- చెప్పినా పట్టించుకోలేదంటున్న తల్లిదండ్రులు

ప్రజా వాయిస్,ఆసిఫాబాద్: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని అంకుసాపూర్,తెలిగూడ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. కేంద్రంలో చిన్నారులు ఉన్న సమయంలో పైకప్పు పెచ్చులు ఒక్కసారిగా ఊడిపడటంతో సాత్విక్ (3), నిహారిక (4), సాయినాథ్ (5) గాయపడ్డారు. చిన్నారులను చూసేందుకు వచ్చిన తల్లులు సోనీ, సంధ్యారాణి కూడా గాయాలపాలయ్యారు.పెచ్చులు ఊడిపడటంతో ఒక్కసారిగా భయాందోళన నెలకొంది. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అంగన్వాడీ భవనం శిథిలావస్థకు చేరిందని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిల భవనానికి మరమ్మతులు చేపట్టాలని, చిన్నారుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.







పట్టభద్రులారా.. మీ ఓటు హక్కును నమోదు చేసుకోండి

- అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలి
- బీజేవైఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ కుమార్



ప్రజా వాయిస్ హైదరాబాద్/రాబోయే మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని బీజేవైఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైన పౌర హక్కు అని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేయడానికి అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన అన్నారు. 31 అక్టోబర్ 2023 లోపు డిగ్రీ ఉత్తీర్ణులైన అర్హత కలిగిన పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కోరారు.గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసిన వారు కూడా ఈ ఎన్నికల కోసం మళ్లీ తమ ఓటును నమోదు చేసుకోవాల్సిన అవసరం ఉందని ప్రవీణ్ కుమార్ తెలిపారు. కేవలం గతంలో ఓటు వేసినందుకు ఈసారి కూడా ఓటు హక్కు కొనసాగుతుందని భావించకుండా, అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడు ఓటరు నమోదును పూర్తి చేసుకోవాలని సూచించారు.2026 నవంబర్ 6వ తేదీలోపు అర్హత కలిగిన పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. యువత, ఉద్యోగులు, విద్యావంతులు, పట్టభద్రులు తమ ఓటు హక్కుపై నిర్లక్ష్యం చేయకుండా ఎన్నికల ప్రక్రియలో చురుకుగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.పట్టభద్రుల సమస్యలు, విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, యువత భవిష్యత్తు వంటి అంశాలపై తమ అభిప్రాయాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యక్తం చేయడానికి పట్టభద్రుల ఓటు హక్కు ఒక ముఖ్యమైన సాధనమని ఆయన పేర్కొన్నారు. అందువల్ల అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు "నా ఓటు – నా హక్కు, నా ఓటు – నా బాధ్యత" అనే భావనతో ముందుకు వచ్చి ఓటరుగా నమోదు చేసుకోవాలని ప్రవీణ్ కుమార్ కోరారు.పట్టభద్రులారా.. ఓటు నమోదు విషయంలో నిర్లక్ష్యం చేయకండి. మీ ఓటు హక్కును నమోదు చేసుకోండి.. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మీ ఓటు హక్కును తప్పక వినియోగించుకోండి అని ఆయన పిలుపునిచ్చారు.

కష్టకాలంలో ప్రజాధనం దుర్వినియోగం చేయొద్దు

- అండర్ డ్రైనేజీ పనులపై సామాజిక ఉద్యమకారుడు సయ్యద్ బషీరుద్దీన్ ఆందోళన



ప్రజా వాయిస్,కోదాడ: కష్టకాలంలో ప్రజాధనం దుర్వినియోగం కాకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సామాజిక ఉద్యమకారుడు సయ్యద్ బషీరుద్దీన్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. కోదాడ పట్టణంలో అండర్ డ్రైనేజీ పైపులైన్ల నిర్మాణం కోసం తారు రోడ్లను తవ్వి తొమ్మిది అంగుళాల పైపులు వేస్తున్నారని, దీంతో మురుగునీటి ప్రవాహంపై ప్రజల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు.ఇప్పటికే ఉన్న మురుగు కాలువలను సక్రమంగా శుభ్రం చేయని పరిస్థితుల్లో అండర్ డ్రైనేజీ పనుల పేరుతో భారీగా ప్రజాధనం ఖర్చు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పైపుల ద్వారా మురుగునీరు సాఫీగా ప్రవహించేలా సమగ్ర ప్రణాళికతో పనులు చేపట్టాలని సూచించారు.మిషన్ భగీరథ పనుల కోసం తవ్విన గుంతలు, నల్లా కనెక్షన్లు, ఇతర పైపులైన్లతో పట్టణంలోని రోడ్లు ఇప్పటికే అస్తవ్యస్తంగా మారాయని బషీరుద్దీన్ పేర్కొన్నారు. ఉన్న సీసీ రోడ్లను ధ్వంసం చేయకుండా, ముందుగా మట్టి రోడ్లపై అవసరమైన పైపులైన్లు ఏర్పాటు చేసి అనంతరం రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులను కోరారు. ప్రజాధనం వృథా కాకుండా పనులపై పర్యవేక్షణ పెంచాలని విజ్ఞప్తి చేశారు.





ఉచిత శిక్షణతో ఉద్యోగ లక్ష్యాన్ని ఛేదించండి

- ఎస్ ఐ, కానిస్టేబుల్ కొలువుల కోసం 350 మందికి 45 రోజుల శిక్షణ
- క్రమశిక్షణ.. పట్టుదల.. నిరంతర సాధనతో విజయం సాధించాలి
- మొబైల్ ,సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి
- రాత పరీక్షతోపాటు శారీరక దృఢత్వంపైనా దృష్టి పెట్టాలి
- అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని భవిష్యత్తును మార్చుకోవాలి:
- జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ,ఎస్పీ శరత్ చంద్ర పవార్

ప్రజా వాయిస్,నల్గొండ క్రైమ్: ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలే లక్ష్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు జిల్లా పోలీస్ శాఖ అందిస్తున్న ఉచిత శిక్షణను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సూచించారు. జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో కొనసాగుతున్న శిక్షణ తరగతులను బుధవారం వారు పరిశీలించారు. అభ్యర్థులతో మాట్లాడి వారి సన్నద్ధత, శిక్షణలో అందుతున్న బోధన, సౌకర్యాలపై ఆరా తీశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే లక్ష్యంపై పూర్తి దృష్టి, క్రమశిక్షణతో కూడిన చదువు, నిరంతర సాధన అవసరమన్నారు. శిక్షణలో బోధించే అంశాలను శ్రద్ధగా నేర్చుకోవడంతోపాటు ప్రతిరోజూ స్వయంగా చదువుకునేందుకు సమయం కేటాయించాలని సూచించారు.ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ సహకారంతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 350 మంది అభ్యర్థులకు 45 రోజులపాటు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. రాత పరీక్షతోపాటు ఎంపిక ప్రక్రియలోని అన్ని దశలను దృష్టిలో ఉంచుకుని అభ్యర్థులను సన్నద్ధం చేస్తున్నామన్నారు. గత ప్రశ్నపత్రాల సాధన, మాక్ టెస్టులు, సమయపాలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.ఉద్యోగ సాధనకు అడ్డంకిగా మారే అనవసర విషయాలకు దూరంగా ఉండాలని, మొబైల్ ఫోన్, సోషల్ మీడియాను పరిమితంగా వినియోగించాలని చెప్పారు. శారీరక దృఢత్వానికి ప్రాధాన్యమిస్తూ ప్రతిరోజూ పరుగు, వ్యాయామం వంటి సాధన చేయాలని సూచించారు. 45 రోజుల శిక్షణను సద్వినియోగం చేసుకుని పట్టుదలతో ముందుకు సాగితే లక్ష్యాన్ని సాధించవచ్చని అభ్యర్థుల్లో ధైర్యం నింపారు.అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను కలెక్టర్, ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, డీటీసీ డీఎస్పీ నగేష్, ఎస్‌బీ సీఐ నాగరాజు, సీఐ కరుణాకర్, ఆర్ఐలు సంతోష్, హరిబాబు, ఎస్ఐలు, సిబ్బంది, శిక్షణ పొందుతున్న 350 మంది యువతీ యువకులు పాల్గొన్నారు.a

శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

వివిధ శాఖ అధికారులు సమన్వయంతో ఉత్సవాలను నిర్వహించాలి

ప్రతినిత్యం సంస్కృతికా. అన్నదాన కార్యక్రమాలు...



ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి

చారిత్రిక రుద్రేశ్వర స్వామి వేయి స్తంభాల దేవాలయము నందు శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవములు స్వస్తిశ్రీ చాంద్రమాన పరాభవ నామ సంవత్సరం అశ్వయుజశుద్ధ పాడ్యమి నుండి తేదీ 11 /10 /2026 నుండి 20 /10 /2026 మంగళవారం వరకు తెలంగాణ రాష్ట్రంలో కాకతీయ రాజధాని ఏకశిలా నగరముగా చరిత్ర ప్రసిద్ధిగాంచిన వరంగల్ మహానగరంలో వేయి స్తంభముల దేవాలయము నందు వ్యక్తమైన దర్శింప వచ్చిన రుద్రేశ్వర స్వామి భక్తుల పాలిట కోరిన కోర్కెలకు కొంగు బంగారం అగుచు పరమ పావనమైన పుణ్యక్షేత్రముగా వారసత్వ సంపదగా విరాజిల్లుతున్న వేయి స్తంభముల దేవాలయంలో గత 50 సంవత్సరములుగా దేవి శరన్నవరాత్రి ఉత్సవములు మహా వైభవముగా నిర్వర్తించడానికి రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధికి ఇట్టి నవరాత్రి మహోత్సవములు శత చండీ యాగములు ,మహా రుద్ర యాగములు ,లక్ష్మీ దుర్గ గణేష్ సరస్వతి దశమహావిద్య మహాయాగము సుదర్శన యాగము విశ్వశాంతి లోక కళ్యాణార్థం విశేషంగా నిర్వహించడానికి ప్రతినిత్యం సాంస్కృతిక కార్యక్రమాలు నిత్యం అన్నదాన ప్రసాద వితరణలు విద్యుత్ అలంకరణ మహా చండీ హోమములు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆలయ కార్యనిర్వహణాధికారి డి.అనిల్ కుమార్ ఉత్సవ సమితి అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ రావు, ఉపాధ్యక్షులు పల్లం రమేష్ ముఖ్య సలహాదారు కోన శ్రీకర్ తవిటి రెడ్డి రవీందర్ రెడ్డి, మీూా రాజేందర్ రెడ్డి తో సమీక్ష నిర్వర్తించి బ్రోచర్ని కరపత్రాలు ఆవిష్కరించారు . ఈ సందర్భంగా రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ 50 మందితో ఉత్సవ సమితి ఏర్పాటు చేశామని పోలీసు యంత్రాంగం రెవెన్యూ మునిసిపల్ శాఖ దేవదాయ శాఖ తదితరులతో సమన్వయం చేసుకొని ఉత్సవాలు ఘనంగా నిర్వర్తించాలని విద్యుత్ అలంకరణ ఈ సంవత్సరం మూడు లక్షల రూపాయలతో నగరపాలక సంస్థను ఆదేశిస్తూ ఏర్పాటు చేయడం జరిగిందని నిత్యాన్నదానం ప్రతిరోజు జరుగుతుందని నిత్యం హోమాధి కార్యక్రమాలు నిర్వర్తించడం జరుగుతుందని భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని దేవాలయం ప్రాంగణంలో ముందు భాగంలో బతుకమ్మకు ఈనెల 10వ తేదీ న ప్రారంభమయ్యే బతుకమ్మ పండుగకు లక్షలాదిగా తరలివచ్చే మహిళల కొరకు మంచినీరు సౌకర్యం టాయిలెట్స్ ఏర్పాటు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ మాట్లాడుతూ ఈ సంవత్సరము ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రత్యేక చొరవచూపి రాష్ట్ర ప్రభుత్వం పక్షాన మరియు తన సొంత ఖర్చులతో దేవీ నవరాత్రి ఉత్సవములు నిర్వహిస్తున్నారని అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన నిత్యం వేద పారాయణములు అన్నదాన వితరణ సాంస్కృతిక కార్యక్రమాలు అన్నిటికీ కూడా రాజేందర్ రెడ్డి బాధ్యత తీసుకొని వ్యవహరిస్తున్నారని ఉపేంద్ర శర్మ పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది మధుకర్ , రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.ఎంగిలిపూల బతుకమ్మ 10/10/2026 రోజు జరుపుకోవాలని,18/10/2026 రోజున సద్దుల బతుకమ్మ జరుపుకోవాలని వారు సూచించారు.

ప్రభుత్వ పాఠశాలలో అల్పాహార కార్యక్రమం ప్రారంభం

విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభ్యాసానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



ప్రజా వాయిస్ హన్మకొండ /హాసన్ పర్తి

హనుమకొండ జిల్లా హసన్పర్తి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉదయం పౌష్టికాహారం అందించే అల్పాహార కార్యక్రమాన్ని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హన్మకొండ జిల్లా కలెక్టర్ చహత్ బాజ్‌పాయ్ తో కలిసి ఎమ్మెల్యే కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు స్వయంగా అల్పాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ... విద్యార్థులు ఉదయం పూట పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండటంతో పాటు పాఠశాలలో చదువుపై మరింత ఏకాగ్రత సాధించగలుగుతారని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభ్యాసం, భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతోందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు పాఠశాలలోనే ఉదయం పూట నాణ్యమైన అల్పాహారం అందించడం ద్వారా తల్లిదండ్రులపై భారం తగ్గుతుందని, విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. హసన్పర్తి ప్రభుత్వ పాఠశాలను మోడల్ స్కూల్ గా తీర్చిదిద్దడానికి సుమారు 6కోట్లకు పైగా నిధులతో ప్రణాళిక రూపొందిస్తున్నామని అన్నారు.హరేకృష్ణ మూవ్ మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో అల్పాహారం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో 66వ డివిజన్ అధ్యక్షులు గోర్రె కిరణ్,మాజీ డివిజన్ అధ్యక్షులు కనుపర్తి కిరణ్,మండల అధ్యక్షులు అశోక్,మాజీ మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి,2వ డివిజన్ అధ్యక్షులు పుట్టతిరుపతి,ఆత్మకూరు మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతి,కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,తదితరులుపాల్గొన్నారు.

రాహుల్ గాంధీ అరెస్టుపై కాంగ్రెస్ శ్రేణుల ఆగ్రహం

సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను అరెస్ట్ చేయాలి

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం

రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటాన్ని అనచి వేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి

కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ ని అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ హనుమకొండలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనుగాల వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో హనుమకొండ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి కేంద్ర ప్రభుత్వ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే, కేఆర్ నాగరాజు పాల్గొని కాంగ్రెస్ శ్రేణులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటాన్ని అణిచివేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ప్రజల ఓటు హక్కు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడం కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ వైఖరికి నిదర్శనమన్నారు. ఓట్ల అక్రమాలు, ఓటు చోరీకి సంబంధించిన ఆరోపణలపై ప్రశ్నలు లేవనెత్తుతున్న రాహుల్ గాంధీ పై చర్యలు తీసుకోవడం కాకుండా, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల సంఘంపై ఉందని అన్నారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, ఆయనను పదవి నుంచి తొలగించడంతో పాటు అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ పోరాటానికి దేశవ్యాప్తంగా ప్రజల మద్దతు ఉందని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఐక్యంగా ఉద్యమిస్తాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల గొంతును అణిచివేయాలని చూస్తే కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా ప్రజల తరఫున పోరాడుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్,జిల్లా,నియోజకవర్గ ముఖ్య నాయకులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, డీసీసీ, బ్లాక్, మండల, డివిజన్ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత...

- అక్రమంగా తరలిస్తే సహించేది లేదు

- చిట్టాపూర్ లో 154 సంచులు

ప్రజా వాయిస్ /దుబ్బాక.:

రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు సన్న బియ్యం అందిస్తున్న విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందే, కానీ కొంతమంది దళారులు వాటిని అదును చేసుకుని వ్యాపారం కొనసాగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డు లబ్ధిదారులకు ఒకేసారి మూడు నెలల సన్న బియ్యం అందించడంతో, ఇది అదనగా భావించి అక్రమ దారిలో డబ్బు సంపాదించాలని కొంతమంది దళారులు ఇంటింటికి తిరుగుతూ రేషన్ బియ్యం కొనుగోలు చేస్తూ ఎక్కువ రేటుకు రైసు మిల్లర్లకు అందించడం జరుగుతుంది. అందులో భాగంగా బుధవారం దుబ్బాకలో ఒక ఆటోలో ప్రభుత్వం అందించిన రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా దుబ్బాక మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆకుల భరత్ పట్టుకొని రెవెన్యూ అధికారులకు అప్పజేయడం జరిగిందని అన్నారు.

చిట్టాపూర్ లో...

భూంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చిట్టాపూర్



గ్రామ శివారులో రాత్రి సమయంలో వెహికిల్ చెకింగ్ నిర్వహిస్తుండగా నూనె శేఖర్ (బుడగ జంగం) ఆకునూరు గ్రామం చేర్యాల మండలం అనే వ్యక్తి అక్రమంగా 154 బ్యాగుల రేషన్ సన్న బియ్యం సాధిక్ అనే వ్యక్తికి అమ్మివేసి డీసీఎం వాహనంలో తరలిస్తుండగా భూంపల్లి పోలీస్ వారు చిట్టాపూర్ గ్రామ శివారులో వెహికల్ చెకింగ్ చేస్తుండగా పట్టుకొని డీసీఎం వాహనాన్ని 71 క్వింటల్లా రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు.

భూ రీ-సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్

- అత్వెల్లి, ఏక్ మామిడిలో క్షేత్రస్థాయి పర్యటన

- నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశం

ప్రజావాయిస్/వికారాబాద్ బ్యూరో:



వికారాబాద్ జిల్లాలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.వికారాబాద్ మండల పరిధిలోని అత్వెల్లి గ్రామం, నవాబ్ పేట్ మండల పరిధిలోని ఏక్ మామిడి గ్రామాలకు సంబంధించిన సర్వే నంబర్లు 131, 470లలో జరుగుతున్న రీ-సర్వే పనుల పురోగతిని సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ ఫీల్డ్ విజిట్ చేసి పరిశీలించారు.ఈ సందర్భంగా రీ-సర్వేలో భాగంగా భూముల కొలతలు, హద్దుల నిర్ధారణ, రికార్డుల పరిశీలన, భూ వివరాల నమోదు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.భూ రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా, నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. రైతులు, భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అర్హులైన భూ యజమానుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి రికార్డుల్లో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఏడీ సర్వే మధుసూదన్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, సర్వేయర్ ఆనంద్, రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.



దుర్గానగర్ సమస్యలపై ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆరా

మోరి,నాలా,డ్రైనేజీ,రోడ్ల సమస్యలపై అధికారులతో క్షేత్రస్థాయి పరిశీలన

ప్రజా వాయిస్// రాజేంద్రనగర్:

మురుగు కాలువలు,నాలా సమస్యలతో ఇబ్బందులు పడుతున్న దుర్గానగర్ కాలనీ సమస్యలపై ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ దృష్టి సారించారు. అధికారులతో కలిసి కాలనీలో పర్యటించిన ఆయన,స్థానికుల వద్దకు వెళ్లి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు.మోరి, నాలా,అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా,సంబంధిత అధికారులతో అక్కడికక్కడే చర్చించారు.సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు, మోరి -- నాలా సమస్య పరిష్కారంతో పాటు సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ప్రకాష్ గౌడ్ తెలిపారు.ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని,అధికారులతో సమన్వయం చేసి పరిష్కారానికి అడుగులు వేయడమే పర్యటన ఉద్దేశమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.మున్సిపల్,జలమండలి,పార్టీ నేతలు తదితరులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.



పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం..

దుర్గం చెరువులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజావాయిస్/మోమిన్ పేట్:

మోమిన్ పేట్ మండల పరిధిలోని దుర్గం చెరువు గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గౌరవ తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశంతో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల్లో భాగంగా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మోమిన్ పేట్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎల్. కృష్ణ, గ్రామ సర్పంచ్ లావణ్య, ఉపసర్పంచ్ సరి అభి,వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి లక్ష్మి, వీఆర్వో మాణిక్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ బంటు, పీఎస్ఎన్‌సీ డైరెక్టర్ సత్యనారాయణ, పల్లె నరసింహులు, ఎం. రమేష్ తదితరులు పాల్గొన్నారు.అలాగే గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



విలోచవరం ఆలయాల అభివృద్ధి కమిటీ ఏకగ్రీవం

చైర్మన్‌గా కావేటి రవికుమార్.. వైస్ చైర్మన్‌గా జునగిరి సుమన్

ప్రజా వాయిస్ మంథని

మండలం విలోచవరం గ్రామంలోని పురాతన ఆలయాల అభివృద్ధికి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలోని శ్రీ పర్వతాల మల్లికార్జున స్వామి ఆలయం, రామాలయం, సాయిబాబా ఆలయాల అభివృద్ధి లక్ష్యంగా దేవాలయ ఆవరణలో గ్రామ పెద్దలు, రైతులు, భక్తుల సమక్షంలో కమిటీ ఎన్నిక నిర్వహించారు. చైర్మన్‌గా కావేటి రవికుమార్, వైస్ చైర్మన్‌గా జునగిరి సుమన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా బీముని రాజమల్లు గౌడ్, పుట్ట సంతోష్, బోగిరి కార్తీక్, కొరవేణి మధుకర్, ఎరుకల సుధాకర్, కొండ దేవేందర్, తోటపెల్లి ప్రశాంత్, గుర్రాల సంతోష్, కౌటం రాజేష్‌లను ఎన్నుకున్నారు. ఆలయాల అభివృద్ధితో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఆలయాల ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని మరింత పెంపొందించేలా నూతన కమిటీ పనిచేయాలని గ్రామ పెద్దలు ఆకాంక్షించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీ సభ్యులను పలువురు అభినందించారు.

జూలూరుపాడు లో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

ఏఐవైఎఫ్ డిమాండ్

వైద్య సేవలు సకాలంలో అందక మరణిస్తున్న రోగులు

పట్టించుకోని పాలకులు, అధికారులు

ఏవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు, కార్యదర్శి ఎస్కె చాంద్ పాషా

జూలూరుపాడు, ప్రజా వాయిస్ :



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ కేంద్రాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు ఎస్కె చాంద్ పాషా డిమాండ్ చేశారు. మండల వ్యాప్తంగా కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులు సుమారు 50 మందికి పైగా ఉన్నారని, వారికి తక్షణ వైద్య సేవలు అందక నాన ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రులలో వైద్యం చేయించుకునే స్తోమత లేక మృత్యువు ఓడికి చేరుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నానా శ్రమ కోర్చి జిల్లా కేంద్రాలైన కొత్తగూడెం లేదా ఖమ్మం ఆసుపత్రులను ఆశ్రయించితే బెడ్లు ఖాళీగా లేవని రోగులను వెనక్కి తిప్పి పంపుతున్న దౌర్భాగ్యస్థితి నెలకొందని అన్నారు. మండలంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు సరైన సమయంలో డయాలసిస్ అందక గత 3 సంవత్సరాలలో పదుల సంఖ్యలో రూగులు చనిపోయారని గుర్తు చేశారు. కావున పాలకులు, అధికారులు తక్షణమే స్పందించి ఏజెన్సీ మండలమైన జూలూరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని చాంద్ పాషా డిమాండ్ చేశారు.



బాహ్య మూల్యాంకన కేంద్రాన్ని సందర్శించిన డీఈఓ

- మూల్యాంకన ప్రక్రియ పరిశీలన..

- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచన

ప్రజా వాయిస్ సుల్తానాబాద్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న 9వ తరగతి సమ్మేటివ్-1 బాహ్య మూల్యాంకన కేంద్రాన్ని జిల్లా విద్యాధికారి ఏ. శారద సందర్శించారు. ఈ సందర్భంగా మూల్యాంకన ప్రక్రియను పరిశీలించి, మూల్యాంకనకులకు పలు సూచనలు చేశారు. అనంతరం పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు కొనసాగుతున్న సమ్మేటివ్ పరీక్షలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన మధ్యాహ్న భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. బాహ్య మూల్యాంకన కేంద్రంలో ప్రతిరోజూ 322 పరీక్ష పత్రాలను మూల్యాంకనం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పరీక్షల కమిషనర్ వి. హనుమంతు, మండల విద్యాధికారి ఆరేపల్లి రాజయ్య, క్యాంప్ ఆఫీసర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. శ్రీనివాస్‌రెడ్డి, కే. లింగయ్య, తొమ్మిది మంది మూల్యాంకనకులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కార్యకర్తను పరామర్శించిన నీలం మధు

యాభై వేల రూపాయలు ఆర్థిక సహాయం

పటాన్ చెరువు ప్రజా వాయిస్

రోడ్డు ప్రమాదంలో గాయపడి సనత్ నగర్ ఈఎస్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బొల్లారం డివిజన్ కు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తను నీలం మధు ముదిరాజ్ మంగళవారం పరామర్శించారు.ఆయనకు సంబంధించిన ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకుని అత్యుత్తమ చికిత్స అందించాలని వైద్యులకు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా తక్షణ సహాయం కింద యాభై వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. బాధితుడి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పి అండగా ఉంటానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు..

సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు

- డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ షాపింగ్, డిజిటల్ అరెస్ట్, పెట్టుబడి మోసాలపై అవగాహన తప్పనిసరి...

- యం.ఎన్.ఆర్. యూనివర్సిటీ విద్యార్థులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

ప్రజా వాయిస్ సంగారెడ్డి :





అక్టోబర్ నెల మొదటి బుధవారం సైబర్ జాగృకత దివస్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ షాపింగ్, డిజిటల్ అరెస్ట్, పెట్టుబడి మోసాలపై యం.ఎన్.ఆర్. యూనివర్సిటీ--సంగారెడ్డి విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సైబర్ నేరాలను అరికట్టేందుకు తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సి.వి. ఆనంద్, ఐపీఎస్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (TGCSB) డైరెక్టర్ శిఖా గోయల్, ఐపీఎస్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సైబర్ జాగృకత దివస్ కార్యక్రమం ద్వారా సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఆన్‌లైన్ మోసాలకు ఎవరూ అతీతులు కారని, ప్రజల అవసరాలు, అత్యాశ, భయాన్ని ఆసరాగా చేసుకొని సైబర్ నేరగాళ్లు వివిధ రకాల మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ షాపింగ్, డిజిటల్ అరెస్ట్, పెట్టుబడి మోసాలు, పార్ట్‌టైమ్ జాబ్ మోసాలు, లోన్ యాప్ మోసాలు, ఇంపర్సనేషన్ మోసాలు తదితర సైబర్ నేరాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

డిజిటల్ చెల్లింపుల్లో జాగ్రత్త:

తెలియని వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని, OTP, PIN, CVV, పాస్‌వర్డ్‌లు, UPI PIN వంటి రహస్య సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని ఎస్పీ సూచించారు. బ్యాంకు అధికారులు, పోలీసుల పేరుతో ఫోన్ చేసే వ్యక్తులను నమ్మి వ్యక్తిగత లేదా బ్యాంకింగ్ వివరాలను వెల్లడించవద్దని తెలిపారు. డిజిటల్ చెల్లింపులు చేసే సమయంలో నగదు సరైన వ్యక్తి లేదా ఖాతాకే వెళ్తుందో నిర్ధారించుకున్న తర్వాతే చెల్లింపు చేయాలని సూచించారు.ఆన్‌లైన్ షాపింగ్‌లో అప్రమత్తత: ఆన్‌లైన్‌లో భారీ డిస్కౌంట్లు, ఆకర్షణీయమైన ఆఫర్ల పేరుతో నకిలీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా ఖాతాల ద్వారా మోసాలకు పాల్పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. గుర్తుతెలియని వెబ్‌సైట్లు లేదా వ్యక్తులకు ముందస్తుగా నగదు చెల్లించకుండా, విశ్వసనీయమైన ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లను మాత్రమే ఉపయోగించాలని తెలిపారు.

పెట్టుబడి మోసాలపై అప్రమత్తంగా ఉండాలి:

తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని చెప్పే ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్, ట్రేడింగ్, క్రిప్టో కరెన్సీ, షేర్ మార్కెట్ పేరుతో వచ్చే అనుమానాస్పద ఆఫర్లను నమ్మవద్దని సూచించారు. తొందరపెట్టి డబ్బులు పెట్టుబడి పెట్టించే వ్యక్తులు లేదా సంస్థల వివరాలను పూర్తిగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని తెలిపారు.

డిజిటల్ అరెస్ట్ మోసాలపై జాగ్రత్త:

పోలీసులు, సీబీఐ, కస్టమ్స్, ఇతర ప్రభుత్వ అధికారుల పేరుతో ఫోన్ చేసి కేసులు, అరెస్టు లేదా చట్టపరమైన చర్యల పేరుతో భయపెట్టి డబ్బులు డిమాండ్ చేస్తే నమ్మవద్దని ఎస్పీ సూచించారు. ప్రభుత్వ సంస్థలు ఫోన్ లేదా వీడియో కాల్ ద్వారా విచారణ పేరుతో డబ్బులు డిమాండ్ చేయవని తెలిపారు.సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండటంతో పాటు, కుటుంబ సభ్యులు, విద్యార్థులు, స్నేహితులకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని, అలాగే www.cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఉంటుందని తెలిపారు.PAUSE • THINK • VERIFY సైబర్ నేర రహిత తెలంగాణ వైపు అడుగులు. ఈ అవగాహన కార్యక్రమంలో సైబర్ సెల్ డిఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, కృష్ణ చలం - వైస్ ఛాన్సలర్, ఎం.ఎన్.ఆర్. యూనివర్సిటీ, రాజేశ్వరన్ - రిజిస్ట్రార్, ఎం.ఎన్.ఆర్. యూనివర్సిటీ, గిరి ప్రసాద్ - డివ్యూటీ డైరెక్టర్, ఎన్.ఆర్. క్యాంపస్ తదితరులు ఉన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడితే కఠిన చర్యలు

- అర్హతలు, నిబంధనలు పాటించే స్కానింగ్ కేంద్రాలకే రిజిస్ట్రేషన్, రెన్యువల్

- స్కానింగ్ కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి

- అడిషనల్ కలెక్టర్ పాండు

ప్రజా వాయిస్ సంగారెడ్డి :

గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలను నిషేధించే పీసీపీఎన్డీటీ (ప్రజూచీణు) చట్టాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని అడిషనల్ కలెక్టర్ పాండు అధికారులను ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడే స్కానింగ్ కేంద్రాలపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.బుధవారం అడిషనల్ కలెక్టర్ ఛాంబర్‌లో గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టంపై జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్, రికార్డుల నిర్వహణ, చట్టం అమలు, ప్రజల్లో అవగాహన కల్పించే అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ పాండు మాట్లాడుతూ, జిల్లాలో స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్ సమయంలో అన్ని నిబంధనలు, నిర్దేశిత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హతలు, అవసరమైన అనుమతులు కలిగి, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించబడుతున్న స్కానింగ్ కేంద్రాలకు మాత్రమే రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయాలని అధికారులను ఆదేశించారు.ఏ స్కానింగ్ కేంద్రంలోనైనా గర్భిణీ స్త్రీలకు నిర్వహించే స్కానింగ్ ద్వారా పుట్టబోయే శిశువు ఆడా, మగా అనే లింగ నిర్ధారణ చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడినట్లు గుర్తిస్తే పీసీపీఎన్డీటీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే స్కానింగ్ కేంద్రాల అనుమతులను రద్దు చేయడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో సీజ్ చేసే చర్యలు కూడా చేపట్టాలని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాల్లో స్కానింగ్‌కు సంబంధించిన రికార్డులు, రిపోర్టులు, రిజిస్టర్లు తదితరాలను నిబంధనల ప్రకారం సక్రమంగా నమోదు చేస్తున్నారా లేదా అనే విషయాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రికార్డుల నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలను ప్రోత్సహించే వారితో పాటు, వాటికి సహకరించే వారు కూడా చట్ట ప్రకారం శిక్షార్హులేనని ఆయన తెలిపారు. పీసీపీఎన్డీటీ చట్టంలోని నిబంధనలు, లింగ నిర్ధారణ పరీక్షల వల్ల కలిగే అనర్థాలు, భ్రూణ హత్యల నివారణపై జిల్లావ్యాప్తంగా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు, సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యపరచాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా గర్భిణీలు, వారి కుటుంబ సభ్యులు, వైద్య సిబ్బంది, స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులకు చట్టంలోని



నిబంధనలపై అవగాహన కల్పించాలన్నారు.లింగ నిర్ధారణ పరీక్షల నివారణ, పీసీపీఎన్డీటీ చట్టం సమర్థవంతమైన అమలుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని అడిషనల్ కలెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు పలు సూచనలు చేసారు.ఈ సమావేశంలో డీఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ లలితాదేవి, డీసీహెచ్ఎస్ శ్రీధర్ కుమార్ , జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సభ్యులు డా. లక్ష్మి శైలజ, డా. శశికల, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అడ్వకేట్ శైలజ ,డా. రాజు గౌడ్,సంబంధిత వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో బాణం గుర్తును గెలిపించండి

- అక్టోబర్ 9న ఆర్టీసీ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలు

- ఉద్యోగ భద్రత, కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం

- ప్రజ్ఞాపూర్ డిపోలో డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లతో ప్రచారం

- సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :

ఆర్టీసీ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్--సీఐటీయూ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ కూటమిగా కలిసి పోటీ చేస్తున్నందున సంగారెడ్డి రీజియన్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ డిపో కార్మికులు బాణం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రజ్ఞాపూర్ డిపోలో డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లను కలిసి కూటమి తరఫున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సందబోయిన ఎల్లయ్య మాట్లాడుతూ.. ఆర్టీసీ వర్కర్స్ యూనియన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్-సీఐటీయూ కలిసి తెలంగాణ ఆర్టీసీ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో ఉమ్మడిగా పోటీ చేస్తున్నాయని తెలిపారు. గత పదేళ్లుగా ఆర్టీసీ కార్మికులు నిర్వహించిన సమ్మెలు, పోరాటాలకు సీఐటీయూ అండగా నిలిచిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు ఆర్టీసీ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు సంస్థకు రావాల్సిన నిధులు ఇవ్వకపోవడం, పీఆర్సీ, డీఏ అమలు చేయకపోవడం, పని భారం పెంచడం వంటి సమస్యలతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ఆర్టీసీ సమస్యల పరిష్కారం కోసం గతంలో 56 రోజుల పాటు కార్మికులు సమ్మె చేపట్టారని, ఆ సమయంలో 30 మందికి పైగా కార్మికులు మృతి చెందినట్లు ఆయన తెలిపారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా కార్మికులు ఐక్యంగా నిలబడి తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు కొనసాగించారని అన్నారు. ఎన్నికల సమయంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రభుత్వంతో కార్మికుల సమస్యలపై చర్చలు జరిపి పరిష్కారాలు



సాధించేందుకు బలమైన కార్మిక నాయకత్వం అవసరమని సందబోయిన ఎల్లయ్య అన్నారు. ఉద్యోగ భద్రతను కాపాడుకోవడంతో పాటు పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం కార్మికులు ఐక్యంగా నిలవాలని కోరారు. అక్టోబర్ 9న జరిగే గుర్తింపు ఎన్నికల్లో సంగారెడ్డి రీజియన్ పరిధిలో బాణం గుర్తుకు ఓటు వేసి కూటమిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ నిరంతరం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ నాయకులు, ప్రజ్ఞాపూర్ డిపో అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, కార్యదర్శి జక్కుల నర్సింలు, కోశాధికారి జయేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజులను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చి, బీసీ–ఏ ప్రయోజనాలను అమలు చేయాలి

మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, వారి ఉపాధి-సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి

ముదిరాజులకు జనాభాకు అనుగుణంగా రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి

అధికార పార్టీతో పాటు అన్ని ప్రతిపక్ష రాజకీయ పార్టీలు ముదిరాజులకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అవకాశాలు, నామినేటెడ్ పదవులు సహా సముచిత రాజకీయ అవకాశాలు కల్పించాలి

ప్రభుత్వంలో ముదిరాజులకు మంత్రి పదవులు సహా కీలక బాధ్యతల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు

ముదిరాజుల సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి

జిన్నారం ప్రజావాయిస్

ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏ కేటగిరీలోకి చేర్చాలని డిమాండ్ చేస్తూ పటాన్‌చెరు నియోజకవర్గంలోని జిన్నారం మండల ముదిరాజులు కదం తొక్కారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముదిరాజ్ సంఘాల నాయకులు, ప్రతినిధులు భారీగా తరలివచ్చి జిన్నారంలో ర్యాలీ





నిర్వహించారు.

హక్కుల సాధన కోసం భారీ ధర్నా

జిన్నారం మండలంలోని అన్ని గ్రామాల ముదిరాజ్ సంఘాల నాయకులు, సభ్యులు ఒకచోట చేరి బీసీ-ఏ డిమాండ్‌పై నినదించారు. భారీ ర్యాలీగా జిన్నారం తహసీల్దార్ కార్యాలయం వరకు చేరుకుని తమ నిరసనను వ్యక్తం చేశారు. ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి చేర్చి తగిన న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అధికారులకు వినతిపత్రం:

ర్యాలీ అనంతరం ముదిరాజ్ నాయకులు జిన్నారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ముదిరాజుల ప్రధాన డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లాలని కోరారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం:

ముదిరాజ్ నాయకులు సమర్పించిన వినతిపత్రంపై ఆర్ఐ శ్రీనివాస్ స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ముదిరాజుల డిమాండ్‌పై సంబంధిత అధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు.

నాయకుల హాజరు:

ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ-ఏ జేఏసీ రాష్ట్ర చైర్మన్ గుండ్లపల్లి శ్రీనివాస్,రాష్ట్ర అడ్వైజర్ రవి, ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుంకరబోయిన మహేష్, మండల్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నారబోయిన శ్రీనివాస్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు గంగు రమేష్, బాలు గారి నర్సింలు, ముదిరాజ్ సంక్షేమ సమితి ప్రధాన కార్యదర్శి. కౌన్సిలర్ పోతారం సత్తయ్య,జలగరి మల్లేష్, ఎం పెంటేష్,బి శ్రీనివాస్,అలాగే ముదిరాజ్ నాయకులు అమ్ములూర్ నర్సింగ్ రావు,పంతులు సత్యనారాయణ, మల్లేష్,వీర్నాల సత్యనారాయణ, మాణిక్ రావు, దువ్వగుంట మల్లేష్,పుట్టి భాస్కర్,ఎన్ సత్యనారాయణ,వెంకటేష్ బాల్‌రాజ్, అంతయ్య, పట్నం శ్రీనివాస్, పూజారి రాజు, భూసిగారి కృష్ణ, గణేష్, రతన్, నారాయణ, పెంటయ్య, బిక్షపతి,రమేష్, వీరరెడ్డిపల్లి అశోక్, కనుకుంట వెంకటేష్,వీరన్నగూడెం వీరేష్,తో పాటు వివిధ గ్రామాల ముదిరాజ్ సంఘాల అధ్యక్షులు, కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ముదిరాజుల డిమాండ్‌ను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు.

కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

ఎస్ఎఫ్ఐ షాద్ నగర్ డివిజన్ కార్యదర్శి శ్రీకాంత్ డిమాండ్

ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలి

(ప్రజా వాయిస్ షాద్‌నగర్)

ఓటర్ల జాబితా సవరణ పేరుతో పారదర్శకత లేకుండా చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో షాద్‌నగర్ ప్రధాన చౌరస్తాలో భారీ ధర్నా నిర్వహించారు ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి శ్రీకాంత్ నాయకత్వంలో విద్యార్థులు నాయకులు పెద్ద ఎత్తున చౌరస్తాకు చేరుకుని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్క ఓటు హక్కు అత్యంత విలువైనదని ఒక్క ఓటు కూడా దేశ భవిష్యత్తును మార్చగలదని పేర్కొన్నారు మేము నేటి విద్యార్థులం రేపటి ఓటర్లం ఓటు మా హక్కు ప్రజాస్వామ్యం మా బాధ్యత అని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో అర్హులైన పౌరుల పేర్లను పొరపాటున లేదా ఉద్దేశపూర్వకంగా తొలగించడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు 2002 నుండి అన్ని ఆధారాలు ఉన్నప్పటికీ ప్రస్తుత ఓటర్ల జాబితాలో పేర్లు ఎందుకు కనిపించడం లేదని అధికారులను ప్రభుత్వాన్ని నేరుగా ప్రశ్నించారు కేంద్ర ఎన్నికల కమిషనర్ ఎంపిక విధానంపై ఇటీవల తెచ్చిన నూతన చట్టాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది గతంలో ఉన్న సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం ప్రధానమంత్రి లోక్‌సభ ప్రతిపక్ష నేత మరియు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని కమిటీ ద్వారానే ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎంపిక పారదర్శకంగా జరగాలని శ్రీకాంత్ పేర్కొన్నారు.ఈ ధర్నా కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షులు ఆదిల్, రామ్‌చరణ్, తరుణ్, బబ్లు, రవీంద్ర, వంశీ, ధను, భాను, విష్ణు, భరత్, జగదీష్, సాయికిరణ్, అభిలాష్ తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.



జనగామ పట్టణం 3 వ వార్డులో డ్రైనేజీ రోడ్లు లేక ప్రజల అవస్థలు...

మున్సిపల్ ఏఈ సత్య మూర్తికి పరిస్థితులను వివరిస్తున్న కౌన్సిలర్ బూడిద జ్యోతి గోపి...

ప్రజా వాయిస్/జనగామ జిల్లా

జనగామ పట్టణంలోని మూడవ వార్డు పట్టణానికి పూర్తిగా దిగువ ప్రాంతంలో ఉండి పట్టణంలోని ఎగువ ప్రాంతాల నుంచి డ్రైనేజీ మురుగునీరు రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అలాగే ఈ వార్డులో నూతనంగా కొత్త కాలనీలు ఏర్పాటు అవుతున్నాయని అలాగే కొత్తగా విస్తరిస్తున్న ప్రాంతం కావడం వల్ల మున్సిపాలిటీకి పెద్ద మొత్తంలో ఆదాయం ఆస్తి పన్నులు ఇంటి నిర్మాణ అనుమతులు వ్యాపార సముదాయాల ద్వారా వస్తుంది.ఇక్కడ మెరుగైన డ్రైనేజీ రోడ్లు లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఈసమస్యలు పరిష్కారం చేపట్టాలని దీని కోసం నిధులు కేటాయించాలని మున్సిపల్ చైర్ పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకుపోవడం జరిగింది.వెంటనే



వారు స్పందించి వార్డులో క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యల్ని పరిశీలించి తగు ప్రతిపాదనలు తయారు చేయాలని మున్సిపల్ ఏఈ సత్యమూర్తికి ఆదేశాలు జారీ చేశారు. దీన్ని పురస్కరించుకొని గురువారం మూడవ వార్డులో కౌన్సిలర్ బూడిద జ్యోతి ఆధ్వర్యంలో బాలాజీ నగర్ జ్యోతి నగర్ ఎల్లమ్మ గుడి ఏరియా రాజమౌళి హాస్పిటల్ వెనుక వైపు జిఎంఆర్ కాలనీ సెంట్ మేరీ స్కూల్, శ్యాన్ మెరియా మాగోల్డెన్ కాలనీ ఏకశిలా కాలనీ తదితర ప్రాంతాలను క్షేత్రస్థాయి పరిశీలన చేశారు.ఈ సందర్భంగా గుర్తించిన డ్రైనేజీ సిసి రోడ్ల ప్రతిపాదనలు తయారుచేసి మున్సిపల్ చైర్మన్ కమిషనర్ చైర్మన్ కౌన్సిల్ దృష్టికి తీసుకుపోతామని వారు తెలిపారు.ఈకార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి కాలనీవాసులు బైరగోని శ్రీనివాస్ ఎండి నజీమా గుండు శశిరేఖ శ్రీధర్ బింగి భాగ్య రాజు మున్సిపల్ సూపర్వైజర్లు శ్రీనివాస్ భరత్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి దీపా కాసరగడ్డ

సమాజంలో వివిధ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ సదస్సులు ఉపయోగపడతాయి

సైబర్ నెలలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రాజీవ్ మార్గమే రాజమార్గం న్యాయస్థానంలో ఉన్న కేసులను ఇరువు వర్గాల వారు పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవాలి

శ్రీరంగాపురం అక్టోబర్ 7 ప్రజా వాయిస్

ప్రజలందరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ దీపా కాసరగడ్డ పిలుపునిచ్చారు.శ్రీరంగాపురం మండల కేంద్రంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దీపా కాసరగడ్డ మాట్లాడుతూ, సమాజంలో వివిధ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ సదస్సులు ఎంతగానో దోహదపడతాయన్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడిన ముఖ్యమైన అంశాలు:

-రాజీ మార్గమే రాజమార్గం:
న్యాయస్థానాల్లో ఉన్న కేసులను ఇరు వర్గాల వారు పరస్పర అంగీకారంతో, సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

-సైబర్ నేరాలపై అప్రమత్తత: ప్రస్తుత రోజుల్లో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ రహస్య సమాచారాన్ని ఎవరికీ చెప్పకూడదని కోరారు.

-ఉచిత విద్యా హక్కు: 6 నుండి 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఉచిత విద్యా హక్కు చట్టం ద్వారా నాణ్యమైన ఉచిత విద్యను అందించవచ్చని తెలిపారు.

-వయోవృద్ధుల సంరక్షణ చట్టం: వయోవృద్ధులైన



తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం ద్వారా వారి సమస్యల పరిష్కారానికి జిల్లా రెవిన్యూ అభివృద్ధి కార్యాలయం (RDO) లోని ప్రత్యేక ట్రిబ్యునల్స్ లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. లేదా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే వారి సమస్యల పరిష్కారానికి తగిన భరోసా కల్పిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కృష్ణయ్య, సర్పంచ్ మద్దిలేటి, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మహిపాల్‌రెడ్డిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు.. వెంటనే అరెస్ట్ చేయాలి

- ఎర్దనూర్ ఘటనపై ఎఫ్ ఐ ఆర్ నమోదు.. రిమాండ్ చేయాలని లంబాడా హక్కుల పోరాట సమితి డిమాండ్

ప్రజా వాయిస్,సంగారెడ్డి :

సంగారెడ్డి జిల్లా కంది మండలం ఎర్దనూర్ గ్రామ పరిధిలో సేవాలాల్ మహారాజ్ మాలధారణలో ఉన్న నేనావత్ గోపాల్‌పై జరిగిన ఘటనకు లంబాడ హక్కుల పోరాట సమితి నాయకులు నిరసన తెలిపారు సంబంధించి సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్‌లో మహిపాల్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు కావడాన్ని లంబాడా హక్కుల పోరాట సమితి స్వాగతించింది. బాధితులకు న్యాయం చేయాలంటూ ప్రజా, గిరిజన సంఘాలు చేపట్టిన నిరసనలు, దీక్షలు, నిరంతర ఒత్తిడి ఫలితంగానే కేసు నమోదైందని సంఘం నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా లంబాడా హక్కుల పోరాట సమితి సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ నాయక్, జిల్లా కార్యదర్శి మహేష్ రాథోడ్ మాట్లాడుతూ.. కేసులో నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎర్దనూర్ పరిధిలోని క్రషర్‌ను తొలగించాలని, గిరిజనుల భద్రతకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాతోల్ మజ్జి సర్పంచ్ శంకర్ నాయక్, బ్యాతోల్ మాజీ ఉపసర్పంచ్ ప్రకాష్ నాయక్, దీక్షా బాపులు, నాయక్'జగదీష్'శ్రీనివాస్'ప్రకాష్'భీమ్రావు'సేవాలాల్ మహారాజ్ పూజారిల్లు గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ స్పెషల్ నీడ్స్ ఎడ్యుకేటర్ల నియామకం

- ఈ నెల 10లోపు దరఖాస్తులు..

- నెలకు రూ.16,500 గౌరవ వేతనం

ప్రజా వాయిస్ పెద్దపల్లి



జిల్లాలోని పీఎం శ్రీ పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు విద్యాబోధన అందించేందుకు గెస్ట్ స్పెషల్ నీడ్స్ ఎడ్యుకేటర్లను తాత్కాలిక ప్రాతిపదికన నియమించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి జి. శారద తెలిపారు. ఐదు నెలల కాలానికి చేపట్టే ఈ నియామకాలకు అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని పీఎం శ్రీ రామగుండం, జడ్పీహెచ్ఎస్ కమాన్‌పూర్, అప్పన్నపేట, పోత్కపల్లి, ఏక్లాస్‌పూర్, టీజీడబ్ల్యూఆర్ఈఐఎస్ మేడారం, మల్లాపూర్, టీజీఎంఎస్ రామగుండం, జూలపల్లి, మల్యాల్ (శ్రీరాంపూర్), టీజీడబ్ల్యూఆర్ఈఐఎస్ మంథని పాఠశాలల్లో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 10లోపు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు/ప్రిన్సిపాళ్లకు దరఖాస్తుతోపాటు అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించాలని సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ.16,500 గౌరవ వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని డీఈఓ సూచించారు.



దేశవ్యాప్తంగా పెరిగిన నిత్యవసర సరుకుల ధరలను వెంటనే తగ్గించాలి

కరెంటు కోతలు నివారించాలి

ప్రజా వాయిస్,కొత్త గూడ

తెలంగాణ రైతాంగానికి 24 గంటల కరెంటు ఇస్తాను అన్న రాష్ట్ర ప్రభుత్వం హామీ విస్మరించిందని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. సిపిఐ(ఎంల్)మాస్ లైన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కొత్తగూడ ఎం ఆర్ ఓ కు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని ముఖ్యంగా రైతాంగానికి రుణమాఫీ పూర్తిగా అమలు కాలేదని కొత్త రుణాలు ఇవ్వటం లేదని ఆరోపించారు. రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర మరియు మద్దతు ధర ఇవ్వటం లేదని పత్తి కొనుగోళ్లకు సీసీఐని వెంటనే రంగంలోకి దించాలని ఆయన డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా పెరిగిన నిత్యవసర సరుకుల ధరలను వెంటనే తగ్గించాలని పేద సామాన్య మధ్యతరగతి ప్రజానీకానికి నేను భారంగా మారిన ధరలు వెంటనే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. అర్హులైన వారందరికీ ఆసరా పెన్షన్స్ వెంటనే ఇవ్వాలని మూడు సంవత్సరాల నుండి ఈ డిమాండ్ ను పరిష్కరించటం లేదని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విషయంపై స్పందించకపోతే మా ఈ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సిపిఐ (ఎంల్) మాస్ లైన్ డివిజన్ నాయకులు ఈక బిక్సశే అధ్యక్షత వహించగా మండల నాయకులు సిద్దబోయిన జీవన్,కుర్సం రంగయ్య, తోలేం నరసయ్య, చిత్తరి పాపయ్య, ఈరెల్లి కొమురన్న, కొనకటి కొమురన్న, వాసం పాపయ్య,నారాయణ రెడ్డిగట్టి సాంబయ్య,పి. ఒ.డబ్ల్యూ జిల్లా అధ్యక్షులు కల్తీ ఎర్రకృతదితరులు పాల్గొని ప్రసంగించారు. స్పందించిన ఎం ఆర్ ఒ ఉన్నత అధికారులకు తెలియజేస్తానని హామీ ఇచ్చారు.





జర్నలిస్టుల హక్కుల సాధనకై వినూత్న నిరసన గళం

జర్నలిస్టులకు ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో క్యాష్ లెస్ హెల్త్ కార్డులు తక్షణమే ఇవ్వాలి..

టియుడబ్ల్యూజే హెచ్- 143 జర్నలిస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో పోస్ట్ కార్డులతో నిరసన వ్యక్తం..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పోస్టు కార్డుల ద్వారా నిరసన తెలిపిన జర్నలిస్టులు..

ప్రజా వాయిస్ జహీరాబాద్:

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ లో జర్నలిస్టులు తమ హక్కుల సాధన కోసం వినూత్న రీతిలో నిరసన గళం వినిపించారు. ఐఖఔజీ-ఎ 143 రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతీ సాగర్ పిలుపు మేరకు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద పోస్టుకార్డు ఉద్యమాన్ని చేపట్టారు. నియోజకవర్గంలోని జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను పోస్టుకార్డులపై రాసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పోస్ట్ ద్వారా పంపించారు. అదేవిధంగా అక్రిడిటేషన్ కలిగిన ప్రతి జర్నలిస్టు కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో మెరుగైన వైద్యం అందించేందుకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, ప్రస్తుత జునూ స్థానంలో జుజీనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో జర్నలిస్టుల ఆరోగ్యం, ప్రాణాలకు ప్రభుత్వ భద్రత కల్పించాలని కోరారు.అనంతరం మహాత్మాగాంధీ విగ్రహం నుంచి జహీరాబాద్ హెడ్ పోస్ట్‌ఆఫీస్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించి పోస్టుకార్డులను పోస్ట్‌బాక్స్‌లో వేశారు. జర్నలిస్టుల న్యాయపరమైన సమస్యలు పరిష్కారం కై ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు..ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు..

స్కూల్ వాలంటీర్ జీతం కోసం ఆర్కే యువభారత్ ఫౌండేషన్ రూ.10 వేలు అందజేత..

ప్రజా వాయిస్ /అడ్డగూడూరు:

మండలంలోని జానకీపురం ప్రాథమిక పాఠశాలలో వాలంటీర్ జీతం కోసం ఆర్కే యువభారత్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ అధినేత కన్నెబోయిన రాము యాదవ్ రూ.10 వేలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలతకు బుధవారం స్థానికుల చేత అందజేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అడిగిన వెంటనే సాయం అందించిన రాము యాదవ్ కు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తన సంస్థ ద్వారా మరెన్నో అభివృద్ధి సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు.



భూక్య యాకూబ్ చిత్రపటానికి నివాళు లర్పించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి

ఎస్ ఆర్ ఆర్ అధినేత పరిపాటి శ్రీనివాస్ రెడ్డి

ప్రజా వాయిస్/రాయపర్తి

వరంగల్ జిల్లా రాయపర్తి మండలం వెంకటేశ్వరపల్లి గ్రామానికి చెందిన... బీఆర్ఎస్ పార్టీ నాయకులు భూక్య యకూబ్ ఇటీవల అనారోగ్యంతో బోడుప్పల్ లో మరణించగా, గురువారం వారి చిత్రపటానికి నివాళ్లు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించిన....రాష్ట్ర మాజీ మంత్రివర్యులు, పాలకుర్తి బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఎర్రబెల్లి దయాకర్ రావు .ఈ కార్యక్రమంలో వారితో పాటు బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి , పల్లా సుందర్ రాంరెడ్డి బబ్బురి శ్రీకాంత్ గౌడ్ , రాజేష్ నాయక్, సురేందర్ రాథోడ్, వంగళ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు...

అమీన్పూర్ ప్రభుత్వ విద్యారంగంలో సరికొత్త అధ్యాయం

రూ.74.50 కోట్లతో క్యూర్ అర్బన్ రీజియన్ పాఠశాలల నిర్మాణానికి శంకుస్థాపన

పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే లక్ష్యం

పటాన్చెరు ఎమ్మెల్యే జిఎంఆర్





పటాన్ చెరువు ప్రజా వాయిస్

పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఆధునిక వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా పటాన్చెరు నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.అమీన్పూర్ డివిజన్ పరిధిలోని గండిగూడెం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో రూ.20 కోట్ల అంచనా వ్యయంతో అదనపు తరగతి గదుల నిర్మాణం, సుల్తాన్‌పూర్‌లో ఒక ఎకరం 10 గుంటల విస్తీర్ణంలో రూ.49.50 కోట్ల అంచనా వ్యయంతో క్యూర్ అర్బన్ రీజియన్ పాఠశాలలనిర్మాణ పనులకు బుధవారం ఉదయం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. పటాన్చెరు నియోజకవర్గంలోని 9 డివిజన్ల పరిధిలో రూ.364 కోట్లతో క్యూర్ అర్బన్ రీజియన్ పాఠశాలలు, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇప్పటికే ప్రారంభమైన పనులను వేగవంతంగా పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు.కొత్తగా నిర్మించనున్న పాఠశాలల్లో విశాలమైన తరగతి గదులు, ఆధునిక మౌలిక వసతులు, అవసరమైన విద్యా సదుపాయాలతో పాటు నాణ్యమైన బోధన అందించేలా ఏర్పాట్లు చేయనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. తద్వారా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థల్లోనూ మెరుగైన విద్యా వాతావరణం ఏర్పడుతుందని అన్నారు.పటాన్చెరు నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసి, ప్రతి విద్యార్థికి సమానమైన విద్యా అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు.క్యూర్ అర్బన్ రీజియన్ పాఠశాలల నిర్మాణంతో పటాన్చెరు నియోజకవర్గంలోని ప్రభుత్వ విద్యా వ్యవస్థలో మౌలిక వసతుల పరంగా గణనీయమైన విస్తరణకు అవకాశం ఏర్పడనుంది. భవిష్యత్ తరాలకు మెరుగైన విద్యా వాతావరణాన్ని అందించే దిశగా ఈ నిర్మాణ పనులు కీలకంగా నిలవనున్నాయి.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, మాజీ ప్రజా ప్రతినిధులు రాజు, భాస్కర్ గౌడ్, అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, TGEWIDC ఈఈ శ్రీనివాస్ రెడ్డి, ఎంఈఓ సుధాకర్, డిఈలు రాజు, వెంకటరమణ, ఏఈ వరుణ్ రెడ్డి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

ఇసుక వాహనాల రాకపోకలకు సమర్థవంతమైన ప్రణాళిక రూపొందించాలి

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

హోల్డింగ్, పార్కింగ్ ప్రాంతాలను సద్వినియోగం చేసుకోవాలి

అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి

భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్





ప్రజా వాయిస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇసుక రవాణా కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తో కలిసి బుధవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరం లో ఇసుక రవాణా, వాహనాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్ ప్రాంతాలు, అక్రమ ఇసుక రవాణా తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇసుక వాహనాల రాకపోకలు అధికంగా ఉన్న మణుగూరు, చర్ల, భద్రాచలం, బూర్గంపాడు ప్రాంతాల్లో రోడ్ల సామర్థ్యం, ప్రస్తుత ట్రాఫిక్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వాహనాల ఎంట్రీ, ఎగ్జిట్‌లను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఒకేసారి పెద్ద సంఖ్యలో లారీలు రోడ్లపైకి రాకుండా అవసరానికి అనుగుణంగా దశలవారీగా వాహనాలను పంపించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. మణుగూరు, రామాంజవరం ప్రాంతాల్లో అవసరమైన హోల్డింగ్, పార్కింగ్ ప్రాంతాలను గుర్తించి వినియోగంలోకి తీసుకురావాలని, చర్ల నుంచి భద్రాచలం మార్గంలో భారీ వాహనాల రాకపోకల కారణంగా ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భద్రాచలం రహదారి మరమ్మతుల నాణ్యతపై తక్షణమే పరిశీలన చేసి నివేదిక అందించాలని సూచించారు. బూర్గంపాడు పరిధిలో గొల్లగూడెం, సారపాక బ్రిడ్జి, తాళ్లగూడెం, ఉప్పాక, పినపాక పట్టినగర్ తదితర ప్రాంతాల్లో ఇసుక రవాణా వల్ల ఏర్పడుతున్న సమస్యలను గుర్తించి ప్రత్యామ్నాయ పార్కింగ్, హోల్డింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, ఇతర అత్యవసర వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ.. ఇసుక రవాణా పెరిగే ప్రాంతాల్లో అవసరానికి అనుగుణంగా ట్రాఫిక్ మార్షల్స్‌ను అదనంగా ఏర్పాటు చేయాలని సూచించారు. మణుగూరు, చెర్ల ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా టీజీఎండీసీ అధికారులతో సమన్వయం చేసుకొని వాహనాల సాఫీ రాకపోకలకు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఒకేసారి అదనంగా వాహనాలు వచ్చినప్పుడు వాటిని నియంత్రించే విధంగా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి జిల్లాలోకి అక్రమంగా ఇసుక రవాణా జరిగే అవకాశాలను నిరోధించేందుకు సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలని ఎస్పీ సూచించారు. సీజ్ చేసిన ఇసుకను అక్కడే నిల్వ ఉంచకుండా తదుపరి చర్యల కోసం తరలించేలా ప్రత్యేక మెకానిజం ఏర్పాటు చేయాలని తెలిపారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వాహనాలు, జేసీబీలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నిబంధనల ప్రకారం జరిమానాలు విధించాలని ఆదేశించారు. ఇసుక రవాణా, ట్రాఫిక్ నిర్వహణ, అక్రమ ఇసుక రవాణా నియంత్రణలో పోలీసు, రెవెన్యూ, టీజీఎండీసీ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్, ఎస్పీ సూచించారు. ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగకుండా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డిఆర్ఓ పద్మావతి,కొత్తగూడెం ఆర్డీవో మధు, ఏడి మైన్స్ దినేష్, జిల్లా రవాణా శాఖ అధికారి భూషిత్ రెడ్డి, తాసిల్దారులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ప్రీ-స్కూల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి..

- గర్భిణీ, బాలింతలకు పోషకాహారం ఎంతో ముఖ్యం

- ఐసిడిఎస్ సీడీపీఓ ఎల్లయ్య

ప్రజా వాయిస్, దుబ్బాక:

పోషణ మాసంలో షెడ్యూల్లో భాగంగా "మన అంగన్‌వాడీ – మన బాధ్యత" అనే థీమ్‌తో దుబ్బాక మండల పరిధిలోని చీకోడ్ గ్రామంలోని రైతువేదికలో దుబ్బాక సెక్టార్ స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సీడీపీఓ ఎల్లయ్య మాట్లాడుతూ... దుబ్బాక ప్రాజెక్టు పరిధిలోని ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పోషణ్ మాసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులందరూ (గర్భిణీలు,బాలింతలు) ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య లక్ష్మి పథకం ద్వారా ఒక పూట సంపూర్ణ పోషకాహారం, అంగన్‌వాడీ ప్రీ-స్కూల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలను ఉద్దేశించి మాట్లాడుతూ...గర్భధారణ సమయంలో తల్లి ఆరోగ్యం, పోషకాహారం, శిశువు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా 3 నుండి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పూర్వ ప్రాథమిక విద్య (ప్రే- స్కూల్ ఎడ్యుకేషన్) ఎంతో కీలకమైనదని తెలిపారు. ఆటలు, పాటలు, కథలు, సంభాషణలు, వివిధ కార్యకలాపాల ద్వారా పిల్లల్లో నేర్చుకునే ఆసక్తిని పెంపొందించడంతో పాటు వారి శారీరక, మానసిక, సామాజిక, భాషా మరియు మేధో వికాసానికి పూర్వ ప్రాథమిక విద్య దోహదపడుతుందని పేర్కొన్నారు. భవిష్యత్ విద్యాభ్యాసానికి అంగన్వాడీ కేంద్రాల్లో అందించే ఈ పునాది విద్య ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.ఈ సందర్భంగా ఆహార వైవిధ్యం, ప్రోటీన్ సమృద్ధిగా ఉన్న ఆహారం, పోషకాహారం ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. పోషణ అభియాన్ బ్లాక్-కో ఆర్డినేటర్ శ్యాంసన్ మరియు సూపర్వైసర్ రాజేశ్వరి మాట్లాడుతూ... నేటి షెడ్యూలు ప్రకారం ఆరోగ్యకరమైన అలవాట్లు జంక్ ఫుడ్ మరియు ప్యాకేజీ ఫుడ్స్ పై అవహగాహన కల్పించారు. గర్భిణీలు ప్రతిరోజూ సమతుల్యమైన పోషకాహారం తీసుకోవాలని, ఆకుకూరలు, కూరగాయలు, పప్పులు, పాలు, గుడ్లు, పండ్లు వంటి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తగిన మోతాదులో తీసుకోవాలని తెలిపారు. వైద్యుల సూచన మేరకు ఐరన్, ఫోలిక్ యాసిడ్, కాల్షియం మాత్రలను క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. గర్భిణీలు కుటుంబ సభ్యులు రోజువారీ ఆహారంలో చిరుధాన్యాలను కూడా భాగంగా చేసుకోవాలని సూచించారు. రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు, సామలు వంటి చిరుధాన్యాల్లో పీచు, ఖనిజాలు మరియు ఇతర పోషకాలు లభిస్తాయని తెలిపారు. స్థానికంగా సులభంగా లభించే చిరుధాన్యాలను వివిధ రకాల వంటకాల రూపంలో తీసుకోవడం ద్వారా ఆహారంలో వైవిధ్యాన్ని పెంచుకోవచ్చని సూచించారు. దుబ్బాక మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు దేవరాజు మాట్లాడుతూ... పిల్లలు, గర్భిణీలు, బాలింతల ఆరోగ్యానికి పోషకాహారం ఎంతో ముఖ్యమని తెలిపారు. దుబ్బాక మండల పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు మరియు హెల్త్ సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు పోషకాహారం, పూర్వ ప్రాథమిక విద్యతో పాటు గర్భిణీలు, బాలింతలకు ఆరోగ్యం మరియు పోషణపై అవగాహన కల్పించడం ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొన్నారు.దుబ్బాక మండల పరిధిలోని అన్ని గ్రామాల సర్పంచుల సహకారం అంగన్వాడీ కేంద్రాలకు ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన తెలిపారు. గ్రామాల్లో పోషణ, ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు సర్పంచులు, అంగన్వాడీ మరియు హెల్త్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.పోషణ మాసం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న ఐసీడీఎస్, అంగన్వాడీ మరియు హెల్త్ సిబ్బందిని ఈ సందర్భంగా దేవరాజు



కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ సర్పంచ్ కొమిరె నరేష్ మాట్లాడుతూ.. తమ గ్రామంలోని గర్భిణీ, బాలింతలకు,పిల్లలకోసం ఇంత మంచి అవగాహన కార్యక్రమం నిర్వహించినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ,గ్రామ లబ్ధిదారులు అందరు ఇట్టి కార్యక్రమలలోని తెలిపిన పోషణ మరియు ఆరోగ్య సలహాలు పాటిస్తూ ప్రభుత్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణీలకు లిసామూహిక శ్రీమంతాలు ,పిల్లలకు అన్నప్రాసనలి నిర్వహహించారు. అలాగే ప్రోగ్రాం చివరగా అంగన్‌వాడీ సేవల్లో ప్రతి ఒక్కరూ కూడా ప్రతి ఒక్కరూ దృష్టి సాదించాలని సంకల్పంతో లిపోషణ్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలోదుబ్బాక మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు దేవరాజు, పోషణ అభియాన్ బ్లాక్ కో-ఆర్డినేటర్ శ్యాంసన్ ,గ్రామ సర్పంచ్ కొమిరె నరేష్ ,ఉప సర్పంచ్ ,కొండల్ రెడ్డి , పంచాయతీ సెక్రటరీ శిరీష్ ,ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి,ఎఎన్ఎం లక్ష్మి ,మమత, ఆశ వర్కర్లు, దుబ్బాక సెక్టార్ పరిధిలోని అందరూ అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపన్యాస పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించిన విద్యార్థిని కీర్తన

విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు యంగ్ టూరిజం క్లబ్ లాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయి

కీర్తన సాధించిన విజయం పై కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు

ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ శివ గౌడ్



ప్రజా వాయిస్.. వీపనగండ్ల

యంగ్ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపన్యాస పోటీలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, వీపనగండ్లకు చెందిన బైపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని పి. కీర్తన జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించింది.ఈ నెల 22న మండల స్థాయిలో నిర్వహించిన ఉపన్యాస పోటీలో పాల్గొని కీర్తన జిల్లా స్థాయి పోటీకి ఎంపికైంది. అనంతరం సెప్టెంబర్ 24న వనపర్తి జిల్లాలో నిర్వహించిన జిల్లా స్థాయి యంగ్ టూరిజం క్లబ్ ఉపన్యాస పోటీలో పాల్గొని ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది.తెలంగాణలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలు,వాటి చారిత్రక, సాంస్కృతిక, ప్రకృతి వైభవం, పర్యాటక ప్రాధాన్యతలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ బి. శివగౌడ్,అధ్యాపకుల ప్రోత్సాహం, సూచనలు, మార్గదర్శకత్వంతో ఈ విజయాన్ని సాధించినట్లు కళాశాల సిబ్బంది తెలిపారు.ఈ సందర్భంగా వనపర్తి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె. నరేంద్ర కుమార్ అందజేశారు. కీర్తనకు యంగ్ టూరిజం క్లబ్ షీల్డ్, శాలువాతో సన్మానం చేశారు.ద్వితీయ బహుమతి విజేతగా నిలిచిన విద్యార్థికి సర్టిఫికెట్‌తో పాటు నగదు బహుమతి అందజేశారు.కీర్తన సాధించిన విజయంపై కళాశాల ప్రిన్సిపాల్,అధ్యాపకులు,సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు యంగ్ టూరిజం క్లబ్ వంటి కార్యక్రమాలు దోహదపడతాయని ప్రిన్సిపాల్ అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు లక్ష్మీనారాయణ,కల్పన, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు రూ.20,000 విలువగల స్కూల్ బ్యాగులు పంపిణీ..

విద్యార్థులు క్రమశిక్షణతో ఇష్టంగా చదువుకోవాలి

పాఠశాలకు గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలి

దాత కిరణ్ కుమార్ రెడ్డి లయన్స్ క్లబ్ దేవరుప్పుల అధ్యక్షుడు

ప్రజా వాయిస్/దేవరుప్పుల(జనగామ జిల్లా

దేవరుప్పుల మండలం, అప్పిరెడ్డి పల్లి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు జీ.శంకర్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ దేవరుప్పుల వారి సహకారంతో ణ.శా రెడ్డి రైస్ మిల్ యజమాని దుగ్గింపూడి కిరణ్ కుమార్ రెడ్డి పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు సుమారు 20,000 విలువైన బ్యాగులను పంపిణీ చేశారు.లయన్స్ క్లబ్ దేవరుప్పుల అధ్యక్షుడు,బ్యాగుల దాత కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నైతిక విలువలు కలిగిన నాణ్యమైన విద్య లభిస్తుందని,కావున విద్యార్థులు క్రమశిక్షణతో ఇష్టంగా చదువుకుని పాఠశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని తెలియజేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు లయన్స్ క్లబ్ దేవరుప్పుల ప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కౌడగాని అనూష నరసింగరావు,లయన్స్ క్లబ్ దేవరుప్పుల అధ్యక్షుడు గోలి చిన్న ఉప్పల్ రెడ్డి,కార్యదర్శి బూత్కూరి అశోక్ రెడ్డి, ట్రస్ట్ చైర్మన్ మర్రి పట్టాభిరాం రెడ్డి, ట్రెజరర్ ఈదునూరి రామచంద్రారెడ్డి,ఉపాధ్యక్షులు దుగ్గింపూడి కిరణ్ కుమార్ రెడ్డి,ఉపాధ్యాయులు నవీన్ కుమార్ ,తిరుపతి రెడ్డి, అంగన్వాడీ టీచర్స్,విద్యార్థులు పాల్గొన్నారు.

భూములు రీ-సర్వే ను పరిశీలించిన జిల్లా (రెవెన్యూ) అదనపు కలెక్టర్ వినోద్ కుమార్

అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ రి సర్వే ను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలి

రైతులు అధికారులకు సహకరించాలి

రీ -సర్వే ప్రక్రియలో ఎలాంటి అవకతవతలకు జరగకుండా చూసుకోవాలి



ప్రజా వాయిస్.. వీపనగండ్ల

వీపనగండ్లమండలంలోని కోర్లకుంట గ్రామంలో కొనసాగుతున్న రీ-సర్వే ప్రక్రియను వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామంలో చేపడుతున్న భూములు రీ- సర్వేలో భాగంగా గ్రామ సరిహద్దులు, ఆబాది ప్రాంతం, ప్రభుత్వ భూములు,చెరువులు,పట్టా భూములు,హౌస్ సైట్లకు సంబంధించిన వివరాలను ఆయన పరిశీలించి, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ మాట్లాడుతూ రీ-సర్వేలో భూమి విస్తీర్ణంలో తేడాలు, ఎక్కువ లేదా తక్కువగా నమోదయ్యే సందర్భాల్లో సంబంధిత విషయాలను వెంటనే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు.అలాగే అధికారులు నిర్వహిస్తున్న కో-రిలేషన్ రిజిస్టర్, ఫీల్డ్ రిజిస్టర్లో నమోదు చేస్తున్న వివరాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు.సర్వే సందర్భంగా సంబంధిత భూ యజమానులకు తప్పనిసరిగా నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.రైతుల పట్టాదారు పాస్‌బుక్ నంబర్, ఆధార్ నంబర్లను నమోదు చేయడంతో పాటు సంబంధిత రిజిస్టర్లలో రైతుల సంతకాలను తీసుకోవాలని సూచించారు.రీ-సర్వే ప్రక్రియలో ఎలాంటి అలసత్వానికి తావులేకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ఖచ్చితత్వంతో సర్వేను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉదయం, సాయంత్రం వేళల్లో సర్వే పనులను ఎక్కువగా నిర్వహించేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ రీ-సర్వేను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ గడ్డం శివకుమార్,గ్రామ పాలన అధికారి రమేష్, లైసెన్స్‌డ్ సర్వేయర్ స్వామి, గ్రామ సర్పంచ్,మాజీ ఎంపీపీ కమలేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

మామిళ్ల గూడెంలో రీసర్వేపై ప్రత్యేక అవగాహన సదస్సు ..



మోతె అక్టోబర్ / ప్రజా వాయిస్

మండల పరిధిలోని మామిళ్లగూడెం గ్రామ పంచాయతీ ఆవరణలో సింగరేణిపల్లి గ్రామ రెవెన్యూ శివారులో గల రైతులకు భూముల రీసర్వేపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మోతే తహశీల్దార్ వెంకన్న గారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణిపల్లి గ్రామాల పరిధిలోని భూముల సర్వే నెంబర్లకు రీసర్వే ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ రీసర్వే ద్వారా క్షేత్రస్థాయిలో ప్రతి భూమికి సంబంధించిన హద్దులను ఖచ్చితంగా కేటాయించి, వివాదాలకు తావులేకుండా పక్కాగా రికార్డులను సిద్ధం చేస్తామని రైతులకు వివరించారు. సర్వే పూర్తయిన తర్వాత ప్రతి ఒక్క భూయజమానికి విశిష్టమైన 'భూధార్' కార్డును అందజేయడం జరుగుతుందని వెల్లడించారు.ఈ భూధార్ కార్డు లభించడం వల్ల రైతులకు తమ భూములపై పూర్తి నిశ్చింత, చట్టపరమైన భద్రత లభిస్తుందని, భవిష్యత్తులో ఎలాంటి భూవివాదాలు తలెత్తే అవకాశం ఉండదని తహశీల్దార్ స్పష్టం చేశారు. రైతులందరూ అధికారులకు సహకరించి ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగమణి, ఆర్ ఐ లు కరుణాకర్ రెడ్డి, రమేష్, పంచాయతి కార్యదర్శి కవిత , జిపిఓ ప్రవీణ్ గ్రామ రైతులు , ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

మందారిపేటలో తంగేడు మొక్కలు నాటిన ఎమ్మెల్యే

ప్రతి ఇంటా తంగేడు మొక్క నాటాలి: గండ్ర సత్యనారాయణరావు



మందారిపేటలో మొదలైన ఉద్యమం

రాష్ట్రవ్యాప్తంగా కొనసాగాలి

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి

మందారిపేట గ్రామంలో ప్రారంభమైన తంగేడు మొక్కల పెంపక ఉద్యమం తెలంగాణ వ్యాప్తంగా విస్తరించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆకాంక్షించారు. బుధవారం హనుమకొండ జిల్లా శాయంపేట మండలం మందారిపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో తంగేడు మొక్కను నాటారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తంగేడు తెలంగాణ రాష్ట్ర పుష్పమని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు తంగేడు పుష్పం ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తుందని అన్నారు. బతుకమ్మ పండుగతో తంగేడు పుష్పానికి విడదీయరాని అనుబంధం ఉందని తెలిపారు. మందారిపేటలో ప్రారంభమైన తంగేడు మొక్కల పెంపక కార్యక్రమం స్ఫూర్తిగా నిలవాలని ఎమ్మెల్యే అన్నారు. ప్రతి ఇంటిలో ఒక్క తంగేడు మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. గ్రామాలు, రహదారుల వెంట, చెరువు కట్టలు, ప్రభుత్వ స్థలాల్లో తంగేడు మొక్కలను విస్తృతంగా నాటాలని సూచించారు. తెలంగాణ అంతటా తంగేడు మొక్కల పెంపకం జరిగేలా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.తంగేడు మొక్కల పెంపక ఉద్యమాన్ని చేపట్టి గ్రామస్థులు, యువతలో అవగాహన కల్పిస్తున్న ఉద్యమ అధ్యక్షుడు బడుగు సునీల్ ను ఎమ్మెల్యే అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలకు ప్రజల సహకారం అవసరమని.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుక్కల సరోజన, కార్యదర్శి అజయ్, ఉప సర్పంచ్ రావుల శ్రీనివాస్, కుక్కల తిరుపతి, మాజీ మార్కెట్ ఛైర్మన్ రేణుకుంట్ల సదయ్య, బూర ఈశ్వరయ్య, బొట్టు రత్నాకర్, వలుస తరుణ్, గాజర్ల శంకర్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, యువకులు, తంగేడు మొక్కల కమిటీ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ ఓట్ చోరీ విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

జిల్లా మైనార్టీ అధ్యక్షుడిగా ఎంప నయీమ్ ప్రమాణ స్వీకారం

ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

హాజరైన జువ్వాడి నర్సింగరావు, డిసిసి అధ్యక్షుడు గాజంగి నందయ్య, జువ్వాడి కృష్ణారావు

రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీతో ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం: మంత్రి అడ్లూరి



ప్రజా వాయిస్, కోరుట్ల

దేశంలో భారతీయ జనతా పార్టీ, ప్రధాని నరేంద్ర మోడీ ఓట్ చోరీకి పాల్పడుతూ ప్రజల ఓటు హక్కును కాలరాసే విధంగా ప్రయత్నిస్తున్నారని, బిజెపి చేపడుతున్న ఈ విధానాన్ని కాంగ్రెస్ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతులను చేయాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా నూతన మైనార్టీ అధ్యక్షుడిగా నియమితులైన ఎంఏ నయీమ్ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బుధవారం కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు గాజంగి నందయ్య, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్, వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంసానపట్ల దినేష్, రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు ఇర్ఫాన్ అలీ, సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు హాజరై నయీమ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. 2014 నుండి 2023 వరకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ఒక్క నూతన రేషన్ కార్డు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే అర్హులందరికీ రేషన్ కార్డులతో పాటు సన్నబియ్యం పంపిణీ చేస్తోందన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతి నియోజకవర్గానికి రూ. 12 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఇటీవల అసెంబ్లీలో ప్రతిపక్ష బీఆర్ఎస్ నల్ల టీషర్టులు ధరించి స్పీకర్‌ను అవమానించడం బాధాకరమన్నారు. కేసీఆర్ దళితులను పరామర్శించిన ప్రదేశాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేయడం దళితులను తీవ్రంగా అవమానించడమేనని మండిపడ్డారు. సంఘం శ్రీరాంపూర్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు ఆక్రమించిన ప్రభుత్వ భూమిపై విచారణ జరిపి దళితులకు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో కోరుట్ల పట్టణానికి చెందిన ?కే జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఇవ్వబోతున్నామని వెల్లడించారు. నియోజకవర్గ అభివృద్ధికి రూ. 8.16 కోట్ల పుష్కర నిధులు, రూ. 8 కోట్ల సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందించామని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికే నామినేటెడ్ పదవులు దక్కుతాయని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో 24 గంటలు అందుబాటులో ఉంటానని చెప్పి, ఇప్పుడు వారానికి ఒకరోజు చుట్టపుచూపుగా వచ్చి పోతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాలకు నూతన కోర్సు మంజూరు చేసిందని, నియోజకవర్గంలో ఆర్‌టిఏ భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్, మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్లు షాహిద్, ఓంకార్ నవీన్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు పన్నాల అంజిరెడ్డి, రాజేందర్, శ్రీకాంత్, సోమయ్య, పలువురు సర్పంచులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మోతె మండలంలో డీఈఓ ఆకస్మిక తనిఖీ...

మోతె అక్టోబర్ / ప్రజా వాయిస్

మోతె మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను జిల్లా విద్యాధికారి సిహెచ్. శ్రీనివాసరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని కరక్కాయలగూడెం, విభలాపురం, ఉర్లుగొండ గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించి పాఠశాలల నిర్వహణ, విద్యార్థుల హాజరు, బోధనా విధానాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా తరగతి గదుల్లో విద్యార్థులతో నేరుగా మాట్లాడిన డీఈఓ.. వారి చదువు, పాఠ్యాంశాలపై అవగాహన, విద్యా నైపుణ్యాలను పరిశీలించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి సమాధానాలను స్వయంగా తెలుసుకున్నారు. విద్యార్థుల్లో ఉన్న అభ్యసన సామర్థ్యాలను పరిశీలించిన అనంతరం వారి విద్యా ప్రగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు.అలాగే ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న బోధన, విద్యా ప్రమాణాల మెరుగుదలకు తీసుకుంటున్న చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రతి విద్యార్థి విద్యలో ముందుకు సాగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు క్రమశిక్షణ, పరిశుభ్రత, హాజరు శాతంపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని తెలిపారు.ఈ ఆకస్మిక తనిఖీతో పాఠశాలలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో మరింత బాధ్యత పెరిగిందని, జిల్లా విద్యాధికారి స్వయంగా తరగతి గదుల్లో విద్యార్థుల విద్యా నైపుణ్యాలను పరిశీల చేశారు.

సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన

ఆన్‌లైన్ బహుమతులు, లాటరీ మెసేజ్‌లు నమ్మొద్దు

సైబర్ మోసపోతే వెంటనే 1930కి కాల్ చేయండి

ఉచిత ఆఫర్లు నమ్మితే కొంపముంచే ప్రమాదం

నమ్మి ఓటీపీ చెప్పారో అంతే సంగతులు

ప్రజా వాయిస్ /జైపూర్ మంచిర్యాల క్రైమ్

సైబర్ నేరాల పట్ల ప్రజలు, విద్యార్థులు, యువత సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, తగిన జాగ్రత్తలు పాటించాలని జైపూర్ ఎస్సై భూమేష్ తెలిపారు. రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝా, జైపూర్ ఎసిపి వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు బుధవారం మండల కేంద్రంలోని పలు పాఠశాలల్లో 'సైబర్ జాగృక్త దివస్' నిర్వహించారు. ప్రతి నెలా మొదటి బుధవారం నిర్వహించే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ఇంటర్నెట్ వినియోగదారులను సైబర్ మోసాల నుంచి రక్షించడం,వారిలో చైతన్యం నింపడమేనని ఎస్సై పేర్కొన్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు, 1930 టోల్‌ఫ్రీ సేవలు

ప్రజలు తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని, ఓటీపీ లేదా కేవైసీ అప్‌డేట్ చేయాలంటూ వచ్చే సందేశాలకు స్పందించకూడదని ఎస్సై హెచ్చరించారు. లాటరీలు, బహుమతులు, తక్కువ వడ్డీకే రుణాల పేరుతో సైబర్ నేరగాళ్లు వేసే ఆన్‌లైన్ ఎరల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇంటర్నెట్‌ను పరిమితికి మించి వాడకూడదని సూచించారు. ముఖ్యంగా ఇటీవల మహిళలు, పిల్లలను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవేళ సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న డబ్బును రికవరీ చేసే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు





పట్టభద్రుల ఓటరు నమోదుపై బీఆర్ఎస్ అవగాహన

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియపై నాయకులకు దిశానిర్దేశం చేసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

ప్రజా వాయిస్/జనగామ జిల్లా

జనగామ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన సమావేశం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్ల నమోదు, అర్హతలు, దరఖాస్తు ప్రక్రియ తదితర అంశాలపై పార్టీ నాయకులకు అవగాహన కల్పించారు.ఈ సమావేశానికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పాల్గొని నాయకులకు పలు సూచనలు చేశారు. జనగామ, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు కార్యక్రమానికి సంబంధించిన ప్రతినిధులు, ఇతర నాయకులు పాల్గొన్నారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు అయ్యేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని నాయకులకు సూచించారు.

రెవిన్యూ ఉద్యోగి అక్రమ పట్టాలను రద్దు చేయాలి

జిల్లా కలెక్టర్ ఆదేశించిన విచారించని రెవెన్యూ అధికారులు

తెలంగాణ భూమి పుత్ర ఆదివాసీ సంఘము రాష్ట్ర అధ్యక్షులు పూనెం రామచంద్ర రావు

వెంకటాపురం ప్రజావాయిస్ :

ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అక్రమ పట్టాలను పొందిన రెవిన్యూ ఉద్యోగిని విధుల నుండి తప్పించాలని మరియు అక్రమ భూ పట్టాలను రద్దు చేయాలని తెలంగాణ భూమి పుత్ర ఆదివాసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పూనెం రామచంద్ర రావు డిమాండ్ చేసారు . వెంకటాపురం మండలం కేంద్రంలోని తెలంగాణ భూమిపుత్ర ఆదివాసి సంఘం కార్యాలయం నందు మండల ముఖ్య కార్యకర్తల సమావేశం పొడెం సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అయన పాల్గొని సమావేశం ఉద్దేశించి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతం



వెంకటాపురం మండల పరిధిలోని వీరభద్రారం మరియు అంకన్న గూడెం రెవెన్యూ గ్రామాల పరిధిలో రెవెన్యూ ఉద్యోగిగా ఇక్కడ విధులు నిర్వహించిన సమయంలో రెవిన్యూ రికార్డులను మార్చి సర్వేనెంబర్ 1/ ఇ, 1/ ఈ 1/ఉ 7/5,46, 47, వెంకటాపురం జెడ్ 69 సుమారు 30 ఎకరాల ,ప్రభుత్వ భూములను తన కుటుంబ సభ్యుల పేర్లపై మరియు అతని పేరుపై ఉన్న భూములను బినామీ పేర్లపై మార్చడం జరిగిందని,ఈ విషయంపై తెలంగాణ భూమిపుత్ర ఆదివాసి సంఘం గతంలో జిల్లా కలెక్టర్ గారికి పలు ఆధారాలతో ఫిర్యాదు చేయగా విచారించి ఆ ఉద్యోగిని హైదరాబాద్ ప్రధాన భూ పరిపాలన కమిషనర్ కార్యాలయానికి సరెండర్ చేయడం జరిగిందన్నారు.అంతటితో అధికారులు చేతులు దులుపుకున్నారని, ఇటువంటి ప్రభుత్వ భూముల కబ్జా కోర్ పై పూర్తిస్థాయి విచారణ జరిపి అక్రమ పట్టాలను రద్దు పరచి ఆ భూములను ప్రభుత్వం స్వాధీనపరుచుకొవలన్నారు. అలాగే ఆ ఉద్యోగిని విధుల నుండి తొలగించాలని తెలంగాణ భూమి పుత్ర ఆదివాసి సంఘం డిమాండ్ చేస్తుందన్నారు.ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు ఉండం రామచంద్ర ప్రసాద్,సోలం సుధాకర్,చంటిబాబు, తురస సూరిబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు



అయ్యప్ప సన్నిధిలో అన్నదానం

తొలిరోజు 130 మంది స్వాములకు అన్నప్రసాదం భక్తిశ్రద్ధలతో వితరణ

ప్రజా వాయిస్,అనంతగిరి:

అనంతగిరిలోని అయ్యప్ప సన్నిధిలో బుధవారం అన్నప్రసాద వితరణ కార్యక్రమం ప్రారంభమైంది. తొలిరోజు సుమారు 130 మంది స్వాములు అన్నప్రసాదం స్వీకరించారు. దాతలు, భక్తుల సహకారంతో స్వాములకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా మహారాజపోషకులు బుర్రా పుల్లారెడ్డి,సుధారాణి దంపతులు, పసుమర్తి హరిప్రకాష్,ప్రత్యూష దంపతులు, కొండపల్లి వాత్సల్య కుటుంబ సభ్యులు తదితరులు అన్నదానానికి సహకరించారు. ట్రస్ట్ చైర్మన్ కొండపల్లి వాసుతో పాటు పందిరి వీరయ్య, అర్వపల్లి సత్యనారాయణ, కత్రం బాపూజీరెడ్డి, ముస్కు శ్రీనివాసరెడ్డి, బుర్రా నరసింహారెడ్డి, ముత్తినేని కోటేశ్వరరావు, నల్ల భూపాల్‌రెడ్డి, స్థానిక ఎస్ఐ ఏడుకొండలు, జగిని ప్రసాద్, బొడ్ల నాగేశ్వరరావు, కే. రామారావు, ప్రభాకర్, రమేష్, అయితనబోయిన వెంకటేశ్వర్లు తదితర భక్తులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో పెండింగ్ నోటీసులు, విచారణలను వేగవంతంగా పూర్తి చేయాలి

- ప్రతి క్లెయిమ్, అభ్యంతరంపై ఎస్ఓపీ ప్రకారం చర్యలు

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

ప్రజా వాయిస్ సంగారెడ్డి:

అర్హత కలిగిన ప్రతి ఒక్క ఓటరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న నోటీసులు, విచారణలను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు లతో కలిసి ఎస్ఐఆర్-2026 ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో అందిన ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని నిర్దేశిత స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో గుర్తించిన అనామలీస్,నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు జారీ చేసి, వారి నుంచి అవసరమైన పత్రాలు, వివరాలను సేకరిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అందిన పత్రాలు, వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి తదుపరి ప్రక్రియలో పొందు పరుస్తున్నట్లు తెలిపారు. నోటీసులు అందుకున్న వారిలో అర్హత కలిగిన ఓటర్లు ఉంటే, నిబంధనలకు అనుగుణంగా అవసరమైన పత్రాలను సమర్పించేలా బూత్ లెవల్ ఏజెంట్లు వారికి సహకరించే విధంగా రాజకీయ పార్టీలు చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఓటరుకు జాబితాలో స్థానం కల్పించేలా సమన్వయంతో పనిచేయాలని పొలిటికల్ పార్టీల ప్రతినిధులను కోరారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, వివిధ పొలిటికల్ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగపు అధికారులు పాల్గొన్నారు.



ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు గచ్చిబౌలిలో 200 ఎకరాలు కేటాయించాలి

- మోడల్ కాలనీ నిర్మించి ప్లాట్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలి

- సర్వే నంబర్ 325పై తొమ్మిది రోజులుగా రెవెన్యూ సర్వే

- 388 ఎకరాల్లో 244 మంది రైతులు సాగు చేస్తున్నారని వెల్లడి

- ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు అమలు చేయాలని డిమాండ్

- గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :

తెలంగాణ ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు హైదరాబాద్ గచ్చిబౌలిలో 200 ఎకరాల భూమిని కేటాయించి ప్లాట్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందించేలా మోడల్ కాలనీ నిర్మించాలని గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్‌లోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలు, ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫామ్‌హౌస్ రాజకీయాలతో ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. గచ్చిబౌలి భూముల అంశాన్ని అడ్డుపెట్టుకుని ప్రభుత్వం రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రత్యేకంగా 200 ఎకరాలు కేటాయించి, లేఅవుట్ రూపొందించి ప్లాట్లు ఇవ్వడంతో పాటు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లతో మోడల్ కాలనీ నిర్మించి అందించాలని కోరారు.

ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు మోడల్ కాలనీ

సర్వే నంబర్ 325పై రెవెన్యూ అధికారులు తొమ్మిది రోజులుగా సర్వే నిర్వహిస్తున్నారని వంటేరు తెలిపారు. ఈ సర్వేలో కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు చెందినదిగా పేర్కొంటున్న భూమిలో ఒక్క చదరపు గజం కూడా కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు చెందదని అధికారులు చెప్పారని ఆయన పేర్కొన్నారు. 1976లో ఎర్రవల్లి గ్రామానికి సంబంధించిన మ్యాప్ రూపొందించే సమయంలో సర్వే నంబర్ 325లో ఓవర్‌ల్యాప్ అంశం ఏర్పడిందని వివరించారు. మొత్తం 388 ఎకరాల భూమిలో వివిధ సామాజిక వర్గాలకు చెందిన 244 మంది రైతులు సాగు చేస్తూ, తమ ఆధీనంలో ఉన్నట్లు రెవెన్యూ సర్వేలో వెల్లడైందని ఆయన చెప్పారు. ఈ అంశంపై వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

ఫామ్‌హౌస్ రాజకీయాలతో ప్రజల దృష్టి మళ్లింపు

రాష్ట్రంలో రైతులు 24 గంటల నాణ్యమైన విద్యుత్ కోసం ఆందోళనలు చేస్తున్నారని, ప్రజలు ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్ల అమలును ప్రశ్నిస్తున్నారని వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. వీటికి సమాధానం చెప్పకుండా ఫామ్‌హౌస్ అంశాన్ని తెరపైకి తీసుకువచ్చి ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారని విమర్శించారు. కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా ప్రభుత్వ తీరు ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ బీసీ ముఖ్యమంత్రి అంశాన్ని ప్రస్తావించడం, భవిష్యత్‌లో బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించిందని చెప్పడం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేని ముఖ్యమంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పి నైతిక బాధ్యత వహిస్తూ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెయ్యి రోజుల్లో సుమారు రూ. 4 లక్షల కోట్ల అప్పులు చేసిందని, అయినా కొత్తగా చెప్పుకోదగిన ప్రాజెక్టులు చేపట్టలేదని వంటేరు ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగించడంతో పాటు కాంగ్రెస్ ఎన్నికల హామీలను కూడా అమలు చేయాలని కోరారు.

కేసీఆర్ పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ వంటి సాగునీటి ప్రాజెక్టులు నిర్మించామని వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించామని, రైతులకు పెట్టుబడి సహాయం, రైతు బీమా, 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించామని తెలిపారు. రైతు వేదికలు, పంటల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలిచామని పేర్కొన్నారు. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా ఆర్థిక సహాయం అందించామని, కేసీఆర్ కిట్లు, పోషకాహార కిట్లు, వృద్ధాప్య పింఛన్లు, ఒంటరి మహిళల పింఛన్లు వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని అన్నారు. రాష్ట్రంలో 33 జిల్లాలు, కలెక్టరేట్‌లు, వైద్య కళాశాలలు, కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాలు, గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేశామని, 1080 గురుకుల పాఠశాలల ద్వారా విద్యా సౌకర్యాలు విస్తరించామని తెలిపారు. యాదాద్రి ఆలయ పునర్నిర్మాణంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేశామని చెప్పారు. కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం ప్రతి ఇంటిలో కనిపిస్తుందని, ప్రస్తుత ప్రభుత్వం భారీగా అప్పులు చేసిన నేపథ్యంలో ప్రజలకు చూపించగలిగే రేవంత్‌రెడ్డి మార్క్ అభివృద్ధి ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కేసీఆర్ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని ఫామ్‌హౌస్ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి చుట్టూ ఉన్న పలువురు వ్యక్తులపై కూడా వంటేరు తీవ్ర విమర్శలు చేశారు. తిరుపతిరెడ్డి, కొండల్‌రెడ్డి, జైసింహ, ఉదయసింహ, ఫహీమ్ ఖురేషీ తదితరులను ప్రస్తావిస్తూ వారిని అలీబాబా 40 దొంగలు తో పోల్చారు. హైదరాబాద్‌లో ప్రజల ఆస్తులను దోచుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఈ ఆరోపణలను ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అంశాలుగా ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు రేవంత్‌రెడ్డి పాలనను గమనిస్తున్నారని, బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తే ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని వంటేరు అన్నారు. అవినీతికి అడ్డుకట్ట వేసి



ప్రజలకు ప్రయోజనం కలిగేలా పాలన అందిస్తామని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఫామ్‌హౌస్ రాజకీయాలను పక్కనపెట్టి ప్రజల సమస్యలు, రైతుల ఇబ్బందులు, విద్యుత్ సమస్యలపై దృష్టి సారించాలని, ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ పద్మాబాయి నర్సింగరావు, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ గూడెం కృష్ణారెడ్డి, నాయకులు రఘుపతిరెడ్డి, పాల రమేష్‌గౌడ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



గెస్ట్ టీచర్ నియామకం కొరకు దరఖాస్తులు స్వీకరణ

మండల విద్యాశాఖ అధికారి జుంకీలాల్

జూలూరుపాడు, ప్రజా వాయిస్:

మండల పరిధి పాపకొల్లు ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు బోధించుటకు గెస్ట్ టీచర్ ను జిల్లా విద్యాశాఖ ఆదేశానుసారం విద్యాశాఖ ద్వారా నియమించుకొనుటకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి తెలిపారు. ఆసక్తిగల మండల పరిధి స్పెషల్ బిఈడి విద్యా అర్హత కలిగి రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆర్ సి ఐ సర్టిఫికెట్ ఫోర్సులో ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకొనుటకు అర్హులని తెలిపారు. ఈ అర్హతలు కలిగి ఆసక్తిగల మండల పరిధి నిరుద్యోగులు 08-10-26 అనగా నేటి సాయంత్రం నాలుగు గంటల లోపు పాపకొల్లు ప్రాథమిక ఉన్నత పాఠశాల నందు దరఖాస్తు చేసుకోవలసిందిగా మండల విద్యాశాఖ అధికారి జుంకీలాల్ పత్రికా ప్రకటనలో కోరారు.



ఏడుపాయలలో 11 నుంచి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు..

ఏడుపాయల కార్య నిర్వహణ అధికారి వీరేశం వెల్లడి..

ప్రజా వాయిస్, పాపన్నపేట

మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ ఏడుపాయల వనదుర్గ భవాని మాత సన్నిధిలో ఈనెల 11 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వీరేశం తెలిపారు. ఈనెల 11న బాలా త్రిపుర సుందరి దేవిగా, 12న గాయత్రీ దేవిగా, 13న అన్నపూర్ణాదేవిగా, 14న మహా చండీ దేవిగా, 15 మహాలక్ష్మి, 16 సరస్వతి దేవి అవతారంలో, 17 లలిత త్రిపుర సుందరీ దేవిగా, 18 దుర్గా దేవిగా, 19న మహిషాసుర మర్దిని, 20న రాజరాజేశ్వరి దేవి రూపంలో దర్శనం ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రతి సంవత్సరం ఏడుపాయల సన్నిధిలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతాయని ఆలయ కార్యనిర్వాహణ అధికారి తెలిపారు. ఈ శరన్నవరాత్రి ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు





వికసిత్ భారత్ లక్ష్యానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

మోదీ 25 ఏళ్ల సేవకు కృతజ్ఞతగా బీజేపీ సేవా జ్యోతి ర్యాలీ

కాకీమందిర్‌లో సంకల్ప సభ

ముఖ్య ఆహ్వానితులుగా హాజరై ప్రసంగించిన

చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి,నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్

ప్రజా వాయిస్// రాజేంద్రనగర్:

ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవకు కృతజ్ఞతగా బీజేపీ నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్లో భాగంగా బండ్లగూడ జాగిర్ కాకీమందిర్‌లోని వీరభద్ర ఫంక్షన్ హాల్‌లో సేవా జ్యోతి ర్యాలీ--వికసిత్ భారత్ సంకల్ప సభ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య ఆహ్వానితులుగా చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ హాజరయ్యారు.ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ..మోదీ 25 ఏళ్ల సేవ దేశ అభివృద్ధి, సంక్షేమం,సుపరిపాలనకు అంకితమైందన్నారు.మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ స్థాయిలో బలమైన శక్తిగా ఎదుగుతోందని తెలిపారు.వికసిత్ భారత్ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ మాట్లాడుతూ..మోదీ సేవా ప్రస్థానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు.దేశ అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి,సేవా సంకల్పంతో ముందుకు సాగాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి,అంజన్ కుమార్,మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం,మల్లేష్ యాదవ్, వై.శ్రీధర్,జిల్లా కార్యవర్గ సభ్యులు నీరుడు శేఖర్ ముదిరాజ్, బండ్లగూడ జాగీర్ బీజేపీ అధ్యక్షుడు కొండె మహేష్ యాదవ్,పవన్ సాయి, కార్యకర్తలు,యువమోర్చా, మహిళా మోర్చా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల ఆస్తులపై సమగ్ర విచారణ జరపాలి

- తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ
- ఆస్తులు, ఫార్మ్‌హౌస్‌ల వివాదాలతో ప్రజలకు ప్రయోజనం లేదు
- ఆస్తులు, ఆదాయ వనరులపై పారదర్శక విచారణకు డిమాండ్
- ప్రజా సమస్యలపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి
- గజ్వేల్ జనసేన నాయకుడు కమ్మరి శ్రీను





ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :

తెలంగాణ రాష్ట్రంలో ప్రజాప్రతినిధుల ఆస్తులు, ఆదాయ వనరులు, ఎన్నికల అఫిడవిట్లలో ప్రకటించిన వివరాలు, పదవీకాలంలో జరిగిన ఆస్తుల మార్పులపై సమగ్రంగా విచారణ జరిపించాలని కోరుతూ తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాసినట్లు గజ్వేల్ స్థానిక జనసేన నాయకుడు కమ్మరి శ్రీను తెలిపారు. అధికార కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రతిపక్ష పార్టీల మధ్య కొనసాగుతున్న ఆస్తులు, ఫార్మ్‌హౌస్‌లకు సంబంధించిన రాజకీయ వివాదాల వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదని ఆయన అన్నారు. ఈ సందర్భంగా కమ్మరి శ్రీను మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న నిరుద్యోగం, రోడ్లు, విద్య, వైద్యం, రైతుల సమస్యలు, మౌలిక వసతులు వంటి అనేక సమస్యలపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చించాల్సిన సమయంలో రాజకీయ ఆరోపణలు, ఆస్తులు, ఫార్మ్‌హౌస్‌లకు సంబంధించిన వివాదాలు తెరపైకి రావడం వల్ల ప్రజల్లో అసంతృప్తి నెలకొంటోందని అన్నారు. ప్రజల ఓట్లతో ఎన్నికైన ప్రజాప్రతినిధుల ఆస్తులు, ఆదాయ వనరులపై పూర్తి పారదర్శకత ఉండాలని కోరారు. ఎన్నికల అఫిడవిట్లలో ప్రకటించిన ఆస్తులు, పదవీకాలంలో జరిగిన ఆస్తుల మార్పులు, ఆదాయ వనరులను చట్టబద్ధమైన నిబంధనల ప్రకారం పరిశీలించాలని అన్నారు. ఈ అంశాలపై ఎలాంటి అనుమానాలకు తావులేకుండా వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేల ఆస్తులపై ఎలాంటి పక్షపాతం లేకుండా సంబంధిత సంస్థలు సమగ్రంగా పరిశీలించాలని కమ్మరి శ్రీను కోరారు. అధికారంలో ఉన్నవారు, ప్రతిపక్షంలో ఉన్నవారు అనే తేడా లేకుండా అందరికీ ఒకే విధమైన చట్టపరమైన ప్రమాణాలు వర్తించేలా విచారణ జరగాలని అన్నారు. రాజకీయ జోక్యానికి తావులేకుండా పారదర్శకంగా విచారణ చేపట్టాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాప్రతినిధుల ప్రధాన బాధ్యత అని కమ్మరి శ్రీను అన్నారు. రాజకీయ వివాదాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా శాసనసభ సమయాన్ని నిరుద్యోగం, రైతుల సమస్యలు, విద్య, వైద్యం, రోడ్లు, మౌలిక వసతుల వంటి ప్రజా సమస్యలపై చర్చించేందుకు వినియోగించాలని సూచించారు. ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేసే రాజకీయ వ్యవస్థ అవసరమని ఆయన పేర్కొన్నారు.



ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ పండుగ

- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక
- రంగురంగుల పూలతో బతుకమ్మల అలంకరణ
- పాటలు, నృత్యాలతో సందడిగా వేడుకలు
- కళాశాలలో నెలకొన్న పండుగ వాతావరణం
- కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :

గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. బుధవారం కళాశాల ప్రాంగణంలో విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. అధ్యాపకులు సైతం విద్యార్థినులతో కలిసి వేడుకల్లో పాల్గొనడంతో కళాశాలలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. భగవంతుడిని పూలతో పూజించడం సాధారణమైనప్పటికీ, పూలనే బతుకమ్మగా పేర్చి పూజించే ప్రత్యేకత తెలంగాణ బతుకమ్మ పండుగకు ఉందని తెలిపారు. భాద్రపద మాసంలో ప్రారంభమయ్యే ఈ పండుగను తెలంగాణ ప్రజలు తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో, నియమనిష్ఠలతో నిర్వహిస్తారని వివరించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయ పాటలు పాడుతూ నృత్యాలు చేయడం ద్వారా విద్యార్థినులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు. బతుకమ్మ పండుగ ప్రాధాన్యాన్ని విద్యార్థినులకు వివరించడంతో పాటు, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ కమలా క్రిస్టియానా, డాక్టర్ జే. ఉమారాణి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎం.ఎం. లక్ష్మి, మహిళా సాధికారత విభాగం కన్వీనర్ డాక్టర్ సుజాత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



కోరుట్ల మండల కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా దేవయ్య యాదవ్

నియామక పత్రం అందజేసిన పార్టీ నాయకులు

ప్రజా వాయిస్, కోరుట్ల

కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా సంగేమ్ గ్రామానికి చెందిన కల్లూరి దేవయ్య యాదవ్‌ను నియమించారు. ఈ మేరకు తెలంగాణ వెల్మా కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు, రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు, డీసీసీ అధ్యక్షుడు నందయ్యల, పట్టణ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, సమక్షంలో బుధవారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా దేవయ్య యాదవ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దాతల కోసం నాయకుడి ఎదురుచూపు

అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చేరిక

ప్రజా వాయిస్ ఎల్కతుర్తి



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని దామెర గ్రామానికి చెందిన సాతూరి వెంకన్న అనారోగ్యంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గత 20 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ నాయకత్వంలో పనిచేస్తున్న ఆయన ప్రస్తుతం ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. పేదరికం ఆర్థిక ఇబ్బందులతో పాటు అనారోగ్య సమస్యలతో వెంకన్న తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనకు వైద్య ఖర్చులు భారంగా మారడంతో దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. మానవత దృక్పథంతో దాతలు ప్రజలు తమకు తోచినంత ఆర్థిక సహాయం అందించి వెంకన్నకు అండగా నిలవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. సహాయం చేయదలచిన వారు 98 49 56 27 26 నంబర్ కు ఫోన్ పే ద్వారా ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.



కరెంటు కోతలతో రైతన్నల ఆందోళన

- విద్యుత్ కోతలపై సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు
- 12 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్

ప్రజా వాయిస్ దౌల్తాబాద్, అక్టోబర్ 7:

విద్యుత్ కోతలతో పంటలను కాపాడుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ దౌల్తాబాద్ మండల రైతులు బుధవారం పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ముందుగా సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపిన రైతులు అనంతరం శివాజీ చౌరస్తా వద్ద మూడు గంటలకు పైగా రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా సీఎం డౌన్ డౌన్, వద్దురా నాయన కాంగ్రెస్ పాలన అంటూ నినాదాలు చేస్తూ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

వ్యవసాయానికి 12 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ ప్రస్తుతం ఐదు నుంచి ఆరు గంటలు మాత్రమే కరెంటు వస్తోందని రైతులు మండిపడ్డారు. అదీ నిరంతరంగా ఉండటం లేదని, తరచూ విద్యుత్ అంతరాయాలతో మోటార్లు, స్టార్టర్లు కాలిపోతున్నాయని తెలిపారు. ఒకవైపు సాగు పెట్టుబడులు పెరుగుతుండగా, మరోవైపు కరెంటు కోతలతో పంటలను కాపాడుకోలేని పరిస్థితి నెలకొందన్నారు.

పంటలు కీలక దశలో ఉన్న సమయంలో సాగునీరు అందక ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని, అరకొర విద్యుత్‌తో పంటలను ఎలా కాపాడుకోవాలని ప్రశ్నించారు. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల కారణంగా మోటార్లు, స్టార్టర్లు కాలిపోవడంతో మరమ్మతులు, కొత్త పరికరాల కోసం అదనపు భారం పడుతోందన్నారు.

వ్యవసాయానికి కనీసం 12 గంటలపాటు నిరంతర విద్యుత్ సరఫరా చేసి పంటలను కాపాడాలని రైతులు డిమాండ్ చేశారు. విద్యుత్ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని తెలిపారు. దీంతో తొగుట సీఐ రైతులతో, విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు.



అంగన్ వాడీల సేవలు అభినందనీయం

సిరికొండలో 'అంగన్ మిలన్' కార్యక్రమం

ప్రధాని మోదీ 25 ఏళ్ల పాలనకు గుర్తుగా సేవా సంకల్ప అభియాన్

అంగన్‌వాడీ సిబ్బందికి ఘనంగా సన్మానం

మహిళలు, చిన్నారుల సంక్షేమానికి కేంద్రం పెద్దపీట

పాల్గొన్న బీజేపీ నాయకులు

ప్రజా వాయిస్, కథలాపూర్:

ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప అభియాన్'లో భాగంగా మండలంలోని సిరికొండ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో 'అంగన్ మిలన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల ఆరోగ్యం, ప్రాథమిక విద్య, గర్భిణులు, బాలింతల సంక్షేమం కోసం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు అందిస్తున్న సేవలను అభినందిస్తూ వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీలు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, పోషకాహార కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. దేశవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి, మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కాసోజి ప్రతాప్, మల్యాల మారుతి, ఒడ్డాటి సునీల్, గాంధారి శ్రీనివాస్, రాజశేఖర్, అశోక్ గౌడ్, నాంపల్లి శ్రీధర్, ఇతర నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



ఇంకుడు గుంత ప్రతి ఒక్కరు ఏర్పాటు చేసుకోవాలి

గ్రామ సర్పంచ్ గుత్తి చెన్నయ్య

తిమ్మారెడ్డిగూడ గ్రామ పంచాయతీ పరిధిలో హర్ ఘర్ జల్ కార్యక్రమం

(ప్రజా వాయిస్ షాబాద్)

తిమ్మారెడ్డిగూడ గ్రామంలో హర్ ఘర్ జల్ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ గుత్తి చెన్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి మాట్లాడుతూ హర్ ఘర్ జల్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి మంచినీటి సౌకర్యంతో పాటు ఇంటింటా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వర్షపు నీటిని భూగర్భ జలాల పెంపునకు వినియోగించుకునేలా ప్రతి కుటుంబం ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు గ్రామంలో నీటి వృథాను అరికట్టి, వర్షపు నీటిని సంరక్షించేందుకు ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, మాజీ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్

జిన్నారం ప్రజావాయిస్

గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని 11వ వార్డు రాంనగర్ కాలనీకి చెందిన కటికల మరియమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ తన సీకేజీ యువసేన ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో సీకేజీ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సమాచార హక్కు చట్టం 2005 ఆవిర్భావ దినోత్సవం

- ఆర్టీఐపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి
- సమాచార హక్కును సులభంగా అందుబాటులోకి తేవాలి
- నవంబర్‌లో జంతర్‌మంతర్ వద్ద ప్రజాస్వామ్య పద్ధతిలో ధర్నా
- జిల్లా స్థాయిలో ఆర్టీఐ సమన్వయ వ్యవస్థను పటిష్టం చేయాలి
- సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ చైర్మన్ డా. చంటి ముదిరాజ్

ప్రజా వాయిస్ హైదరాబాద్ :

సమాచార హక్కు చట్టం 2005 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆర్టీఐ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ చైర్మన్ డా. చంటి ముదిరాజ్ కోరారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సమాచార హక్కు చట్టం 2005 ఆవిర్భావ దినోత్సవం, అవగాహన సదస్సును కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జాతీయ చైర్మన్ డా. చంటి ముదిరాజ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి షేక్ గౌస్ సభాధ్యక్షత వహించగా, తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ చైర్మన్ డా. చంటి ముదిరాజ్ మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం ప్రాధాన్యతను



ప్రజలకు తెలియజేయడంతో పాటు, సమాచారం పొందే హక్కుపై విస్తృతంగా అవగాహన కల్పించేందుకు తమ కమిటీ దేశవ్యాప్తంగా కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ వ్యవస్థల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంలో ఆర్టీఐ చట్టం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రజల హక్కులకు సంబంధించిన సమస్యలపై సమాచార హక్కు చట్టం సాధన కమిటీ నిరంతరం 24ఐ7 పనిచేస్తూ ప్రజా చైతన్యం కోసం కృషి చేస్తోందన్నారు. ఆర్టీఐ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజలకు సమాచార హక్కు సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.నవంబర్‌లో పార్లమెంట్ శీతాకాల సమావేశాల సమయంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆర్టీఐకి సంబంధించిన ప్రధాన డిమాండ్లపై ప్రజాస్వామ్య పద్ధతిలో ధర్నా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆర్టీఐ వ్యవస్థకు సంబంధించిన సమస్యలను, ప్రజల హక్కుల పరిరక్షణకు సంబంధించిన అంశాలను ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు.ఆర్టీఐ కోసం మా సంస్థ కార్యక్రమం ఒకరోజుకే పరిమితం కాదు.. ప్రజల హక్కుల కోసం నిరంతరం 24ఐ7 పనిచేస్తూనే ఉంటాము అని డా. చంటి ముదిరాజ్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం జిల్లా స్థాయిలో ఏర్పాటు చేస్తున్న ఆర్టీఐ జిల్లా సమన్వయ వ్యవస్థలో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ సభ్యులకు తగిన ప్రాముఖ్యత కల్పించాలని కోరారు. గతంలో ఉన్న జిల్లా ఆర్టీఐ మానిటరింగ్ సభ్యుల వ్యవస్థను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సదస్సులో సమాచార హక్కు చట్టం 2005 ప్రాధాన్యత, ప్రజలకు సమాచారం పొందే హక్కు, ప్రభుత్వ వ్యవస్థల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంలో ఆర్టీఐ చట్టం పాత్రపై అవగాహన కల్పించారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల, నియోజకవర్గ, గ్రామ స్థాయి సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ముఖ్య అతిథులు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, మీడియా ప్రతినిధులు, సహకరించిన ప్రతి ఒక్కరికీ సమాచార హక్కు చట్టం సాధన కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, జాతీయ ఉపాధ్యక్షులు గోపీనాథన్ కట్టెకోల, జాతీయ కార్యదర్శులు తోట శ్రీనివాస్, రాధాకృష్ణ, జాతీయ సహాయ కార్యదర్శులు అన్నవరం సందీప్‌రెడ్డి, వంగల వివేకానంద, మార్క నవీన్‌కుమార్, రాష్ట్ర కోఆర్డినేటర్ మహేష్, రాష్ట్ర లీగల్ వింగ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు రవికుమార్, రాష్ట్ర కన్వీనర్ కిఫాయత్, అధికార ప్రతినిధి సతీష్‌కుమార్, కో-కన్వీనర్ కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రకాష్ పటేల్, అరవింద స్వామి, కార్తీక్‌రెడ్డి, సాయిరాం, రాష్ట్ర కార్యదర్శులు నవీన్‌కుమార్, కండే సాగర్, కేడల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఏడు నెలలు నీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలి

- మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి
- మళ్లీ వర్షాలు పడేంతవరకు ఏడు నెలలపాటు మంజీరా, సింగూరు నీళ్లను తాగునీటి అవసరాల కోసం జాగ్రత్త గా వాడుకోండి
- సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు,కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు జగ్గారెడ్డి సూచన
- సంగారెడ్డి నియోజకవర్గంలో తాగునీరు,విద్యుత్ సమస్యల పరిష్కారంపై అధికారులతో సమీక్ష
- సింగూరులో 29 టీఎంసీలకు బదులు కేవలం 3 టీఎంసీలే నీరు మాత్రమే ఉంది
- నీటి వృథాను అరికట్టేందుకు ఇంటింటా అవగాహన కల్పించాలి

ప్రజా వాయిస్,సంగారెడ్డి :

సంగారెడ్డి నియోజకవర్గంలో రానున్న ఏడు నెలలు తాగునీటి విషయంలో పరిస్థితి తీవ్రంగా ఉండే అవకాశం ఉందని, అందుబాటులో ఉన్న ప్రతి నీటి చుక్కను జాగ్రత్తగా వినియోగించుకోవాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. తాగునీరు, విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, మున్సిపల్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల పరిధిలో నెలకొన్న పరిస్థితులపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ, "కాలం చెప్పినట్లు, కాలానికి అనుగుణంగా నడుచుకోవాలి. ఈసారి సరైన వర్షాలు లేవు. మనం సింగూరు డ్యామ్‌పై ఆధారపడి ఉన్నాం. సింగూరుకు వచ్చే నీరు కర్ణాటక, మహారాష్ట్రలో కురిసే వర్షాలపై ఆధారపడి ఉంటుంది. ఎవరినో నిందిస్తే సమస్య పరిష్కారం కాదు. నీళ్లు ఉంటేనే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. నీటి లభ్యతను బట్టే



వినియోగం ఉండాలి" అని పేర్కొన్నారు.సింగూరు ప్రాజెక్టులో 29 టీఎంసీల సామర్థ్యానికి ప్రస్తుతం సుమారు 3 టీఎంసీల నీరు మాత్రమే ఉందని సమావేశంలో అధికారులు వివరించారు. ప్రస్తుతం ఉన్న నీటితో డిసెంబర్ వరకు తాగునీటి సరఫరా కొనసాగించగలమని భావిస్తున్నట్లు తెలిపారు. దసరా తర్వాత రోజు విడిచి రోజు తాగునీరు విడుదల చేయనున్నట్లు మిషన్ భగీరథ ఎస్ఈ వెల్లడించారు.నీటి కొరతపై ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని జగ్గారెడ్డి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీలతో పాటు నాలుగు మండలాల గ్రామాల్లో నీటి లభ్యత, పొదుపుపై చాటింపు వేయాలని సూచించారు. మున్సిపాలిటీల్లో పాంప్లెట్లు, మైకింగ్ ద్వారా ఇంటింటా ప్రచారం నిర్వహించాలని చెప్పారు.ఇళ్లలో నల్లా నీటిని వృథా చేయకుండా అవసరం లేని సమయంలో ట్యాప్‌లను తప్పనిసరిగా మూసివేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సింగిల్ ఫేజ్ మోటార్ల వద్ద పెద్దఎత్తున నీరు వృథా అవుతున్నందున దానిని నియంత్రించాలని సూచించారు. టైమర్ స్టార్టర్లు ఏర్పాటు చేయడం ద్వారా నీటి వృథాను తగ్గించవచ్చని సమావేశంలో సూచనలు వచ్చాయి. సింగిల్ ఫేజ్ మోటార్ల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసే అంశాన్ని కూడా అధికారులు ప్రతిపాదించారు.వచ్చే ఏడు నెలలు పరిస్థితి తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అందరూ బాధ్యతగా వ్యవహరించి అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలి" అని జగ్గారెడ్డి కోరారు. మంజీరా, సింగూరు పరిధిలో మోటార్లతో యథేచ్ఛగా నీటిని తోడటాన్ని నియంత్రించాలని సమావేశం లో పలువురు సూచించారు.మంజీరా బ్యారేజీ నుంచి హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ నీటి డ్రాయింగ్‌ను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నియంత్రించేలా విజ్ఞప్తి చేస్తే, సంగారెడ్డి మున్సిపాలిటీకి మరికొంత కాలం తాగునీటి సరఫరా కొనసాగించే అవకాశం ఉంటుందని సమావేశంలో చర్చించారు. అవసరమైతే మున్సిపాలిటీల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు.కంది పరిసర చెరువుల్లో నీరు అందుబాటులో ఉందని, గ్రామంలోని 28 బోర్లకు అవసరమైన మోటార్లు ఏర్పాటు చేయాలని నాయకులు కోరారు. మిషన్ భగీరథ సరఫరాలో ప్రెషర్ పెంచితే ఇస్మాయిల్‌ఖాన్‌పేట, హనుమాన్‌నగర్, ఫసల్‌వాడి గ్రామాలకు నీటి సరఫరా మెరుగుపడుతుందని సమావేశంలో ప్రస్తావించారు. కంది మండలం తోపుగొండలో మిషన్ భగీరథ నీరు నెలకు నాలుగుసార్లు మాత్రమే వస్తోందని నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాల్లో పశువులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా సర్పంచ్‌లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.సింగూరు ప్రాజెక్టు నుంచి ఇటీవల నీటిని విడుదల చేసిన అంశంపైనా జగ్గారెడ్డి స్పందించారు. ఢిల్లీ నుంచి వచ్చిన డ్యామ్ సేఫ్టీ అధికారులు సింగూరు ప్రాజెక్టును పరిశీలించగా, కట్టలో కొంత భాగం దెబ్బతిన్నట్లు గుర్తించి మరమ్మతుల కోసం కొంత నీటిని విడుదల చేయాలని సూచించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ పర్యవేక్షణలో నిపుణుల కమిటీ సూచనల మేరకే నీటిని విడుదల చేసినట్లు చెప్పారు. భవిష్యత్తులో డ్యామ్‌ను కాపాడుకోవాలనే ఉద్దేశంతోనే నీటిని విడుదల చేశారు. ప్రతిపక్షాలు విమర్శలు చేయడం సహజమే కానీ, సాంకేతిక నిపుణుల సూచనల మేరకు తీసుకున్న నిర్ణయాన్ని రాజకీయం చేయడంలో అర్థం లేదు" అని జగ్గారెడ్డి పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. నియోజకవర్గంలో విద్యుత్ బ్రేక్‌డౌన్లు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటి కారణంగా మోటార్లు కాలిపోతున్నాయని నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యల పరిష్కారంపై వచ్చే మంగళవారం ఉదయం 11 గంటలకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు జగ్గారెడ్డి తెలిపారు.

మోటకొండూరులో రెండు రోడ్డు ప్రమాదాలు



బైకులు ఢీకొని నలుగురికి గాయాలు

తీవ్రంగా నిరాశపరిచిన 108..

ఆలస్యంగా అంబులెన్స్

వాహనాల సంఖ్య పెంచాలని స్థానికుల డిమాండ్

మోటకొండూరు అక్టోబర్ 7 (ప్రజా వాయిస్):-

మోటకొండూరు మండలంలో బుధవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలయ్యాయి. ముత్తిరెడ్డిగూడెం లక్ష్మీ వైన్స్ ఆవరణ వద్ద రెండు బైకులు ఎదురెదురుగా బలంగా ఢీకొనడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు 108కి సమాచారం ఇచ్చినా, అంబులెన్స్ ఘటనా స్థలానికి చేరుకోవడం తీవ్ర ఆలస్యమైంది. తీవ్ర రక్తస్రావంతో బాధపడుతూ క్షతగాత్రులు రోడ్డుపైనే నరకయాతన అనుభవించారు. గోల్డెన్ అవర్‌లో వైద్యం అందకపోతే ప్రాణాలు గాల్లో కలిసే ప్రమాదం ఉందని, అంబులెన్సుల కొరతతో అమాయకుల ప్రాణాలు పోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర సమయాల్లో ఆదుకోవాల్సిన 108 సేవలు ఇలా జాప్యం కావడం దారుణమని, ప్రభుత్వం తక్షణమే స్పందించి అంబులెన్సుల సంఖ్యను పెంచాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అనంతరం గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు.

కాటేపల్లి వంతెన వద్ద కారు, బొలెరో వాహనాల ఢీ తప్పిన పెను ప్రమాదం ....

మరోవైపు.. కాటేపల్లి వంతెన వద్ద కారు, బొలెరో వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో రెండు వాహనాలు ముందుభాగం ధ్వంసం కాగా, అదృష్టవశాత్తూ ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. కారును ఆత్మకూరుకు చెందిన మజ్జిగ నరేష్, బొలెరోను సంగారెడ్డి జిల్లాకు చెందిన ఎండీ సమద్ ఖురేషీ నడుపుతున్నట్లు గుర్తించారు. ఈ రెండు ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సహకార సంఘాలలో రైతులకు అన్ని రకాల సేవలు అందాలి

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు

బీబీపేట్ జంగంపల్లి విండో నూతన పాలకవర్గాల ప్రమాణ స్వీకారం

ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్

ప్రజా వాయిస్ కామారెడ్డి/

రైతు సహకార సంఘాలలో రైతులకు అన్ని రకాల సేవలు అందాలని మెరుగైన మార్కెట్ సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ ఆకాంక్షించారు. బుధవారం బిబిపేట జంగంపల్లి సింగిల్ విండో నూతన పాలకవర్గాల ప్రమాణ స్వీకారం జరిగింది. ప్రమాణస్వీకారోత్సవాలకు షబ్బీర్ అలీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బిబిపేట సింగిల్ విండో చైర్మన్ గా సుతారి రమేష్, జంగంపల్లి సింగిల్ విండో చైర్మన్ గా యాదవ రెడ్డి ఇతర డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేపట్టారు.రైతులకు అండగా ప్రాథమిక రైతు సహకార సంఘాలు పనిచేయాలని రైతుల అభివృద్ధి కోసం నూతన పాలకవర్గాలు కృషి చేయాలని మహమ్మద్ అలీ షబ్బీర్ చెప్పారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రైతుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడితేనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.రైతులకు పంట రుణాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సేవలు సకాలంలో అందేలా సహకార సంఘాలు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. సహకార సంఘాలు కేవలం రుణాల పంపిణీకి మాత్రమే పరిమితం కాకుండా రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలను అందించే కేంద్రాలుగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా, పంట రుణమాఫీ, ఉచిత విద్యుత్, రైతు బీమా, సాగునీటి వనరుల అభివృద్ధి తదితర కార్యక్రమాలను అమలు చేస్తోందని షబ్బీర్ అలీ గారు తెలిపారు. రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడంతో పాటు వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం



చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఇల్యాస్ , జిల్లా గ్రంధాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, బీబీపేట్ సర్పంచ్ సాత్విక సాయి, బీబీపేట్ మండల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, మాజీ చైర్మన్ ఇంద్రసేన రెడ్డి, సొసైటీ చైర్మన్లు ఇంద్రకరణ్ రెడ్డి, గూడెం శ్రీనివాస్, భీంరెడ్డి, అనంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, సెల్ అధ్యక్షులు బాలరాజు, మాజీ జడ్పీటీసీ తీర్మల్ గౌడ్, నరేందర్ రెడ్డి, ఆశబోయిన శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు సందీప్ మధు యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు మహిళలు, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.